




www.navabhoomi.in | epaper.navabhoomi.in | RNI No:TELTEL:82083

# నవభూమి

ANUKSHANAM

NAVABHOOMI TELUGU DAILY

నవతరం తెలుగు దినపత్రిక








Published from Hyderabad and Vijayawada

ఎడిటర్ : అజీద్

హైదరాబాద్ | 11 ఆదివారం | మే 2025 | పేజీలు 12 | వెల: రూ.6 | సంపుటి:2 సంచిక: 236

Navabhoomi daily fallows..

Circulated at: Hyderabad, Rangareddy, Adilabad, Karimnagar,Warangal,Khammam, Nalgonda, Mahabubnagar,Medak, Nizamabad, Krishna,Guntur,Easrt Godavari, West Godavari,Prakasam, Nellore,Srikakulam,Vizianagaram,Visakhapatanam,Kurnool,Chittoor,Kadapa,and Anantapur


# కాల్పుల విరమణ

- భారత్-పాకిస్థాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం
- స్థానిక కాలమానం ప్రకారం సాయంత్రం 5 గంటల నుంచి అమలు
- భూమి, గగనతలం, సముద్ర మార్గాల్లో కాల్పులు, సైనిక చర్యల నిలిపివేత
- ఇరు దేశాల డీజీఎంఓల మధ్య కుదిరిన అంగీకారం
- 12న మరోసారి ఇరు దేశాల మధ్య చర్చలు జరిపే అవకాశం
- భారత విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ వెల్లడి
- ఇరు దేశాల మధ్య ఒప్పందాన్ని కుదుర్చానన్న యుఎస్ అధ్యక్షులు ట్రంప్

2






**న్యూఢిల్లీ-నవభూమిబ్యూరో**

గత కొన్ని రోజలుగా తీవ్ర ఉద్రిక్తతలతో వేడెక్కిపోయిన వాతావరణం చల్లబడేలా అత్యంత కీలక పరిణామం చోటుచేసుకుంది. భారత్, పాకిస్థాన్ మధ్య కాల్పుల విరమణకు ఒప్పందం కుదిరినట్లు భారత విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ అధికారికంగా ప్రకటించారు. ఈ ఒప్పందం తక్షణమే అమల్లోకి రానుండటం సరిహద్దు ప్రాంతాల్లో శాంతియుత వాతావరణానికి దోహదపడుతుందని భావిస్తున్నారు. భారత కాలమానం ప్రకారం సాయంత్రం 5 గంటల నుంచి భూమి, గగనతలం, సముద్ర మార్గాల్లో అన్ని రకాల కాల్పులు, సైనిక కార్యకలాపాలను నిలిపివేయాలని ఇరు దేశాలు అంగీకరించినట్లు విక్రమ్ మిస్రీ వెల్లడించారు. ఈ మేరకు పాకిస్థాన్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ మిలిటరీ ఆపరేషన్స్ (డీజీఎంఓ) ఈ మధ్యాహ్నం భారత డీజీఎంఓతో ఫోన్‌లో సంభాషించారని, ఈ సంభాషణలోనే ఇరుపక్షాలు ఈ నిర్ణయానికి వచ్చినట్లు ఆయన తెలిపారు.

అంతకుముందు, అమెరికా మాజీ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తన బృందం సుదీర్ఘ చర్చల అనంతరం భారత్, పాకిస్థాన్ మధ్య 'సంపూర్ణ మరియు తక్షణ కాల్పుల విరమణ'కు మధ్యవర్తిత్వం వహించిందని ప్రకటించారు. ఈ ప్రకటన వెలువడిన కొద్దిసేపటికే న్యూఢిల్లీ నుంచి అధికారిక ప్రకటన వెలువడటం గమనార్హం. అటు, పాక్ నుంచి అందించిన సమాచారం ప్రకారం, ఈ కాల్పుల విరమణ ఒప్పందం తక్షణమే అమల్లోకి వచ్చినట్లు తెలుస్తోంది. ఇరు దేశాల సైనిక ఉన్నతాధికారులు మే 12వ తేదీన

## జమ్మూలో భారీ చొరబాటుకు బ్రేక్!

◆ ఏడుగురు తీవ్రవాదుల కాల్చివేత..!



2

**శ్రీనగర్-నవభూమిబ్యూరో:** కాశ్మీర్‌లో పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ జరుపుతున్న దాడులతో ఉక్కిరిబిక్కిరవుతున్న పాకిస్తాన్ ఎదురుదాడులకు తీవ్ర ప్రయత్నాలు చేస్తోంది. ఓవైపు భారత్‌లోని సరిహద్దు నగరాలపై డ్రోన్లు పంపుతూ దాడులకు చేస్తున్న ప్రయత్నాల్ని ఆర్మీ ఎక్కడికక్కడ అడ్డుకుంటుండటంతో దిక్కుతోచని స్థితిలో పడుతోంది. అదే సమయంలో నియంత్రణ రేఖ వెంబడి తీవ్రంగా కాల్పులు జరుపుతోంది. ఈ కాల్పుల్ని అడ్డుపెట్టుకుని భారత్‌లోకి ఉగ్రవాదుల్ని చొప్పించేందుకు చేసిన ప్రయత్నాలు మరోసారి విఫలమయ్యాయి. తాజాగా జమ్మూ కాశ్మీర్ లోని సాంబా సెక్టార్‌లో భారత్ లోకి ప్రవేశించేందుకు ప్రయత్నించిన ఉగ్రవా దుల్ని సరిహద్దు భద్రతా దళం (బీఎస్ఎఫ్) సమర్థంగా అడ్డుకుంది. అంతే కాదు ఏడుగురు ఉగ్రవాదుల్ని కూడా హతమార్చింది. పాకిస్తాన్ రేంజర్ల సాయంతో సాంబా సెక్టార్ లోకి ప్రవేశించేందుకు ప్రయత్నించిన ఏడుగురు ఉగ్రవాదుల్ని హతమార్చినట్లు బీఎస్ఎఫ్ వర్గాలు ప్రకటించాయి. సరిహద్దుల్లోని పాకిస్తాన్ పోస్టు

## మావోల వేటకు విరామం

- కర్రెగుట్టల్లో బంకర్లను ఏర్పాటు చేసుకుని మావోలు ఉన్నట్లు గుర్తింపు
- కర్రెగుట్టలను జల్లెడ పడుతున్న సీఆర్పీఎఫ్ బలగాలు వెనక్కిరావాల్సిందే
- బార్డర్‌కు వెళ్లాల్సిందిగా సీఆర్పీఎఫ్ బలగాలకు కేంద్రం ఆదేశాలు
- భారత్ - పాకిస్థాన్ వార్ నేపథ్యంలో కేంద్రం సంచలన నిర్ణయం

2



**ములుగు-నవభూమిబ్యూరో**

మావోయిస్టుల ఏరివేతే లక్ష్యంగా కొనసాగుతున్న ఆపరేషన్ కగార్‌కు తాత్కాలిక బ్రేక్ పడింది. ఆపరేషన్ కగార్‌పై ఆపరేషన్ సిందూర్ ఎఫెక్ట్ పడింది. భారత్ - పాకిస్థాన్ వార్ నేపథ్యంలో కేంద్రం సంచలన నిర్ణయం తీసుకుంది. మావోయిస్టులను ఏరివేసేందుకు కర్రెగుట్టలను జల్లెడ పడుతున్న సీఆర్పీఎఫ్ బలగాలు వెనక్కి రావాల్సిందిగా కేంద్రం ఆదేశించింది. దీంతో కర్రెగుట్టల్లో మావోయిస్టుల వేటకు విరామం పడింది. దాదాపు ఐదు వేల మందికి పైగా బలగాలను కేంద్రం వెనక్కి రిప్పిస్తోంది. కర్రెగుట్టల నుంచి బలగాలు వెనక్కి వెళ్తున్నాయి. తెలంగాణ - ఛత్తీస్‌గఢ్ సరిహద్దులోని సీఆర్పీఎఫ్ కోబ్రా జవాన్లను తమ హెడ్ క్వార్టర్స్‌లో రిపోర్ట్ చేయాలని ఆదేశాలు జారీ అయ్యాయి. దీంతో కేంద్ర బలగాలు హుటాహుటిన వెనుతిరుగు తున్నాయి.


ములుగు జిల్లాలోని వెంకటాపురం, ఆలూబాక, వీరభద్రవరం పెద్దగుట్ట పరిసరాల్లో మోహరించిన బలగాలకు రిలీవ్ ఇచ్చారు. కేంద్రం ఆదేశాల మేరకు ఆదివారం ఉదయంలోగా భారత్- పాక్ బార్డర్‌కు బలగాలు వెళ్లనున్నాయి. కాగా.. వచ్చే ఏడాది మార్చి నాటికి మావోయిస్టులు లేకుండా చేయడమే లక్ష్యంగా చేపట్టిన ఆపరేషన్ కగార్ దూకుడుగా సాగుతోంది. ఆపరేషన్ కగార్‌లో జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో భారీగా మావోయిస్టులు ప్రాణాలు కోల్పోయారు. వారిలో పలువురు అగ్రనేతలు కూడా ఉన్నారు. గత కొద్దిరోజులుగా ఆపరేషన్ కర్రెగుట్టలు పేరుతో మావోయిస్టులను ఏరివేసేందుకు భద్రతా బలగాలు కర్రెగుట్టలపై సెర్చ్ కొనసాగిస్తున్నాయి. మావోయిస్టు అగ్రనేతలే టార్గెట్‌గా ఆపరేషన్ కర్రెగుట్టల్లో పెద్ద ఎత్తున కూబింగ్ కొనసాగిస్తున్నారు. 145 ఎకరాల విస్తీర్ణం ఉన్న కర్రెగుట్టల చుట్టూ దాదాపు పదివేల మంది భద్రతా బలగాలు మోహరించి ఉన్నాయి.

అలాగే కర్రెగుట్టల్లో బంకర్లను ఏర్పాటు చేసుకుని మావోయిస్టులు ఉన్నట్లు గుర్తించిన భద్రతా బలగాలు కర్రెగుట్టలను జల్లడపడుతున్నాయి. గత కొద్దిరోజులుగా జరుగుతున్న కూంబింగ్‌లో పలువురు మావోయిస్టులు

## పాకిస్థాన్‌కు ఐఎంఎఫ్ భారీ సహాయం

- పాకిస్థాన్‌కు 1 బిలియన్ అమెరికన్ డాలర్ల రుణం
- ఐఎంఎఫ్ నిర్ణయంపై రాజకీయ దుమారం
- పాక్ రుణ వ్యవహారంపై కాంగ్రెస్ విమర్శలు...

2




**న్యూఢిల్లీ-నవభూమిబ్యూరో**

భారత్, పాకిస్థాన్ దేశాల మధ్య ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్న తరుణంలో, అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) పాకిస్థాన్‌కు భారీ ఆర్థిక సహాయం ప్రకటించడం గమనార్హం. పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతిగా భారత్ చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' అనంతరం నెలకొన్న యుద్ధ వాతావరణం నేపథ్యంలో, పాకిస్థాన్‌కు నిధులు ఇవ్వరాదని భారత్ అభ్యంతరం వ్యక్తం చేసినప్పటికీ, ఈ నిర్ణయం వెలువడటం చర్చనీయాంశమైంది. వివరాల్లోకి వెళితే, ఎక్స్‌టెండెడ్ ఫండ్ ఫెసిలిటీ (ఈఎఫ్ఎఫ్) కింద

## నైరుతి ఆగమనం

- రుతుపవనాల రాకపై చల్లని కబురు చెప్పిన ఐఎండీ
- సాధారణం కన్నా 5 రోజులు ముందుగా రుతుపవనాల ఆగమనం
- ఖరీఫ్ పంటల సాగుకు రైతులకు అనుకూలం
- భారత వాతావరణ విభాగం (ఐఎండీ) వెల్లడి
- ఈ ఏడాది దేశంలో సాధారణం కన్నా అధిక వర్షపాతం అంచనా

2

**న్యూఢిల్లీ-నవభూమిబ్యూరో**

దేశ ప్రజలు, ముఖ్యంగా రైతులు ఎదురుచూస్తున్న నైరుతి రుతుపవనాలు ఈ ఏడాది కేరళ తీరాన్ని కాస్త ముందుగానే పలకరించనున్నాయి. సాధారణంగా జూన్ 1న ప్రవేశించే రుతుపవనాలు, ఈసారి మే 27వ తేదీనే కేరళను తాకే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) శనివారం ఒక ప్రకటనలో తెలియజేసింది. ఇది సాధారణ తేదీ కన్నా ఐదు రోజులు ముందు కావడం గమనార్హం.

రుతుపవనాల ముందస్తు ఆగమనం ఖరీఫ్ పంటల సాగు పనులను త్వరగా ప్రారంభించేందుకు రైతులకు ఎంతగానో ఉపకరిస్తుంది. ఈ అంచనాతో రైతులు వ్యవసాయ పనులకు సన్నద్ధం కావడానికి వీలు కలుగుతుంది. భారత ప్రధాన భూభాగంలోకి రుతుపవనాల ప్రవేశానికి కేరళ ఆరంభమే ఒక ముఖ్యమైన సూచికగా పరిగణిస్తారు. వేడి, పొడి

## అట్టహాసంగా మిస్ వరల్డ్ పోటీలు ప్రారంభం

- 110కి పైగా దేశాలకు చెందిన సుందరీమణులు ఈ కిరీటం కోసం పోటీ
- గచ్చిబౌలి స్టేడియంలో 'జయజయహే తెలంగాణ రాష్ట్ర గీతం ఆలాపనతో పోటీలు షురూ
- 250 మంది కళాకారులతో పేరిణి నృత్య ప్రదర్శన

2



**హైదరాబాద్-నవభూమిబ్యూరో**

నగరంలో 72వ మిస్ వరల్డ్ పోటీలు-2025 అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. 110కి పైగా దేశాలకు చెందిన సుందరీమణులు ఈ కిరీటం కోసం పోటీపడుతున్నారు. భారత్ తరపున మిస్ ఇండియా నందిని గుప్తా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. గచ్చిబౌలి స్టేడియంలో 'జయజయహే తెలంగాణ రాష్ట్ర గీతం ఆలాపనతో పోటీలు మొదలయ్యాయి. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు

## భారత భూమి కోసం ప్రాణాలు అర్పిస్తాం

- పాక్‌కు ఇస్లాం పేరు పలికే అర్హత లేదు: అసదుద్దీన్
- ఇస్లాం పేరుతో పాకిస్తాన్ మారణహోమం సృష్టిస్తోంది
- తెలంగాణ ఉర్దూ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమంలో ఎంపీ అసదుద్దీన్

2



**హైదరాబాద్-నవభూమిబ్యూరో**

భారత్‌లోని హిందువులు, ముస్లింల మధ్య విద్వేషాలు సృష్టించేందుకు పాకిస్తాన్ ప్రయత్నిస్తోందని, భారత ముస్లింలు దేశం కోసం ప్రాణాలు ఇవ్వడానికి కూడా సిద్ధంగా ఉన్నారని ఎంఐఎం పార్టీ అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ పేర్కొన్నారు. తెలంగాణ ఉర్దూ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్ బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్‌లో జరిగిన ఉర్దూ జర్నలిస్ట్ అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాకిస్తాన్‌పై తీవ్ర విమర్శలు చేశారు.

## రజనీపై పోలీసుల దౌర్జన్యం

- ఓ కుటుంబాన్ని పరామర్శించేందుకు వచ్చిన మాజీ మంత్రి
- విడదల రజని ప్రధాన అనుచరుడు శ్రీకాంత్ రెడ్డి అరెస్టు
- మాజీ మంత్రి కారులో ఉన్న శ్రీకాంత్‌ను తీసుకెళ్లే ప్రయత్నం
- పోలీసులను అడ్డుకున్న మాజీ మంత్రి..పోలీసులతో వాగ్వివాదం
- ఎందుకు అరెస్ట్ చేస్తున్నారో చెప్పాలంటూ రజనీ నిలదీత
- రజినీని పక్కకు నెట్టివేస్తూ కేసు పెడతానని సీఐ హెచ్చరిక

2



**పల్నాడు జిల్లా-నవభూమి బ్యూరో**

వైసీపీ నేత, మాజీ మంత్రి విడదల రజనీపై పోలీసులు దౌర్జన్యంగా వ్యవహరించడం ఏపీ వ్యాప్తంగా హాట్ టాపిక్ గా మారింది. పల్నాడు జిల్లా మానుకొండవారిపాలెంలో ఓ కుటుంబాన్ని పరామర్శించేందుకు వెళ్లిన మాజీ మంత్రితో పోలీసులు అనుచితంగా ప్రవర్తించినట్టు చెబుతున్నారు. ఈ ఘటన పట్ల వైసీపీ నేతలు తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నారు. విడదల రజని ప్రధాన అనుచరుడు శ్రీకాంత్ రెడ్డిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఆమె కారు ఆపి, శ్రీకాంత్ రెడ్డిని అరెస్ట్ చేశారు. మాజీ మంత్రి కారులో ఉన్న శ్రీకాంత్‌ను తీసుకెళ్లడానికి పోలీసులు యత్నించారు. దీంతో పోలీసులకు విడదల రజనికి తీవ్ర వాగ్వాదం చోటుచేసు కుంది. ఎందుకు అరెస్ట్ చేస్తున్నారో చెప్పాలం టూ నిలదీశారు. ఈ క్రమంలో అక్కడున్న సీఐ పక్కకి పో అంటూ విడుదల రజినీ పట్ల అనుచితంగా మాట్లాడమే కాకుండా ఆమెను పక్కకు నెట్టేశారు. అంతే కాకుండా మీ పైన కూడా కేసు పెడతానంటూ పోలీసు అధికారి ఆమెను హెచ్చరించిన వీడియో వైరల్ అవుతోంది. ఈ క్రమంలోనే ఒక మహిళ, మాజీ మంత్రి అని కూడా చూడకుండా పోలీసుల ప్రవర్తించిన తీరు ప్రస్తుత కూటమి ప్రభుత్వ అరాచక పాలనకు నిదర్శనమని వైసీపీ నేతలు ఆరోపిస్తున్నారు. కూటమి ప్రభుత్వం

## యుద్ధప్రాంతంలో చిక్కుకున్న మన విద్యార్థులు

- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్‌కు సమాచారం
- విద్యార్థులను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని మంత్రి ఆదేశం
- షేర్-ఇ-కాశ్మీరీ వ్యవసాయ విజ్ఞాన, సాంకేతిక విశ్వవిద్యాలయంలో చదువుతున్న 23 మంది తెలుగువారు

2

**హైదరాబాద్-నవభూమిబ్యూరో**

భారత్ పాకిస్తాన్ దేశాల మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్న విషయం తెలిసిందే. ముఖ్యంగా పాకిస్తాన్, భారత దేశాల సరిహద్దు రాష్ట్రాలలో ప్రజలు భారత్ పాకిస్తాన్ మధ్య కొనసాగుతున్న యుద్ధం నేపథ్యంలో తీవ్ర భయాందోళనల మధ్య బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. ఇక ఇదే సమయంలో తెలుగు రాష్ట్రాలకు సంబంధించి యుద్ధ ప్రాంతంలో 23 మంది తెలుగు విద్యార్థులు చిక్కుకుపోయారు. ప్రస్తుతం వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ప్రయత్నం కొనసాగుతుంది. యుద్ధ ప్రాంతంలో చిక్కుకున్న తెలుగు విద్యార్థులు యుద్ధ ప్రాంతంలో చిక్కుకుపోయిన 23 మంది తెలుగు విద్యార్థులను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అధికారులను ఆదేశించారు. జమ్మూ కాశ్మీర్ లోని షేర్-ఇ-కాశ్మీరీ వ్యవసాయ విజ్ఞాన, సాంకేతిక విశ్వవిద్యాలయానికి చెందిన వీరంతా తమను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని వారంతా లేఖలో కోరటంతో మంత్రి అధికారులను ఈ మేరకు ఆదేశించారు.

**సురక్షిత ప్రాంతాలకు తరలించేలా చర్యలు :** బండి సంజయ్ ఆదేశం యూనివర్శిటీ డీన్ తో, జిల్లా యంత్రాంగంతో మాట్లాడి వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించేలా చర్యతీసుకోవాలని మంత్రి బండి సంజయ్ చెప్పారు. గత కొద్దిరోజులుగా పాకిస్తాన్ డ్రోన్ల సాయంతో, క్షిపిణిలతో కాశ్మీర్ లోని ప్రజలు నివసిస్తున్న ఇండ్లు, ప్రభుత్వ కార్యాలయాలు, ఆర్మీ శిబిరాలపై దాడి చేస్తుండటంతో ఆ ప్రాంత ప్రజలంతా భయాందోళనల్లో ఉన్నారు. దీనికితోడు విమానాశ్రయాలను కూడా మూసివేయడంతో అక్కడ చదువుకుంటున్న తెలుగు విద్యార్థులు బయటకు రాలేక ఇబ్బంది పడుతున్నారు. కంట్రోల్ రూమ్ కు ఇప్పటికి

## వసతిగృహ విద్యార్థులకు స్పెషల్ కిట్లు

- విద్యార్థుల కోసం మరో పథకం తెస్తున్న కూటమి ప్రభుత్వం..
- ఏపీలోని గురుకుల, వసతి గృహ విద్యార్థుల కోసం సరికొత్త స్కీమ్
- ఉచిత నీట్ కోచింగ్ సెంటర్లు 10కి పెంపుదల
- మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి వెల్లడి

2




**అమరావతి-నవభూమి బ్యూరో**

ఏపీలో కూటమి ప్రభుత్వం విద్యార్థులకు మరో తీపి కబురు ప్రకటించనుంది. ఇప్పటికే ఎన్నికల హామీల్లో భాగంగా తల్లికి వందనం పథకాన్ని కొనసాగిస్తున్న సర్కారు.. ప్రతి విద్యార్థి తల్లి ఖాతాలో రూ. 15000 నగదు జమ చేయనుంది. వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభం కాగానే ప్రభుత్వం విద్యార్థుల తల్లుల ఖాతాల్లో నగదు జమ చేయనుంది. కేవలం టెన్త్ విద్యార్థులకు మాత్రమే పరిమితమైన ఈ స్కీమ్‌ను, ఇంటర్ విద్యార్థులకు సైతం పొడిగించారు. అలానే అధికారంలోకి రాగానే పెద్ద పండుగ పేరుతో ప్రతి బడిలో మౌలిక సదుపాయాల కల్పనకై చర్యలు తీసుకుంది. ఇప్పటి వరకు అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకం మెనూలో సైతం మార్పులు తెచ్చారు. ఇక ఇప్పుడు మరో కొత్త పథకంతో విద్యార్థులకు మేలు చేకూర్చేందుకు శ్రీకారం చుట్టింది. ఏపీలోని గురుకుల, వసతి గృహ విద్యార్థుల కోసం సరికొత్త స్కీమ్ ను అమలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఇప్పటి వరకు అన్ని వసతి గృహాలలో గల విద్యార్థులకు కాస్మోటిక్ ఛార్జీలు, ఇతర సౌకర్యాలు కల్పించడంలో అక్కడక్కడా విమర్శలు వచ్చాయి. ఆ విమర్శలకు ఫుల్ స్టాప్ పెడుతూ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వసతి గృహాలలో చదివే విద్యార్థులకు స్పెషల్ కిట్స్ అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోనుంది. ఇదే విషయాన్ని మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి వెల్లడించారు. మంత్రి చెప్పిన ప్రకటన మేరకు, విద్యార్థులకు వచ్చే విద్యా సంవత్సరం నుంచి కాస్మోటిక్ కిట్స్, నైట్ డ్రెస్ లను ప్రభుత్వం అందజేయనుంది. ప్రభుత్వం కాస్మోటిక్ కిట్స్ ఇవ్వడం ద్వారా వసతి గృహాలలో విద్యార్థులు ఎదుర్కొన్న సమస్యలకు ఫుల్ స్టాప్ పడుతుందని భావిస్తున్నారు. మరోవైపు గురుకులాలు, వసతి గృహాల్లో స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ నిధులతో అదనంగా




# సమస్య ఏదైనా.. పరిష్కారానికి యాప్

## నవ వార్త



**హైదరాబాద్-నవభూమి:** సమస్యలపై ఫిర్యాదు చేసేందుకు, పౌరసేవలు పొందేందుకు మై జీహెచ్ఎంసీ యాపను వినియోగించుకోవాలని శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్(సూచించారు. పారిశుధ్యం, రహదారులు, జనన, వీధి దీపాలు, నాలాల పూడికతీత వంటి సమస్యలపై అక్షాంశం, రేఖాంశం ద్వారా ఫొటోలు యాప్‌లో అప్‌లోడ్ చేసి ఫిర్యాదు చేస్తే వివరాలు నేరుగా సంబంధిత అధికారికి వెళ్తాయన్నారు. ఫిర్యాదు పరిష్కారమైందా, లేదా.? అన్న వెసులుబాటు యాప్‌లో ఉందని, పౌరులు ఫీడ్‌బ్యాక్ కూడా యాప్‌లో ఇవ్వొచ్చని పేర్కొన్నారు. ఆస్తి పన్ను చెల్లింపు, ట్రేడ్ లైసెన్స్ తీసుకోవడం, రుసుము చెల్లింపు, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు తీసుకోవడం వంటి సేవలూ యాప్ ద్వారా పొందవచ్చన్నారు. జీహెచ్ఎంసీ కార్యాలయాల లొకేషన్లు, వాతావరణ సూచన, ఇతరత్రా సమాచారమూ అందుబాటులో ఉంటుందన్నారు. యాప్ సేవలను పౌరులు సద్వినియోగం చేసుకోవాలని కర్ణన్ కోరారు. ఇదిలా ఉండగా అధికారుల తీరుతో ఈ సాంకేతికత అభాసుపాలవుతోందనే విమర్శలు ఉన్నాయి. యాప్ ద్వారా వచ్చే మెజార్టీ ఫిర్యాదులపై యంత్రాంగం స్పందిస్తోన్న దాఖలాలు అరుదు. క్షేత్రస్థాయిలో పర్యటించకుండా, సమస్య పరిష్కరించకుండానే ఫిర్యాదు క్లోజ్ చేసినట్టు పౌరులకు సందేశాలు వస్తుంటాయి. కొత్త కమిషనర్ వీటిపై ప్రత్యేక దృష్టి సారిస్తారా, ఎప్పటిలానే జరుగుతుందా అన్నది మున్ముందు చూడాలి.

## బాణాసంచా కాల్చితే జైలుకే.. పోలీస్ కమిషనర్ కీలక ఆదేశాలు జారీ..



**హైదరాబాద్-నవభూమి:** హైదరాబాద్ నగరంలో బాణాసంచా కాల్చడంపై పోలీసులు నిషేధం విధించారు. పెళ్లిళ్లు, పండుగలు, షాపుల ప్రారంభోత్సవాలు వంటి ఏ సందర్భంలోనైనా సరే బాణాసంచా కాల్చడంపై నిషేధం ఉంటుందని తెలిపారు. బాణాసంచా అమ్మేవారికి కూడా హెచ్చరికలు జారీ చేశారు. బాణాసంచా కాల్చితే జైలుకు పంపుతామని పోలీసులు స్పష్టం చేశారు. ఈ నిషేధానికి ప్రధాన కారణం దేశంలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులే. హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ తెలిపిన వివరాల ప్రకారం, దేశంలో యుద్ధ వాతావరణం నెలకొనడం, నగరంలో భద్రతా చర్యలు కొనసాగుతుండటంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. బాణాసంచా శబ్దాలు పేలుళ్లుగా అన్వయించుకునే ప్రమాదం ఉండటంతో ప్రజల్లో భయాందోళనలు నెలకొనే అవకాశం ఉంది. ఇది శాంతి భద్రతలకు విఘాతం కలిగించవచ్చు. అంతేకాకుండా, బాణాసంచా శబ్దాలు భద్రతా దళాలపై అనవసరమైన ఒత్తిడిని కలిగిస్తాయి. దేశవ్యాప్తంగా కొనసాగుతున్న ఉగ్రవాద కార్యకలాపాల నేపథ్యంలో, బాణాసంచా కాల్చడం వల్ల ఏదైనా అత్యవసర పరిస్థితి ఏర్పడితే స్పందించడం కష్టమవుతుంది. హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ హైదరాబాద్ సిటీ పోలీస్ చట్టం, 1348 ఫస్లీ (నం. %×శ%) సెక్షన్ 67 (సి) కింద ఆయనకు అప్పగించిన అధికారాలను వినియోగించుకుంటూ ఈ ఆదేశాలు జారీ చేశారు. ఈ చట్టం ప్రకారం ప్రజల భద్రతకు ముప్పు వాటిల్లే అవకాశం ఉంటే బాణాసంచాపై నిషేధం విధించే అధికారం పోలీసులకు ఉంటుంది. ఈ ఆదేశాలను ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ నిషేధాజ్ఞలు తదుపరి ఆదేశాల వరకు కొనసాగుతాయని తెలిపారు. ఈ నిషేధం కేవలం బాణాసంచా కాల్చడంపై మాత్రమే కాకుండా, వాటి అమ్మకాలపై కూడా వర్తిస్తుంది. లైసెన్స్ ఉన్న బాణాసంచా దుకాణదారులు కూడా ఈ సమయంలో బాణాసంచా అమ్మకాలు జరపకూడదని పోలీసులు హెచ్చరించారు. ఒకవేళ ఎవరైనా ఈ నిబంధనలను ఉల్లంఘిస్తే వారి లైసెన్సులు రద్దు చేయడంతో పాటు చట్టపరమైన చర్యలు కూడా తీసుకుంటామని తెలిపారు. హైదరాబాద్ నగర ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వేడుకల్లో బాణాసంచా కాల్చకుండా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు. ఇది దేశ భద్రతకు సంబంధించిన అంశం కాబట్టి ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏదైనా అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

## పట్నంలో పుట్టగొడుగుల్లా ప్రైవేటు ఆస్పత్రులు..

### ఆర్ఎంపీ డాక్టర్లు, నర్సులతో చికిత్సలు

**హైదరాబాద్-నవభూమి:** ఇబ్రహీంపట్నం నియోజకవర్గ కేంద్రం ప్రైవేటు దవాఖానాలకు కేరాఫ్‌గా మారింది. గల్లీకో దవాఖానాను ఏర్పాటుచేసి అర్హతలేని వైద్యులు, వైద్య చికిత్సలపై ఏమాత్రం అనుభవంలేని నర్సులను నియమించి పేద ప్రజల దగ్గర దవాఖానాల పేరిట పెద్ద ఎత్తున అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారు. ముఖ్యంగా ఇబ్రహీంపట్నంలోని ప్రైవేటు ఆస్పత్రులు వివాదాలకు కేరాఫ్‌గా మారుతున్నాయి. ప్రముఖ వైద్యులపేరిట ఆస్పత్రులకు అనుమతులు తీసుకుని స్టాఫ్ నర్సులు, ఆర్ఎంపీలతో వైద్యశాలలు కొనసాగిస్తున్నారు. అనుభవం, అర్హత ఉన్న డాక్టర్ల పేరుతో ఆస్పత్రులను నెలకొల్పి.. వైద్యులు నగరంలో ఎక్కడో ఉంటూ, స్థానికంగా ఉన్న నర్సులతో వాట్సప్ కాల్స్ ద్వారా వైద్య చికిత్సలు కొనసాగిస్తున్నారు. డబ్బుల సంపాదనే పరమావధిగా రోగుల ప్రాణాలతో చెలగాటమాడుతూ.. లక్షల్లో ఫీజులు వసూళ్లు చేస్తూ అమాయకపు ప్రజలను నిండా ముంచుతున్నారు. దీనిపై స్పందించాల్సిన ప్రభుత్వ యంత్రాంగం మాత్రం చూసీచూడనట్లుగా వ్యవహరిస్తోంది. పట్టణంలో సుమారు 20 వరకు ప్రైవేటు దవాఖాలను నెలకొల్పి వాటిలో స్టాఫ్ నర్సుల ద్వారా చికిత్సలు నిర్వహించి అమాయకులను బలి తీసుకుంటున్నారు. ఇటీవల ఇబ్రహీంపట్నం నియోజకవర్గ కేంద్రంలోని మంచాల రోడ్డులోగల విజయలక్ష్మి ఆస్పత్రిలో ఓ మహిళకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్ నిర్వహించగా, అది వికటించింది. ఆ సంఘటన మరువకముందే నగరంలో ఉన్న వైద్యురాలు.. స్టాఫ్ నర్సుల చేత వాట్సప్‌కాల్‌లో వైద్య చికిత్సలు చేయించటం ద్వారా ఓ తల్లి కడుపులోనే ఇద్దరు కవలల పిల్లలు మృతిచెందారు.

**ప్రైవేటు దవాఖానల్లో కొనసాగుతున్న భ్రూణహత్యలు**

ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో గతంలో ఓ ప్రైవేటు దవాఖానలో డెలవరీ కోసం వచ్చిన ఓ గిరిజన మహిళ ఆడ శిశువుకు జన్మనిచ్చింది. అప్పటికే ఆ మహిళకు ఇద్దరు ఆడపిల్లలు ఉండటంతో తనకు మగబిడ్డ కావాలనుకుంటే ఆడబిడ్డ పుట్టిందని, ఈ బిడ్డను నేను సాకలేనని చెప్పటంతో ఆ ఆస్పత్రి యాజమాన్యం ఆడబిడ్డను ఇతరులకు విక్రయించేందుకు సహాయంచేసింది. దీంతో వైద్యారోగ్యశాఖ అధికారులు ఆ దవాఖానను సీజ్ చేశారు. మళ్లీ రెండు నెలల తర్వాత అదే వైద్యులు పేరుమార్చి దవాఖానాను కొనసాగిస్తున్నారు. ఇలాంటి ఘటనలు ఇబ్రహీంపట్నంతోపాటు యాచారం మండలం మాల్‌లోని పలు ప్రైవేటు హాస్పిటళ్లలో కడుపులోనే ఆడబిడ్డలను చిదిమేస్తున్నారనే ఆరోపణలు జోరుగా వినిపిస్తున్నాయి. ముఖ్యంగా గిరిజన తండాల్లోని ఆర్ఎంపీ డాక్టర్ల ద్వారా ఈ ఆస్పత్రులకు రెఫర్ చేయించుకుని ఆడబిడ్డలు ఉంటే కడుపులోనే చిదిమేస్తున్నారని, దీనిపై కఠిన చర్యలు తీసుకోవల్సిన వైద్యారోగ్యశాఖ అధికారులు మాత్రం ఏమాత్రం పట్టించుకోవటం లేదని గ్రామీణప్రాంత ప్రజలు ఆరోపిస్తున్నారు.

ప్రైవేటు ఆస్పత్రికి పోతే భయం.. భయం..ఓవైపు ప్రభుత్వం పేద ప్రజల కోసం ప్రభుత్వ ఆస్పత్రుల్లో సరైన వైద్య చికిత్సలు నిర్వహించటంలేదు, వైద్యులు కూడా సకాలంలో అందుబాటులోకి రాకపోవటంతో చేసేదేమీలేక ప్రజలు ప్రైవేటు ఆస్పత్రులను సంప్రదిస్తున్నారు. ఇదే అదునుగా భావించిన ప్రైవేటు ఆస్పత్రుల యాజమాన్యులు లక్షల ఫీజులు వసూళ్లు చేస్తూ పేదప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. అర్హతలేని వైద్యులతో వైద్య చికిత్సలు నిర్వహిస్తూ ఆస్పత్రుల్లోనే మెడికల్ షాప్‌లను ఏర్పాటు చేసుకుని, అవసరం లేని మందులు రాసి వేలల్లో డబ్బులు వసూళ్లుచేసి మళ్లీ తిరిగి అవే మందులు మెడికల్‌షాప్‌కి తీసుకెళ్లి విక్రయిస్తున్నట్లు పెద్ద ఎత్తున ఆరోపణలొస్తున్నాయి. ఇలాంటి వాటిపై ఓ కన్నేసి చర్యలు తీసుకోవల్సిన ప్రభుత్వ అధికారులు కాసులకు కక్కుర్తి పడి పట్టించుకోవటంలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

అందుబాటులో ఉండని వైద్యులు..ప్రైవేటు ఆస్పత్రులను స్థాపించిన వైద్యులు, యాజమాన్యాలు అందుబాటులో ఉండరు. ఇక్కడ ఆస్పత్రిని ఏర్పాటుచేసి వారు నగరంలోని పెద్దపెద్ద దవాఖానాల్లో చికిత్సలు నిర్వహిస్తుంటారు. ఇక్కడ ఎమర్జెన్సీగా ఎవరైనా వైద్యంకోసం వస్తే నగరం నుంచే ఆన్‌లైన్‌లో ఇక్కడ ఉన్న అనుభవం లేని నర్సులతో చికిత్సలు చేయిస్తున్నారు.


# తెలంగాణ ప్రజలకు చల్లని కబురు



**హైదరాబాద్-నవభూమి:** తెలంగాణలో ఎండల తీవ్రత రోజురోజుకూ ఎక్కువైపోతుంది. భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. మండుతున్న ఎండలు, తీవ్ర ఉక్కపోతతో ప్రజలు అల్లాడిపోతున్నారు. ఉదయం 11 గంటల తర్వాత కాలు బయట పెట్టేందుకు జంకుతున్నారు. చాలా ప్రాంతాల్లో మధ్యాహ్నం వేళల్లో రోడ్లు నిర్మానుష్యంగా మారుతున్నాయి. రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు ప్రజల్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలంగాణ ప్రజలకు చల్లటి కబురు చెప్పింది.

రాష్ట్రంలోని పలు జిల్లాలకు మూడు రోజుల పాటు వర్షాలు కురుస్తాయని తెలిపింది. రాబోయే మూడు రోజులు తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. దీని ప్రభావంతో గరిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే రెండు నుండి మూడు డిగ్రీల సెల్సియస్ వరకు తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందన్నారు. ప్రస్తుతం దక్షిణ తెలంగాణ ప్రాంతం నుంచి రాయలసీమ, తమిళనాడు మీదుగా గల్ఫ్ ఆఫ్ మన్నార్ వరకు ఉపరితల ద్రోణి కొనసాగుతోందన్నారు. ఇది సముద్ర మట్టం నుండి సుమారు 0.9 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరించి ఉందని.. దీని ఫలితంగా రాష్ట్రంలోని దక్షిణ ప్రాంత జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉంది. కొన్ని ప్రాంతాల్లో మోస్తరు వర్షాలు కూడా కురిసే ఛాన్స్ ఉన్నట్లు పేర్కొన్నారు. నేడు పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈదురు గాలులు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో వీచే అవకాశం ఉందన్నారు. రానున్న రెండు రోజుల్లో కూడా ఇదే పరిస్థితి కొనసాగుతుందని.. గంటకు 40 నుండి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులతో కూడిన వర్షాలు కురుస్తాయని తెలిపింది. పలు చోట్ల ఉరుములు, మెరుపులతో పాటుగా పిడుగులు కూడా పడే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇదిలా ఉండగా.. శుక్రవారం రాష్ట్రంలో అత్యధికంగా అదిలాబాద్ జిల్లాలో 40.3 డిగ్రీల సెల్సియస్ గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. మెదక్ జిల్లాలో అత్యల్పంగా 22.8 డిగ్రీల సెల్సియస్ కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. అయితే రాబోయే మూడు రోజుల్లో ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయి కంటే తక్కువగా ఉంటాయని వాతావరణ శాఖ తెలియజేసింది, మండు వేసవిలో ప్రజలకు ఇది కొంత ఉపశమనం కలిగించే విషయమే.

## లంచం డబ్బును టీషర్ట్‌లో చుట్టి బయట పడేసిన అధికారి



**రాజన్న సిరిసిల్ల జిల్లా:-నవభూమి:** ప్రభుత్వ కార్యాలయాల్లో లంచం లేకుండా పనులు జరగడం లేదనే భావన చాలా మందిలో ఉంది. నిజాయితీగా పనిచేసే ఉద్యోగులు ఉన్నప్పటికీ.. కొందరు అవినీతికి పాల్పడటం వల్ల వ్యవస్థకు చెడ్డపేరు వస్తోంది. తాజాగా... రాజన్న సిరిసిల్ల నీటిపారుదల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ లంచం తీసుకొని అతి తెలివి ప్రదర్శించాడు. లంచం తీసుకొని తప్పించుకునే ప్రయత్నం చేసినా.. అది బెడిసికొట్టింది. వివరాల్లోకి వెళితే.. హనుమకొండకు చెందిన ఒక కాంట్రాక్టర్ సిరిసిల్ల జిల్లాలో రూ.8 కోట్ల చెక్‌డ్యామ్ ప్రాజెక్ట్‌ను పూర్తి చేశాడు. అయితే పెండింగ్‌లో ఉన్న బిల్లుల కోసం అమరేందర్‌రెడ్డి లంచం అడిగాడు. గతంలోనే రూ.4 లక్షలు లంచం తీసుకున్న ఈఈ.. మిగిలిన రూ.50 లక్షల బిల్లు కోసం మరో రూ.75 వేలు డిమాండ్ చేశాడు.

అయితే, కథ ఇక్కడే ఊహించని మలుపు తిరిగింది. లంచం విషయం తెలుసుకున్న ఏసీబీ అధికారులు అతడ్ని పట్టుకునేందుకు ఇంటికి వెళ్లారు. ఏసీబీ అధికారులు తన ఇంటికి వస్తున్నారని ముందే పసిగట్టిన అమరేందర్‌రెడ్డి లంచం డబ్బును దాచే ప్రయత్నం చేశాడు. అతి తెలివి ఆలోచనతో ఆ డబ్బును తన చిన్న కుమారుడి టీషర్ట్‌లో చుట్టి ఎవరికీ కనిపించకుండా ఇంటి వెనుక వైపు విసిరివేశాడు. ఆ తర్వాత అమాయకంగా ఏమీ ఎరగనట్టు నటించాడు. కానీ ఆ విషయాన్ని పసిగట్టిన ఏసీబీ అధికారులు లంచం సొమ్మును స్వాధీనం చేసుకున్నారు. ఇంట్లో అమర్చిన సీసీ కెమెరాల్లో లంచం తీసుకున్న దృశ్యాలు రికార్డయ్యాయి. అమరేందర్‌రెడ్డిని అరెస్టు చేసిన ఏసీబీ అధికారులు కరీంనగర్ అనిశా కోర్టులో హాజరుపరచారు. కోర్టు అతడికి రిమాండ్ విధించింది. ఈ ఘటన అవినీతిపరులు ఎంత తెలివిగా తప్పించుకోవాలని ప్రయత్నించినా.. చట్టం తన పని తాను చేస్తుందని మరోసారి నిరూపించింది. ఇటీవల ఓ పోలీస్ అధికారి కూడా అతి తెలివిగా లంచం డబ్బులు తీసుకునే ప్రయత్నం చేశాడు. శామీర్‌పేట ఎస్సై ఎం.పరశురాం రూ.2.22 లక్షల లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కాడు. ఓ వ్యాపారిని తప్పుడు కేసుతో బెదిరించి డబ్బు డిమాండ్ చేశాడు. టేబుల్ పక్కనున్న చెత్త డబ్బాలో డబ్బు వేయమని చెప్పగా.. బాధితుడు వెళ్లగానే లెక్కిస్తుండగా పట్టుబడ్డాడు. లంచం సొత్తు స్వాధీనం చేసుకుని ఎస్సైని రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటన పోలీసు శాఖలోని కొందరి అవినీతిని మరోసారి బయటపెట్టింది.

# కాల్పుల విరమణ

**(1వపేజీ తరువాయి)** మరోసారి చర్చలు జరపనున్నారని భారత విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ పేర్కొన్నారు. ఈ చర్చల్లో సరిహద్దుల్లో శాంతిభద్రతల పరిరక్షణ, భవిష్యత్ కార్యాచరణపై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది. ఈ కాల్పుల విరమణ నిర్ణయం ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలను తగ్గించి, శాంతియుత వాతావరణాన్ని నెలకొల్పడంలో కీలక ముందడుగుగా అంతర్జాతీయ నిపుణులు విశ్లేషిస్తున్నారు.

**భారత్, పాక్ మధ్య శాంతి ఒప్పందం..సరిహద్దుల్లో శాంతి శంఖారావం**

శాంతి ఎప్పుడూ యుద్ధం కన్నా గొప్పదే...కానీ కొన్నిసార్లు శాంతి సాధించడానికి కూడా ధైర్యం, సంకల్పం కావాలి. ఈ క్రమంలో శనివారం సాయంత్రం, భారత్, పాక్ మధ్య తారస్థాయికి చేరిన పరిస్థితులకు తాత్కాలికంగా ముగింపు లభించింది.

శనివారం సాయంత్రం భారత్, పాకిస్తాన్ దేశాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరింది. భారత సైన్యం సమాధానం కారణంగా పాకిస్తాన్ ఎట్టకేలకు వెనక్కి తగ్గింది. చివరకు అమెరికాను రాయబారం కోసం వేడుకోగా, ట్రంప్ చర్చలతో భారతదేశం కాల్పుల విరమణకు అంగీకరించింది. విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ తెలిపిన వివరాల ప్రకారం పాకిస్తాన్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ మిలిటరీ ఆపరేషన్స్ మధ్యాహ్నం 15:35 గంటలకు ఫోన్ చేశారు.

భారత ప్రామాణిక సమయం ప్రకారం సాయంత్రం 17.00 గంటల నుంచి భూమి, వాయు, సముద్రంపై కాల్పులు, సైనిక చర్యలను ఇరుపక్షాలు నిలిపివేయాలని ఒప్పందం కుదిరిందన్నారు. ఈ ఒప్పందాన్ని అమలు చేయాలని ఈరోజు రెండు పార్టీలకు ఆదేశాలు అందాయన్నారు. ఈ క్రమంలో డైరెక్టర్ జనరల్ మిలిటరీ ఆపరేషన్స్ మే 12న మధ్యాహ్నం 12 గంటలకు మళ్లీ చర్చించనున్నట్లు వెల్లడించారు.

**దృఢంగా ఉన్న భారత్**

కాల్పుల విరమణను ధృవీకరిస్తూ, విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ సైతం సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందించారు. భారతదేశం, పాకిస్తాన్ ఈరోజు కాల్పులు, సైనిక చర్యలను నిలిపివేయడానికి అంగీకరించాయని పేర్కొన్నారు. ఈ క్రమంలో ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారతదేశం నిరంతరం దృఢమైన, అచంచలమైన వైఖరిని ఇలాగే కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.

భారత్, పాక్ యుద్ధాన్ని ఆపేసిన ట్రంప్-సంచలన ప్రకటన..! %దీఎ ాఎవస ూష్ట్రఎవస ఖజూఙ్ఠవః ాఫ్బతీఝఎ, మీఎ 10, 2025, 18:23 ళి×ూరి% పహల్గాం దాడి తర్వాత భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ కొనసాగుతోంది. ఇందులో భాగంగా ఇప్పటికే భారత బలగాలు పాకిస్తాన్ పై భారీ ఎత్తున దాడులు కూడా చేస్తున్నాయి. ఈ దాడులు యుద్ధంగా మారబోతున్నట్లు సంకేతాలు వెలువడుతున్న వేళ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇవాళ సంచలన ప్రకటన చేశారు. ఇరుదేశాలూ కాల్పుల విరమణకు అంగీకరించినట్లు ఆయన వెల్లడించారు. ఈ మేరకు ఆయన ఎక్స్ లో ట్వీట్ చేశారు. ఇప్పటికే భారత్, పాకిస్తాన్ మధ్య మొదలైన దాడులు, ప్రతిదాడుల నేపథ్యంలో వెనక్కి తగ్గాలని ఇరుదేశాల్నీ వరుసగా విజ్ఞప్తులు చేస్తూ వస్తున్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్.. ఇవాళ కీలక ప్రకటన చేశారు. ఎక్స్ వేదికగా ఆయన పెట్టిన పోస్టులో ఇరు దేశాల మధ్య నిన్న రాత్రి నుంచీ తాము జరిపిన సుదీర్ఘ చర్చలు ఫలించాయని తెలిపారు. ఈ మేరకు ఇరు దేశాలు తక్షణ కాల్పుల విరమణకు అంగీకరించినట్లు తెలిపారు. ఈ మేరకు ఇరు దేశాలకూ ఆయన శుభాకాంక్షలు తెలిపారు. సరైన సమయంలో తగిన సమయస్ఫూర్తి, కామన్ సెన్స్ వాడిన భారత్, పాకిస్తాన్ లకు డొనాల్డ్ ట్రంప్ అభినందనలు తెలిపారు. కాల్పుల విరమణపై ఇరుదేశాలూ తగిన నిర్ణయం తీసుకున్నందుకు ట్రంప్ సంతోషం వ్యక్తం చేశారు. మరోవైపు ఇవాళ ఉదయం అమెరికా రక్షణ కార్యదర్శి మార్కో రుబియో భారత్, పాక్ ప్రతినిధులతో మాట్లాడారు. ఇందులో ఆయన ఇరుదేశాలకూ వెనక్కి తగ్గాలని కోరారు. దీంతో పాకిస్తాన్ కూడా వెంటనే స్వరం మార్చింది. భారత్ యుద్ధం ఆపితే తామూ వెనక్కి తగ్గుతామని పాకిస్తాన్ ఉపప్రధాని ఇనామ్ దార్ తెలిపారు. దీనికి కొనసాగింపుగా ట్రంప్ ట్వీట్ వచ్చినట్లు తెలుస్తోంది.

# నైరుతి ఆగమనం

**(1వపేజీ తరువాయి)** వాతావరణం నుంచి వర్షాకాలంలోకి మారడాన్ని ఇది సూచిస్తుంది. పైగా భారత్ కు అత్యధిక వర్షతాపాన్ని అందించేంది నైరుతి రుతుపవనాలే.

"ఈ సంవత్సరం, నైరుతి రుతుపవనాలు మే 27న కేరళలో ప్రవేశించే అవకాశం ఉంది. మా నమూనా అంచనాలో అటూఇటూగా 4 రోజుల వ్యత్యాసం ఉండవచ్చు" అని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. కేరళలో రుతుపవనాల ప్రవేశ తేదీని అంచనా వేయడానికి ఐఎండీ ఆరు రకాల సూచికలను ఉపయోగిస్తుంది. సాధారణంగా నైరుతి రుతుపవనాలు జూన్ 1న కేరళలో ప్రవేశించి, సుమారు ఏడు రోజుల ప్రామాణిక వ్యత్యాసంతో జూలై 8 నాటికి దేశవ్యాప్తంగా విస్తరిస్తాయి.

2005 నుంచి కేరళలో రుతుపవనాల ప్రవేశ తేదీపై ఐఎండీ కార్యాచరణ అంచనాలను జారీ చేస్తోంది. ఇందుకోసం దేశీయంగా అభివృద్ధి చేసిన అత్యాధునిక స్టాటిస్టికల్ నమూనాను ఉపయోగిస్తున్నట్లు అధికారులు వివరించారు. ఈ నమూనాలో అటూఇటూగా 4 రోజుల దోషానికి అవకాశం ఉంటుంది. గత 20 సంవత్సరాల (2005-2024) గణాంకాలను పరిశీలిస్తే, 2015 మినహా మిగిలిన అన్ని సంవత్సరాల్లోనూ ఐఎండీ అంచనాలు దాదాపుగా సరైనవేనని తేలింది. 2015లో మాత్రం అంచనా వేసిన తేదీ (మే 30) కన్నా వాస్తవ ప్రవేశం (జూన్ 5) నాలుగు రోజుల పరిమితిని దాటింది. ఐఎండీ తన నమూనాలలో ఉపయోగించే ఆరు ప్రధాన సూచికలలో వాయువ్య భారతదేశంలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు, దక్షిణ ద్వీపకల్పంలో రుతుపవనాలకు ముందు కురిసే వర్షపాతం, ఉపఉష్ణమండల వాయువ్య పసిఫిక్ మహాసముద్రంపై సగటు సముద్ర మట్ట పీడనం, దక్షిణ చైనా సముద్రంపై అవుట్‌గోయింగ్ లాంగ్‌వేవ్ రేడియేషన్ ఈశాన్య హిందూ మహాసముద్రంలో దిగువ ట్రోపోస్ఫిరిక్ జోనల్ గాలి, మరియు ఇండోనేషియా ప్రాంతంలో ఎగువ ట్రోపోస్ఫిరిక్ జోనల్ గాలి వంటివి ఉన్నాయి. కాగా, ఈ ఏడాది (జూన్-సెప్టెంబర్) వర్షాకాలంలో దేశవ్యాప్తంగా 'సాధారణం కంటే ఎక్కువ' వర్షపాతం నమోదవుతుందని ఐఎండీ గత నెలలోనే అంచనా వేసిన విషయం తెలిసిందే. ఇది రైతులకు మరింత ఊరటనిచ్చే అంశం.

## జమ్మూలో భారీ చొరబాటుకు బ్రేక్!

**(1వపేజీ తరువాయి)** ధంధార్ పై దాడి చేయడంతో పాటు ఈ ఉగ్రవాదుల్ని హతమార్చినట్లు తెలిపాయి. నిన్న రాత్రి జమ్మూ, జైసల్మేర్‌తో పాటు పలు చోట్ల డ్రోన్ దాడులకు ప్రయత్నించి విఫలమైన తర్వాత సరిహద్దుల గుండా దేశంలోకి చొరబడేందుకు ఉగ్రవాదులు చేసిన ప్రయత్నం కూడా విఫలమైంది. దీంతో కీలకమైన సమయంలో దేశంలోకి అంతే కీలకమైన ఓ చొరబాటును ఆర్మీ సమర్థంగా అడ్డుకున్నట్లయింది. ఇప్పటికే సరిహద్దుల్లో పాకిస్తాన్ జరుపుతున్న కాల్పులతో అక్కడి గ్రామాల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వీరిలో చాలా మందిని ఇప్పటికే భారత సైన్యం అక్కడి నుంచి తరలించింది. దీంతో పాకిస్తాన్ దాడుల్లో సరిహద్దుల్లో ఇళ్లు దెబ్బతింటున్నట్లు తెలుస్తోంది.

## మావోల వేటకు విరామం

**(1వపేజీ తరువాయి)** తారసపడటంతో ఎన్‌కౌంటర్లు జరిగాయి. చాలా మంది మావోయిస్టులు మరణించారు కూడా. అలాగే మావోయిస్టులు అమర్చిన మందుపాతర పేలి నలుగురు గ్రౌహౌండ్స్ కానిస్టేబుళ్లు ప్రాణాలు కోల్పోయారు. మావోయిస్టుల కోసం మరింతగా కూంబింగ్ నిర్వహిస్తున్న సమయంలో బలగాలను వెంటనే వెనక్కి రావాల్సిందిగా కేంద్రం నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. భారత్-పాక్ యుద్ధం నేపథ్యంలో సీఆర్పీఎఫ్ బలగాను కేంద్రం వెనక్కి రప్పిస్తోంది. దీంతో బార్డర్‌కు వెళ్లేందుకు భద్రతా బలగాలు కర్రెగుట్టలను వీడుతున్నారు.

## అట్టహాసంగా మిస్ వరల్డ్ పోటీలు ప్రారంభం

**(1వపేజీ తరువాయి)** ఉట్టిపడేలా నిర్వహించిన కార్యక్రమాలు అలరించాయి. 250 మంది కళాకారులతో పేరిణి నృత్య ప్రదర్శన నిర్వహించారు. పరిచయ కార్యక్రమంలో భాగంగా పోటీదారులు విభిన్న వస్త్రధారణతో ఆకట్టుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు, డీజీపీ జితేందర్, తెలంగాణ రాష్ట్ర పర్యాటక శాఖ చైర్మన్ పటేల్ రమేశ్ రెడ్డి, నగర మేయర్ విజయలక్ష్మి. మిస్ వరల్డ్ సీఈవో జూలియా మోర్లే. మిస్ వరల్డ్-2024 విజేత క్రిస్టినా పిస్కోవా తదితరులు ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరయ్యారు.

## భారత భూమి కోసం ప్రాణాలు అర్పిస్తాం

**(1వపేజీ తరువాయి)** ఇస్లాం పేరుతో పాకిస్తాన్ మారణహోమం సృష్టిస్తోందని, పహాల్గామ్‌లో అతికిరాతకంగా అమాయక ప్రజలను హతమార్చిందని విమర్శించారు. అందుకు ప్రతీకారంగా ఆపరేషన్ సిందూర్‌తో భారత సైనికులు సరైన సమాధానం ఇస్తున్నారని, పాక్ భారీ మూల్యం చెల్లించక తప్పదని అన్నారు. దేవుడి దయ వల్లే మనమందరం భారత్‌లో జన్మించామని, పవిత్ర మాసంలో చిన్నపిల్లలు, అమాయకులను చంపే పాక్‌కు ఇస్లాం పేరు పలికే అర్హత లేదని అన్నారు. అమాయకులను, చిన్నపిల్లలను చంపాలని ఇస్లాం చెప్పలేదని, ఇస్లాం పేరుతో పాక్ అసత్య ప్రచారం చేస్తోందని మండి పడ్డారు. పాక్ దాడులపై భారత్ వెనక్కి తగ్గేది లేదని, భారత ముస్లింలు దేశం కోసం ప్రాణాలు అర్పిస్తారని అన్నారు. పాకిస్తాన్ ఆర్మీ మనదేశంలోని సామాన్యులను టార్గెట్ చేస్తూ దాడులకు పాల్పడుతోందని, దానికి తగిన మూల్యం చెల్లిచుకుంటుందని ఒవైసీ అన్నారు.

## యుద్ధప్రాంతంలో చిక్కుకున్న మన విద్యార్థులు

**(1వపేజీ తరువాయి)** 30 కాల్స్ దిక్కుతోచని స్థితిలో వారు తమను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని లేఖ రాశారు. దీంతో కేంద్ర మంత్రి ఆదేశాలతో అధికారులు రంగంలోకి దిగారు. ఇదిలా ఉంటే, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఢిల్లీలోని తెలంగాణా భవన్ లో ఏర్పాటు చేసిన సహాయ కేంద్రం ద్వారా అక్కడివారికి సహాయ సహకారాలను అందిస్తున్నారు. ఈ క్రమంలో సరిహద్దులలో చిక్కుకున్న తెలంగాణ పౌరుల నుండి ఇప్పటివరకు 30 ఫోన్ కాల్స్ వచ్చినట్టు అధికారులు వెల్లడించారు.

## వసతిగృహ విద్యార్థులకు స్పెషల్ కిట్లు

**(1వపేజీ తరువాయి)** మరుగుదొడ్లు నిర్మించడం, అలాగే ఉచిత నీట్ కోచింగ్ సెంటర్లు 10కి పెంచుతున్నట్లు మంత్రి తెలిపారు. విద్యార్థుల కోసం ప్రభుత్వం చేపట్టిన నిర్ణయంతో ఎందరో పేద విద్యార్థులకు ప్రయోజనం చేకూరనుందని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఈ పథకాన్ని అమల్లోకి తీసుకురావడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది.

## రజినీపై పోలీసుల దౌర్జన్యం

**(1వపేజీ తరువాయి)** అధికారంలోకి వచ్చిన నటి నుంచి వైసీపీ నేతలు, కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని మండిపడుతున్నారు. రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారని మండిపడుతున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో స్టోన్ క్రషర్ యాజమాన్యాన్ని బెదిరించి అక్రమంగా డబ్బులు వసూలు చేశారని ఆమెపై కేసు నమోదైంది. అదే కేసులో ఆమె మరిది గోపీని సైతం గత నెలలో ఏసీబీ అధికారులు అరెస్టు చేశారు. ఇప్పుడు ఈ చేదు అనుభవం ఎదురవ్వడం మాజీ మంత్రికి మరో షాక్ అని భావిస్తున్నారు.

## పాకిస్థాన్‌కు ఐఎంఎఫ్ భారీ

**(1వపేజీ తరువాయి)** పాకిస్థాన్‌కు 1 బిలియన్ అమెరికన్ డాలర్లు (సుమారు రూ.8,540 కోట్లు) రుణం మంజూరు చేసేందుకు ఐఎంఎఫ్ కార్యనిర్వాహక మండలి ఆమోదం తెలిపింది. ఈ పరిణామంపై భారత రాజకీయ వర్గాల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

కాంగ్రెస్ విమర్శలు..కాంగ్రెస్ పార్టీ ఎంపీ గౌరవ్ గొగొయ్, పాకిస్థాన్‌కు ఐఎంఎఫ్ రుణం మంజూరు చేయడం దిగ్భ్రాంతికరమని వ్యాఖ్యానించారు. "పహల్గామ్ దాడి జరిగిన తర్వాత కూడా పాకిస్థాన్‌కు 1 బిలియన్ డాలర్ల రుణం ఆమోదించడం షాక్‌కు గురిచేయడమే కాకుండా, తీవ్ర నిరాశ కలిగించింది. ఈ రుణం పాకిస్థాన్‌లో శాశ్వత సైనిక పాలనను ప్రోత్సహించడానికే ఉపయోగపడుతుంది" అని ఆయన 'ఎక్స్' వేదికగా ఆందోళన వ్యక్తం చేశారు.

కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ కూడా ఈ అంశంపై స్పందించారు. ఏప్రిల్ 29న పాకిస్థాన్‌కు ఐఎంఎఫ్ రుణం ప్రతిపాదన వచ్చినప్పుడు, దానికి వ్యతిరేకంగా భారత్ ఓటు వేయాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసిందని గుర్తు చేశారు. అయితే, ఓటింగ్‌కు భారత్ దూరంగా ఉండిపోయిందని, మోదీ ప్రభుత్వం ఈ విషయంలో వెనకడుగు వేసిందని విమర్శించారు. వ్యతిరేకంగా ఓటు వేసి ఉంటే, అది ప్రపంచానికి బలమైన సందేశాన్ని పంపి ఉండేదని అభిప్రాయపడ్డారు.

## ఆపరేషన్ కగార్.. సీఆర్‌పీఎఫ్ బలగాలు వెనక్కి

**న్యూఢిల్లీ-నవభూమి:** మావోయిస్టుల ఏరివేతే లక్ష్యంగా కొనసాగుతున్న ఆపరేషన్ కగార్ పై ఆపరేషన్ సిందూర్ ప్రభావం పడింది. భారత్-పాక్ సరిహద్దుల్లో ఉద్రిక్తతల నేపథ్యంలో మావోయిస్టుల కోసం కర్రెగుట్టలను జల్లడపడుతున్న సీఆర్‌పీఎఫ్ బలగాలను కేంద్ర హోంశాఖ దశలవారీగా వెనక్కి రప్పిస్తున్నది. దాదాపు ఐదు వేల మందికి పైగా బలగాలను కేంద్రం వెనక్కి పిలిపిస్తున్నది. ఇందులో భాగంగా తెలంగాణ %-%



ఛత్తీస్‌గఢ్ సరిహద్దులోని సీఆర్‌పీఎఫ్ కోబ్రా జవాన్లు తమ హెడ్ క్వార్టర్స్‌లో రిపోర్ట్ చేయాలని ఆదేశాలు జారీచేసింది. ఈ నేపథ్యంలో ములుగు జిల్లాలోని వెంకటాపురం, ఆలూబాక, వీరభద్రవరం, పామునూరు పెద్దగుట్ట పరిసరాల్లో మోహరించిన బలగాలు వెనక్కి మళ్లుతున్నాయి. ఆదివారం ఉదయం లోపు వీరంతా సరిహద్దుల్లోకి వెళ్లనున్నారు. అయితే ఛత్తీసగఢ్ వైపు ఆపరేషన్ కగార్ యథావిధిగా కొనసాగుతుందని ప్రకటించింది.

## కొంపముంచిన వెకేషన్ టూర్.. వైద్యానికి కోటి రూపాయల ఖర్చు



**బెంగళూరు - నవభూమి:** :టిక్‌టాక్ వీడియో ఈ బ్రిటన్ దంపతుల కొంపముంచింది. ప్రాణం మీదకు తీసుకురావడమే కాక.. ఏకంగా కోటి రూపాయలకు పైగా ఖర్చు చేయాల్సిన పరిస్థితి వచ్చింది. ఇంతకు ఏం జరిగిందంటే.. టిక్‌టాక్‌లో చూసిన ఓ జలపాతం దగ్గరికి వెకేషన్ కోసం వెళ్లారు ఓ బ్రిటీష్ జంట. అయితే వారి కలల విహారయాత్ర కాస్త.. అంతులేని విషాదాన్ని.. భారీ నష్టాన్ని మిగిల్చింది. 30 అడుగుల పై నుంచి పడిపోయి.. తీవ్ర గాయాలపాలయ్యి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు బ్రిటన్ వ్యక్తి. ఆస్పత్రి బిల్లు కోటి రూపాయలకు పైగా అయ్యింది. ఆ వివరాలు..బ్రిటీష్ సైనికుడు 23 ఏళ్ల లియామ్ తన భార్య లూసీతో కలిసి థాయిలాండ్‌లోని ఓ జలపాతం చూడటం కోసం వెళ్లాడు. ఓ టిక్‌టాక్ వీడియోలో లియామ్ దంపతులు ఆ జలపాతాన్నిచూశారు. బాగా ఆకర్షించడంతో.. వెకేషన్ కోసం అక్కడకు వెళ్లారు. అయితే ఎంజాయ్ చేద్దామని వెళ్లిన వారిని దురదృష్టం పలకరించింది. జలపాతం అందాలు చూడటానికి వెళ్లిన లియామ్.. 30 అడుగుల ఎత్తు నుంచి కిందకు పడ్డాడు. ఈ ప్రమాదంలో లియామ్‌కు తలకు తీవ్ర గాయమైందని.. అలానే కాలు విరిగిపోయిందని ది మెట్రో తెలిపింది.లియామ్ పడిపోవడం గమనించిన అతడి భార్య లూసి.. వెంటనే అప్రమత్తం అయ్యి.. అతడిని మరింత కిందకు పడిపోకుండా పట్టుకుంది. లేదంటే లియామ్ 100 అడుగుల కిందకు పడిపోయేవాడని ది మెట్రో తెలిపింది. ఈ జంట ఇప్పుడు వైద్య ఖర్చుల నిమిత్తం 100,000 పౌండ్లు (ఇండియన్ కరెన్సీలో రూ. 1.13 కోట్లు) ఖర్చు చేయాల్సి వచ్చింది. అంతేకాక మెరుగైన వైద్యం కోసం యూకేకి తరలించాలని వైద్యులు వెల్లడించారు.

లూసి మాట్లాడుతూ.. జలపాతం దగ్గర చాలా కుటుంబాలు ఉన్నాయి. లియామ్ ఫొటోలు తీసుకుంటూ అక్కడే ఉన్నాడు.కాసేపటి తర్వాత నా భర్త నాకు కనిపించలేదు. అతడిని పిలుచుకుంటూ ముందుకు వెళ్లాను.చివరకు ఓ రాయి చివరన రక్తపు మడుగులో ఉన్న లియామ్ నాకు కనిపించాడు. వెంటనే నేను కిందకు పరిగెత్తుకు వెళ్లాను. అతడు మరింత కిందకు పడకుండా చూడటం కోసం రక్తపు మడుగులోనే కూర్చుని.. అతడి చుట్టూ కాళ్లుచేతులు వేసి పడిపోకుండా పట్టుకున్నాను. సాయం కోసం కేకలు వేశాను. చివరకు ఒ క థాయి యువకుడు వచ్చి మాకు సాయం చేశాడు.కింద పడటంతో అతడి కాలు విరిగి ఎముక బయటకు వచ్చింది. మరీ అతడి పుర్రెని చూస్తే భయంతో దడుచుకుంటారు. అంత తీవ్రంగా గాయపడ్డాడు అని చెప్పుకొచ్చింది. ఆస్పత్రికి తీసుకెళ్తే వైద్యులు లియామ్ కాలువిరిగిందని, పుర్రెకి బాగా దెబ్బలుతగిలాయని.. ముఖానికి కూడా తీవ్ర గాయాలయ్యాయని తెలిపారు.

ఆస్పత్రి బిల్లు చెల్లిస్తే తప్ప ఇక్కడ నుంచి డిశ్చార్జ్ చేయరు. మా దగ్గర అంత మొత్తం లేదు. అందుకే క్రౌడ్ ఫండింగ్ కోసం వెళ్లాలని అనుకుంటున్నాము అని చెప్పుకొచ్చింది లూసి. దయచేసి మాకు సాయం చేయండి అని కోరతుంది. ఇక ఆ జలపాతం దగ్గర ఇలాంటి ప్రమాదాలు జరగడం ఇదే ప్రథమం కాదట. గతంలో అనగా 2019లో ఇద్దరు టూరిస్టులు కూడా ఇలానే కిందపడి చనిపోయారు. ప్రమాద హెచ్చరికలు ఉన్నప్పటికి కూడా జనాలు ఇక్కడకు తండోపతండాలుగా వస్తున్నారు.అయితే ఈ జలపాతాన్ని సందర్శించడానికి వచ్చే అంతర్జాతీయ పర్యాటకుల కోసం థాయిల్యాండ్ ప్రభుత్వం ఉచిత బీమా పథకం తీసుకువచ్చింది. 12 లక్షల వరకు ప్రమాద బీమ కల్పిస్తుంది. అయితే చాలా మంది పర్యాటకులకుఈ బీమా సౌకర్యం గురించి తెలియదు.

## వాతావరణ శాఖ గుడ్‌న్యూస్.. ఈ సారి మే 27నే కేరళలోకి రుతుపవనాలు..



**న్యూఢిల్లీ-నవభూమి:** భారతదేశంలో ఇంకొన్ని రోజుల్లో ఎండాకాలం ముగియనుంది. వేసవి తాపం నుంచి ప్రజలకు ఉపశమనం కలిగించేందుకు వరుణుడు రాబోతున్నాడు. ఈ సారి అంచనాల కంటే ముందే నైరుతి రుతుపవనాలు కేరళలో ప్రవేశించనున్నాయి. చాలా ఏళ్ళ తర్వాత జూన్ కంటే ముందుగానే వర్షాకాలం రాబోతున్నట్లు భారత వాతావరణ శాఖ శనివారం ప్రకటించింది. మే 27 నుంచి రుతుపవనాలు కేరళ తీరాన్ని తాకి వర్షాలు మొదలుకాబోతున్నట్లు వెల్లడించింది. సాధారణంగా జూన్ నెల ప్రారంభమయ్యాకే వర్షాకాలం వస్తుంది. ఈ సంవత్సరం అందుకు భిన్నంగా కొన్ని రోజులు ముందే రాబోతోంది.

నో ఎల్ నినో ..నైరుతి రుతుపవనాలు కేరళ తీరాన్ని తాకినప్పటి నుంచే వర్షాకాలం మొదలవుతుంది. జూన్ 1 నుంచి మొదలై జూన్ 8 కంతా దేశవ్యాప్తంగా విస్తరించి వర్షాలు కురుస్తాయి. ఇక గతంతో పోలిస్తే 2025లో భారీ వర్షాలు పడతాయని.. ఎల్ నినో పరిస్థితులు ఉండబోవని ఐఎండీ పేర్కొంది. జూన్ నుంచి సెప్టెంబర్ మధ్య సాధారణానికి మించి వర్షాలు పడే ఛాన్స్ ఉన్నట్లు స్పష్టం చేసింది.

## ఉద్రిక్తతలు తగ్గించేందుకు ఇండియానే మొదట చొరవ చూపాలి: మెహబూబా ముఫ్తీ



**న్యూఢిల్లీ-నవభూమి:** భారత్-పాకిస్థాన్ దేశాల మధ్య ఉద్రిక్తతలు అంతకంతకూ పెరుగుతూ యుద్ధం దిశగా అడుగులు పడుతుండటంపై జమ్మూకశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి, పీపుల్స్ డెమోక్రటిక్ పార్టీ చీఫ్ మెహబూబా ముఫ్తీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఉపఖండంలో ఉద్రిక్తతలు తగ్గించేందుకు భారత్ మొదట చొరవ చూపించాలని, నాయకత్వ పాత్రను పోషించాలని అన్నారు. సాఫ్ట్ పవర్, శాంతికి కట్టుబడి ఉండటమే భారత్ నిజమైన శక్తి అని చాటిచెప్పేందుకు ఇదే తగిన తరుణమని పేర్కొన్నారు.భారత్, పాక్ మధ్య పరస్పర దాడులపై అమెరికా విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ జనరల్ అసిమ్ మునీర్‌కు ఫోన్ చేసి భారత్‌తో పెరిగిన ఉద్రికత్తలను తగ్గించుకోవాలని కోరిన నేపథ్యంలో మెహబూబా ముఫ్తీ తాజా వ్యాఖ్యలు చేశారు. ఇరుదేశాల మధ్య ఉగ్రిత్తల విషయంలో ఒక దశదాటి జోక్యం చేసుకోలేమని అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ వ్యాఖ్యానించారని, ఇప్పుడు మార్కో రూబియో సైతం పాకిస్థాన్ ఆర్మీ చీఫ్‌ను ఉద్రిక్తతలు తగ్గించుకోవాలని కోరారని ముఫ్తీ తెలిపారు. నిలకడలేని అంతర్జాతీయ మద్దతు వైపు మొగ్గడానికి బదులు, ఉద్రిక్తతలు తొలగేందుకు భారత్ మొదటి అడుగు వేయాలని ఆమె సూచించారు."భారతదేశం ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం. వేగంగా ఆర్థికాభివృద్ధి సాధిస్తూ ప్రపంచ శక్తిగా ఎదుగుతోంది. అలాంటి భారత్ నిలకడలేని అంతర్జాతీయ మద్దతుపై ఆధారపడకూడదు. దీనికి బదులుగా ఉపఖండంలో నాయకత్వ పాత్రను పోషిస్తూ ఉద్రిక్తతలు తగ్గించేందుకు తొలి అడుగు వేయాలి" అని ముఫ్తీ సూచించారు. ఇప్పుడు ప్రపంచమంతా మన వైపే చూస్తోందని, భారత్ ఉన్నతంగా నిలబడి సాఫ్ట్ పవర్, శాంతికి కట్టుబడి ఉండటమే నిజమైన బలమని, న్యూక్లియర్స్ కాదని చాటాలని అన్నారు.

## ఢిల్లీపై మిసైల్ అటాక్.. ఇది నిజమేనా..




**న్యూఢిల్లీ-నవభూమి:** భారత సైనిక దళాలు రెచ్చిపోతుండటంతో తట్టుకోలేకపోతోంది పాకిస్థాన్. త్రివిధ దళాలు చేస్తున్న దాడులకు ఉక్కిరిబిక్కిరి అవుతోంది. దాడులు, ప్రతిదాడులతో తమపై తెగబడుతుండటంతో పాక్ లబోదిబోమంటోంది. మనల్ని యుద్ధక్షేత్రంలో ఎదుర్కోలేక సోషల్ మీడియాను ఆశ్రయిస్తోంది. అక్కడ విద్వేష ప్రచారాలు, ఫేక్ న్యూస్ ప్రాపగండాతో పరువు తీసుకుంటోంది పాక్. ఈ క్రమంలోనే ఢిల్లీ ఎయిర్‌పోర్ట్‌ను పేల్చేశామంటూ నెట్టింట పలు పాత వీడియోలను వైరల్ చేస్తోంది. మరి.. ఆ వీడియోల్లో నిజమెంత.. ఢిల్లీ ఎయిర్‌పోర్ట్‌పై పాక్ అటాక్ చేసిందా.. లేదా.. అనేది ఇప్పుడు చూద్దాం..

ఇందులో నిజమెంత..భారత్‌లోని కీలక నగరాల్లో దాడులకు తెగబడ్డామంటూ ఫేక్ వీడియోలు, ఫొటోలతో తమ దేశ ప్రజల మనసుల్ని గెలుచుకునేందుకు ప్రయత్నిస్తోంది పాకిస్థాన్. ఫేక్ అకౌంట్స్ నుంచి సంబంధం లేని వీడియోలు, ఫొటోలను పోస్ట్ చేస్తూ ఇండియాపై అటాక్ చేశామని బీరాలకు పోతోంది. ఈ క్రమంలోనే ఢిల్లీ ఎయిర్‌పోర్ట్‌ను పేల్చేశామంటూ ఓ వీడియోను వదిలింది. అయితే ఇది ఫేక్ వీడియో అని.. ఇందులో ఏమాత్రం నిజం లేదంటూ పీఐబీ ఫ్యాక్ట్ చెక్ తేల్చేసింది. ఢిల్లీ ఎయిర్‌పోర్ట్ మీదకు ఎలాంటి పాక్ మిసైల్ అటాక్ జరగలేదని క్లారిటీ ఇచ్చింది. ఇలాంటి ఫేక్ న్యూస్‌ను నమ్మొద్దని ప్రజల్ని కోరింది. కాగా, ఢిల్లీ ఎయిర్‌పోర్ట్ వీడియోనే కాదు.. మరిన్ని ఫేక్ వీడియోలతో జనాల్ని కన్‌ఫ్యూజ్ చేసేందుకు పాక్ ప్రయత్నిస్తోంది. అదే టైమ్‌లో చేసిన తప్పుల్ని కప్పిపుచ్చుకునేందకు అబద్ధాలు చెబుతోంది. భారత సరిహద్దు ప్రాంతాల్లోని ఆలయాలు, జనావాసాలపై దాడులకు తెగబడుతున్న శత్రుదేశం.. తాము ప్రజలపై అటాక్ చేయలేదంటూ బుకాయిస్తోంది. అయితే ప్రజల ఇళ్లు, ఆలయాలపై పాక్ దాడులకు సంబంధించిన ఫొటోలు, వీడియోలను భారత రక్షణ మంత్రిత్వ శాఖ బయటపెట్టింది.

## 'తుంగభద్ర'కు భారీ భద్రత

**బళ్లారి(బెంగళూరు)-నవభూమి:** పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత వైమానిక దళం పాకిస్థాన్‌పై ప్రతిదాడికి దిగడంతో తుంగభద్ర ఆనకట్ట వద్ద నిఘాను పెంచారు. రాష్ట్రంలోని ప్రధాన జలాశయాల్లో ఒకటైన తుంగభద్ర ఆనకట్ట భద్రతను నిర్ధారించేందుకు కర్ణాటక పారిశ్రామిక భద్రతాదళాన్ని కొన్ని సంవత్సరాలుగా మోహరించారు. భారత్, పాకిస్థాన్ మధ్య ప్రస్తుత పరిస్థితుల కారణంగా తుంగభద్ర ఆనకట్ట వద్ద భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు.

## పాక్ దాడుల్లో చనిపోయిన పౌర కుటుంబాలకు నష్టపరిహారం



**న్యూఢిల్లీ-నవభూమి:** పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ ఆపరేషన్ సిందూర్ చేపట్టిన విషయం అందరికీ తెలిసిందే. పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రస్థావరాలే లక్ష్యంగా దాడులు చేసి.. 100 మందికి పైగా ఉగ్రవాదులను హతమార్చింది. దీంతో దాయాది దేశం కూడా ప్రతిదాడులకు పాల్పడుతోంది. ముఖ్యంగా సరిహద్దు వెంబడి ఉన్న స్థానిక పౌరులు, సైనికులనే లక్ష్యంగా చేసుకుని కాల్పులు జరుపుతోంది. ఇలా ఇప్పటికే 20 మంది అమాయక పౌరుల ప్రాణాలను కూడా తీసింది. తాజాగా ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా మృతుల కుటుంబాలను పరామర్శించారు. అండగా ఉంటామని హామీ ఇస్తూనే.. ప్రభుత్వం తరపున నష్టపరిహారం ప్రకటించారు. ఒక్కో మృతుడి కుటుంబానికి మొత్తంగా రూ.10 లక్షల రూపాయలు అందజేస్తామని వెల్లడించారు.పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రస్థావరాలపై మెరుపు దాడులు చేసింది. దీంతో దాయాది దేశం సరిహద్దు వెంబడి ప్రతీకార దాడులకు పాల్పడుతోంది. ముఖ్యంగా నియంత్రణ రేఖ వెంబడి కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తూ కాల్పులు జరుపుతోంది. పహల్గాం దాడి జరిగిన తర్వాత నుంచి కాల్పులు చేస్తూ కవ్వించిన పాక్.. ఆపరేషన్ సిందూర్ తర్వాత ప్రజల ప్రాణాలు తీయడం ప్రారంభించింది.

కశ్మీర్‌లోని శ్రీనగర్, రాజౌరి, పూంఛ్, పఠాన్‌కోట్ ప్రాంతాల్లో పాక్ డ్రోన్‌లతో దాడులు జరుపుతోంది. ఈ దాడుల్లో జమ్ము కశ్మీర్ ప్రభుత్వ అధికారి రాజ్ కుమార్ థప్పా సహా దాదాపు 20 మంది అమాయక పౌరులు ప్రాణాలు కోల్పోయారు. 50 మందికి పైగా గాయపడ్డారు. అయితే మృతుల్లో మహిళలు సహా చిన్న చిన్న పిల్లలు కూడా ఉండగా.. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కన్నీటి పర్యంతం అవుతూనే.. దారుణాలను చూడలేకపోతున్నానని చెప్పారు.అలాగే ప్రభుత్వ ఉన్నతాధికారి మృతి గురించి మాట్లాడుతూ.. అతడు చనిపోవడానికి ముందు రోజే తాను అధ్యక్షత వహించిన ఆన్‌లైన్ సమావేశంలో పాల్గొన్నట్లు గుర్తు చేశారు. కానీ మరుసటి రోజే పాకిస్థాన్.. రాజౌరిలోని అతడి ఇంటిపై దాడి చేసిందని.. ఇలా ఆయన ప్రాణాలు కోల్పోయారని సీఎం ఒమర్ అబ్దుల్లా అన్నారు. ఆయన మృతి పట్ల సంతాపం వ్యక్తం చేస్తూనే.. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అలాగే ఇప్పటి వరకు పాక్ దాడుల్లో ప్రాణాలు కోల్పోయిన మృతుల కుటుంబాలకు నష్ట పరిహారం అందజేస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం తరఫున ఒక్కో మృతుడి కుటుంబానికి 10 లక్షల రూపాయల ఆర్థిక సాయం చేస్తామని న్నారు.

# మాటిమాటికి పాక్ మజాక్ చేస్తే..

### భారత సైన్యం ఊరుకుంటుందా? అసదుద్దీన్ ఒవైసీ



**హైదరాబాద్ - నవభూమి:** పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత పాకిస్థాన్‌పై తీవ్రస్థాయి విరుచుకుపడుతోన్న ప్రతిపక్ష నాయకుల్లో హైదరాబాద్ ఎంపీ, ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ ఒకరు. దొంగదెబ్బ తీసిన పాకిస్థాన్‌కు గుణపాఠం చెప్పాల్సిందేనని, మరోసారి భారత్‌వైపు కన్నెత్తి చూడాలంటే భయపడాలని ఉద్ఘాటించారు. తాజాగా, మరోసారి పాకిస్థాన్‌పై అసదుద్దీన్ ఒవైసీ విరుచుకుపడ్డారు. అమాయకులను, చిన్న పిల్లలను చంపమని ఇస్లాం చెప్పలేదని, వారిని చంపే పాకిస్థాన్‌కు ఆ పేరెత్తే అర్హతలేదన్నారు. అంతేకాదు, పాకిస్థాన్ మాటిమాటికి మజాక్ చేస్తోందని, వాళ్లు దాడిచేస్తే మన సైనికులు తగ్గుతారా? అని వ్యాఖ్యానించారు.

%"మన జవానులకు మద్దతుగా మనమందరం ఉండాలి.. పాకిస్థాన్ మాటిమాటికి మజాక్ చేస్తుంది.. పాకిస్తాన్ దాడి చేస్తే భారత్ వెనక్కి తగ్గదు.. అమాయకులను, చిన్నపిల్లలను చంపే ఆ దేశానికి ఇస్లాం పేరు పలికే అర్హత లేదు.. అమ్మ కడుపులో నుంచి ఈ భూమిపై పడినప్పుడు.. చచ్చే వరకు ఈ భూమి కోసమే బ్రతకాలి.. ఈ భారతదేశంలో పుట్టడం మా అదృష్టం " అని అసదుద్దీన్ ఒవైసీ అన్నారు. పహల్గామ్ దాడి తర్వాత పాక్‌పై తరుచూ ఒవైసీ మండిపడుతూ.. కేంద్రానికి పూర్తి మద్దతు ప్రకటించిన సంగతి తెలిసిందే.

అంతేకాదు, "భారత్‌లో 230 మిలియన్ల కుపైగా ముస్లింలు ఉన్నారనే సత్యాన్ని పాకిస్థాన్ మర్చిపోతోంది.. మా పూర్వీకులు 'రెండు దేశాల సిద్ధాంతం'ను తిప్పికొట్టారు. మేము జిన్నా ప్రతిపాదించిన 'రెండు దేశాల సిద్ధాంతాన్ని' ద్వేషించాం.. తిరస్కరించాం.. మేము భారత్‌ను మా దేశంగా అంగీకరించాం..ఇక్కడే ఉండాలని తుదిశ్వాస వరకు కొనసాగుతాం.. పాకిస్థాన్ మత ప్రాతిపదికన భారతదేశాన్ని చీల్చాలని చూస్తోంది. భారతీయ ముస్లింలు, హిందువులు, ఇతర సముదాయాల మధ్య విచ్ఛిన్నాన్ని కలిగించాలని ప్రయత్నిస్తోంది...

'రెండు దేశాల సిద్ధాంతం' గురించి మాట్లాడుతోన్న పాకిస్థాన్ అఫ్గనిస్థాన్ సరిహద్దు పోస్టులపై ఎందుకు బాంబుల దాడులు చేస్తోంది? ఇరాన్ సరిహద్దు వద్ద ఎందుకు బాంబులు వేస్తోంది? అఫ్గన్లు, ఇరానీయులు ముస్లింలే కదా? పాక్ ప్రభుత్వ విధానం ఇదే ఇస్లాం ముసుగులో తన నేరచర్యలను, ఉగ్రవాద ప్రోత్సాహాన్ని దాచే ప్రయత్నం మాత్రమే... గత 75 సంవత్సరాలుగా పాకిస్థాన్ భారత్‌పై చేసే కార్యకలాపాలన్నీ ఇదే నాటకం చుట్టూ తిరుగుతున్నాయి" అని పాకిస్థాన్‌పై ఓ రేంజ్‌లో. ఒవైసీ దుమ్మెత్తిపోశారు. అంతేకాదు, అమెరికా మోస్ట్‌వాంటెడ్ ఉగ్రవాదులు పాకిస్థాన్‌లో ఉన్నారన్నారు."శ్రీనగర్‌లోకి డ్రోన్‌లు వచ్చాయి. సైనికులు మమ్మల్ని ఎలా కాపలా కాస్తున్నారో మాకు తెలియదు.. మేము వారికి ఒకటే చెప్పాలనుకుంటున్నాం.. ఇకపై పాక్ మన జోలికి రావాలంటనే భయపడాలి.. ప్రపంచానికి ప్రమాదకరమైన దేశానికి వ్యతిరేకంగా మనం నిలబడాలి... వారి అణు బాంబులను నిరాయుధీకరించాలి... మన రక్షణ దళాలకు మద్దతు ఇవ్వాలి... అమెరికా కోరుతున్న ఉగ్రవాదులకు పాకిస్థాన్ సైన్యం మురీద్‌కే, బహవల్పూర్‌లలో ఆశ్రయం కల్పిస్తోంది.. అది నిజమేనని అంటున్నారు! పాక్ ఉగ్రవాదులను కాపాడుతోంది.. ప్రపంచం దీనిని గమనించాలి'

## పాకిస్థాన్‌లోని గురునానక్ జన్మస్థలంపై భారత్ డ్రోన్ దాడి చేసిందా?



**న్యూఢిల్లీ-నవభూమి:** పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ ప్రతీకార చర్యలు సాగిస్తోంది. మంగళవారం రోజు భారత్ మెరుపుదాడులు చేయగా దాయాది దేశం సైతం ప్రతిదాడులకు పాల్పడుతోంది. భారత్ ఉగ్రస్థావరాలను మాత్రమే లక్ష్యంగా చేసుకుని దాడులు చేయగా.. పాక్ మాత్రం అమాయక ప్రజల ప్రాణాలు తీస్తోంది. మరోవైపు తప్పుడు ఆరోపణలు చేస్తూ.. అంతర్జాతీయవ్యాప్తంగా భారత్‌ను తప్పుగా చూపించాలనుకుంటోంది. అందుకోసం పెద్ద ఎత్తున తప్పుడు వార్తలను ప్రచారం చేస్తోంది. అందులో భాగంగానే తాజాగా పాకిస్థాన్‌లోని నన్‌కానా సాహిబ్ గురుద్వారా లక్ష్యంగా భారత్ డ్రోన్ దాడి చేసిందని ఆరోపించింది. అయితే వీటిపై తాజాగా కేంద్రం క్లారిటీ ఇచ్చింది. పాక్ చేస్తున్న ఈ ఆరోపణలో ఎలాంటి వాస్తవం లేదని పీఐబీ ఫ్యాక్ట్ చెక్ చేసి మరీ వెల్లడించింది. పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ ఆపరేషన్ సిందూర్ చేపట్టింది. మంగళవారం రోజు పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని 9 ఉగ్రస్థావరాలే లక్ష్యంగా క్షిపణి దాడులు చేసింది. ఈ ఘటనలో మొత్తంగా 100 మందికిపైగా ఉగ్రవాదులు హతమయ్యారు. అయితే పాక్ మాత్రం భారత్.. పౌరులను లక్ష్యంగా చేసుకుని దాడులు చేసిందని ఆరోపించింది. అదంతా తప్పని భారత్ ఆధారాలను బయటపెట్టగా.. చేసేదేమీ లేక దాయాది దేశం ప్రతిదాడులకు పాల్పడుతోంది. ముఖ్యంగా అమాయక పౌరులు, సైనిక సిబ్బందిని లక్ష్యంగా చేసుకుని కాల్పులు జరుపుతూ.. క్షిపణి దాడులు చేస్తోంది. ఇప్పటికే అనేక మంది అమాయక ప్రజల ప్రాణాలు కూడా తీసింది. ఇది చాలదన్నట్లుగా అంతర్జాతీయంగా భారత్‌ను తప్పుగా చూపించేందుకు పెద్ద ఎత్తున తప్పుడు వార్తలు ప్రచారం చేస్తోంది.

ఇప్పటికే అనేక వార్తలను నెట్టింట వైరల్ చేసిన పాక్.. తాజాగా తమ దేశంలోని నన్‌కానా సాహిబ్ గురుద్వారాపై భారత్ డ్రోన్ దాడులు చేసిందని ఆరోపించింది. అయితే ఈ గుడి సిక్కుమత వ్యవస్థాపకుడు అయిన గురునానక్ జన్మస్థలం. నదీ తీరంలో ఉన్న పవిత్ర గురుద్వారా సిక్కుల ప్రధాన తీర్థయాత్రా కేంద్రాల్లో ఒకటి కాగా.. దీన్నే భారత్ ధ్వంసం చేసిందంటూ పాకిస్థాన్ వార్తలను ప్రచారం చేసింది. ముఖ్యంగా ఓ వ్యక్తి ఈ సమాచారాన్ని వివరిస్తుండగా.. వీడియో తీసి మరీ ఈ వార్తను సోషల్ మీడియాలో పెట్టింది పాక్. సిక్కులు ఎంతో పవిత్రంగా భావించే ఈ గురుద్వారాపై దాడి జరిగిందని చెప్పగా.. త్వరగానే ఈ వార్త వైరల్ అయింది. అయితే దీన్ని గుర్తించిన భారత్ ఫ్యాక్ట్ చెక్ చేసింది.ముఖ్యంగా ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పీఐబీ) దీనిపై ఫ్యాక్ట్ చెక్ చేయగా.. ఇది తప్పుడు వార్తే అని గుర్తించింది. భారత్‌లో మత విద్వేషాలను రెచ్చగొట్టేందుకే పాకిస్థాన్ ఇలాంటి తప్పుడు వార్తలను ప్రచారం చేస్తుందని చెప్పింది. కాబట్టి ప్రజలెవ్వరూ ఇలాంటి వార్తలను నమ్మొద్దు అని.. ఎట్టి పరిస్థితుల్లోనూ ఇలాంటి వీడియోలను షేర్ చేయొద్దని వివరించింది. దీనిపై శిరోమణి గురుద్వారా ప్రబంధక్ కమిటీ అధ్యక్షుడు పూర్జిందర్ సింగ్ ధామి మాట్లాడుతూ.. పాక్ పూంచ్‌లోని గురుద్వారాపై దాడి చేసిందని గుర్తుచేశారు. ఇప్పటికే వారిని పరామర్శించామని.. వారికి అన్ని రకాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చినట్ల వెల్లడించారు.

## అమ్మో.. పెద్ద ప్రమాదమే తప్పిందిగా.. ఏం జరిగిందంటే..



**చెన్నై-నవభూమి:** తిరుప్పూరు - వంజిపాళయం మధ్య కావిలిప్పాళయం సమీపంలో రైలు పట్టాలపై గుర్తు తెలియని దుండగులు రాళ్లను ఉంచారు. ఆ మార్గంలో వెళ్ళిన గూడ్సురైలు కింద ఆ రాళ్లు నలుగుతూ పెద్ద శబ్దం రావటంతో లోకోపైలట్ వెంటనే రైల్వే ఉన్నతాధికారులకు ఫోన్ చేశారు. దీంతో శుక్రవారం వేకువజామున రైల్వే భద్రతా దళం ఎస్ఐ రువంతికా, పోలీసులు అక్కడికి వెళ్లి పరిశీలించారు.ఆ పట్టాల వద్ద పెద్ద రాళ్లు గూడ్సురైలు చక్రాల కింద నలిగి ఉండటాన్ని గమనించారు. సంఘటన స్థలానికి చేరువగా టాస్మాక్ దుకాణం ఉండటంతో మద్యం మత్తులో ఎవరైనా ఈ దుశ్చర్యకు పాల్పడి ఉంటారని అనుమానిస్తున్నారు.

## విద్యార్థులకు డిప్యూటీ సీఎం పిలుపు.. ఆ లైబ్రరీకి రండి



**చెన్నై-నవభూమి:** పుస్తకాల ద్వారా ప్రపంచాన్ని అధ్యయనం చేసేందుకు కలైంజర్ లైబ్రరీకి రావాలని ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి విద్యార్థులు, ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఉప ముఖ్యమంత్రి తన ఎక్స్ పేజీలో... కలైంజర్ సెంటినరీ వేడుకలను పురస్కరించుకుని చెన్నై వెస్ట్ జిల్లా అన్నానగర్ నియోజకవర్గంలో డీఎంకే యువజన విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన 'కలైంజర్ లైబ్రరీ'ని శనివారం ప్రారంభించాను.అమింజికరై మార్కెట్ ప్రాంతంలోని ఈ లైబ్రరీని అన్నా నగర్ నియోజకవర్గానికి చెందిన విద్యార్థినీ, విద్యార్థులు పార్టీ సభ్యులు, ప్రజలు ఉపయోగించుకోవాలని కోరుతున్నాను. పుస్తకాల ద్వారా ప్రపంచాన్ని అధ్యయనం చేసేందుకు ఈ లైబ్రరీకి రావాలని ఉప ముఖ్యమంత్రి తన ఎక్స్‌లో పిలుపునిచ్చారు.


## నా పుట్టినరోజు వేడుకలకు ఎవరూ రావొద్దు



**చెన్నై-నవభూమి:** ఈ నెల 12వ తేదీ తన పుట్టినరోజు సందర్భంగా తనను కలిసేందుకు ఎవరూ రావొద్దని.. ఆడంబర వేడుకలు జరుపుకోరాదని, ఆ రోజు భారతదేశప్రజలను కాపాడేందుకు పోరాడుతున్న మన సైనికుల కోసం ప్రార్థించాలని అన్నాడీఎంకే శ్రేణులకు ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి హితవు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయన శు క్రవారం తన ఎక్స్‌పేజీలో సూచించారు.ఆపరేషన్ సిందూర్' పేరిట దాయాది దేశం పాకిస్తాన్‌కు గట్టిగా బుద్ధి చెబుతున్న భారతీయ సైనికులకు, వారిని ప్రోత్సహిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీకి, యుద్ధానికి అవసరమైన సహాయ, సహకారాలు అందిస్తున్న కేంద్రప్రభుత్వానికి రాష్ట్రప్రజానీకం తోడుగా వుండాల్సిన అవసరం ఉందన్నారు. ఇలాంటి సమయంలో తన పుట్టినరోజు సందర్భంగా పార్టీ శ్రేణులెవరూ తనను కలిసి శుభాకాంక్షలు తెలిపేందుకు రావొద్దని, ఆ రోజు రక్తదానం, అవయవ దానం, ఉచిత వైద్యశిబిరాలు, సంక్షేమ సహాయాలు పంపిణీ చేయాల్సిందిగా ఈపీఎస్ సూచించారు. భారతీయ సైనికులు విజయం సాధించాలని ఆలయాలు, మసీదులు, చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు, పూజలు నిర్వహించాలని ఈపీఎస్ అన్నాడీఎంకే కార్యకర్తలకు విజ్ఞప్తి చేశారు.

## పంజాబ్‌లో పాకిస్తాన్ డ్రోన్ దాడి.. ముగ్గురికి గాయాలు..

**న్యూఢిల్లీ-నవభూమి:** భారత్, పాకిస్తాన్‌ల మధ్య యుద్ధ పరిస్థితి ఉద్రిక్తంగా మారుతోంది. భారత త్రివిధ దళాలు పాకిస్తాన్‌కు చుక్కలు చూపిస్తున్నాయి. పాక్ కూడా భారత్‌ను దెబ్బ తీయడానికి విశ్వప్రయత్నం చేస్తూనే ఉంది. మిస్సైల్, డ్రోన్ దాడులకు యత్నిస్తోంది. ఈ నేపథ్యంలోనే భారత సైన్యం పాక్‌కు సంబంధించిన మిస్సైల్స్, డ్రోన్లను ధ్వంసం చేస్తూ వస్తోంది. అయితే, నిన్న పంజాబ్‌లోని పలు ప్రాంతాల్లో పాకిస్తాన్ డ్రోన్‌లు దాడులకు యత్నించాయి. వాటిలో చాలా వాటిని భారత ఆర్మీ పేల్చేసింది. కానీ, ఓ పాకిస్తాన్ డ్రోన్ మాత్రం శు క్రవారం ఫిరోజాబాద్‌లోని ఇళ్లపై పేలింది.ఈ సంఘటనలో ముగ్గురికి గాయాలు అయ్యాయి. గాయపడ్డవారిని హుటాహుటిన దగ్గరలోని ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం వారికి అక్కడే చికిత్స అందుతోంది. ఇక, ఈ ఘటనపై ఫిరోజాబాద్ ఎస్ఎస్‌పీ భూపేందర్ సింగ్ సిద్ధు మాట్లాడుతూ.. ' ముగ్గురు వ్యక్తులు గాయపడినట్లు మాకు సమాచారం అందింది. వారికి కాలిన గాయాలు అయ్యాయి. డాక్టర్లు వారికి చికిత్స అందిస్తున్నారు. భారత ఆర్మీ పాకిస్తాన్ ప్రయోగిస్తున్న డ్రోన్లలో చాలా వాటిని ధ్వంసం చేస్తోంది' అని తెలిపారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.



## ఏ రాష్ట్రాన్నీ బలవంతంగా ఒప్పించలేం



**న్యూఢిల్లీ-నవభూమి:** త్రిభాషా సూత్రంతో కూడిన జాతీయ విద్యా విధానం(ఎన్ఈపీ)-2020ను అమలు చేసేలా తమిళనాడు ప్రభుత్వాన్ని ఆదేశించాలంటూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని (పిల్) సుప్రీం కోర్టు శుక్రవారం కొట్టివేసింది. జాతీయ విద్యా విధానాన్ని అమలు చేయాలని రాజ్యాంగంలోని ఆర్టికల్ 32 ప్రకారం ఏ రాష్ట్రాన్ని బలవంతం చేయలేమని ఈ సందర్భంగా జస్టిస్ జేబీ పార్థీవాలా, జస్టిస్ ఆర్ మహదేవన్ ధర్మాసనం స్పష్టం చేసింది. "ఎన్ఈపీ-2020 అమలు చేయాలా వద్దా అనేది రాష్ట్రాలకు సంబంధించిన సమస్య. ఆర్టికల్ 32 ప్రకారం ప్రజల హక్కులు పరిరక్షించేలా చూడటానికే ఆదేశాలు ఇవ్వగలం. ఎన్ఈపీ-2020 లాంటి పాలసీలను అమలు చేయాలని ఏ రాష్ట్రాన్ని బలవంతం చేయలేం. ఎన్ఈపీ విషయంలో ఏ రాష్ట్రమైనా ప్రాథమిక హక్కుల ఉల్లంఘనలకు పాల్పడితే మాత్రమే జోక్యం చేసుకోగలం. అందువల్ల ఈ పిటిషన్‌ను విచారించలేం" అని ?ధర్మాసనం వెల్లడించింది. అయితే ప్రధాన సమస్య విషయంలో తగిన ప్రొసీడింగ్స్‌లో విచారణ చేపట్టే అవకాశం ఉంటుందని పేర్కొంది. కాగా, పిల్ విచారణకు ముందు పిటిషనర్ జీఎస్ మణిని కోర్టు ప్రశ్నించింది. ఎన్ఈపీ అమలు చేయాలని ఎందుకు కోరుకుంటున్నారని అడిగింది. దీనిపై పిటిషనర్ స్పందిస్తూ.. తాను తమిళనాడుకు చెందిన వ్యక్తిని అని, ప్రస్తుతం ఢిల్లీలో నివసిస్తున్నానని చెప్పారు. ఎన్ఈపీ అమలు కాకపోవడం వల్ల తమిళనాడులో తాను సులువుగా హిందీ నేర్చుకోలేనని తెలిపారు. దీనిపై కోర్టు స్పందిస్తూ.. 'ఇప్పుడు ఢిల్లీలో నేర్చుకోండి' అంటూ సూచించింది.

## పాక్ ఫేక్ న్యూస్ వార్!

భారత్‌పై దాడికి దుస్సాహసం చేసిన పాకిస్థాన్‌కు.. భారత్ చేస్తున్న ప్రతిదాడిని తట్టుకుని నిలబడలేక ముచ్చెమటలు పడుతున్నాయి. పాకిస్థాన్ ప్రయోగిస్తున్న మిస్సైళ్లను భారత సైన్యం లేచీలేవంగనే తుత్తునియలు చేస్తున్నది. ఈ నేపథ్యంలో పాకిస్థాన్ తమ దేశంలోని సోషల్ మీడియాలో అసత్యప్రచారం చేసుకుంటున్నది.

మీరు తగినంత పెద్ద అబద్ధం చెప్పి దాన్ని పదేపదే చెప్తూ ఉంటే చివరికి ప్రజలు దానిని నమ్మడం ప్రారంభిస్తారు. ఆ అబద్ధాన్ని రాజకీయ, ఆర్థిక, సైనిక పరిణామాల నుంచి రాష్ట్ర ప్రజలను రక్షించగలిగినంత కాలం మాత్రమే అబద్దాన్ని కొనసాగించవచ్చు. అందువల్ల సమాజంలో అసమ్మతిని అణచివేయడానికి అన్ని అధికారాలను ఉపయోగించడం చాలా ముఖ్యమైనది. ఎందుకంటే సత్యం అబద్ధానికి ప్రధాన శత్రువు అంటూ నాజీ ప్రచారమంత్రి జోసెఫ్ గోబెల్స్ ప్రభుత్వవర్గాలకు, పార్టీ అనుచరులకు చెప్పేవాడు. ఇప్పుడు పాకిస్థాన్ కూడా ఇదే సూత్రాన్ని అనుసరిస్తున్నట్టు స్పష్టమవుతు న్నది. ఫేక్ ప్రచారాన్ని నమ్ముకున్న పాక్: ఆపరేషన్ సిందూర్ తర్వాత పాకిస్థాన్ సోషల్ మీడియాలో భారత్‌పై అబద్ధపు ప్రచారాన్ని చేపడుతున్నది. పాకిస్థాన్ అనుకూల సోషల్ మీడియాలో ఈ ప్రచారానికి తెరలేపింది. ఈ ప్రచారం కేవలం ప్రజలను తప్పుదోవ పట్టించడమే కాదు, మ్యానిపులేట్ చేసే చర్యగా అభివర్ణించవచ్చు. జమ్మూ ఎయిర్‌పోర్ట్ తగలబడిపోయిందని పాకిస్థాన్ సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నది. ఈ ఫొటోలు నిజం కావని భారత్‌కు చెందిన ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో-పీఐబీ తేల్చేసింది. ఈ ఫొటోలు ఇప్పటివి కావని వెల్లడించింది. అసలు ఈ ఫొటోలు ఇండియాకు చెందినవే కావని, 2021 ఆగస్టులో కాబూల్ ఎయిర్‌పోర్ట్‌లో జరిగిన బాంబింగ్‌కు సంబంధించిన పాత ఫొటోలని తెలిపింది. కానీ వీటిని జమ్మూ ఎయిర్‌పోర్ట్ ఫొటోలుగా పాకిస్థాన్ ప్రచారం చేస్తున్నదని పేర్కొన్నది.

ఏటీఎంలు మూతపడ్డాయట : పాత వీడియోలను కొత్త వీడియోలుగా ప్రచారం చేస్తున్న పాకిస్థాన్ కొత్తసీసాలో పాతసారా పోసినట్టుగా వ్యవహరిస్తున్నది. ఇండియా మీద దాడి చేశామంటూ పాకిస్థాన్ సైన్యం తమ దేశ ప్రజల ముందు చెప్పుకుంటున్నది. అలాగే ఇండియాలో ఏటీఎంలు మూతపడ్డాయని సోషల్ మీడియా ప్రచారం చేస్తున్నది. ఈ ఫేక్ న్యూస్‌ను పీఐబీ కొట్టిపారేసింది. భారత్‌లో ఏ ఒక్క ఏటీఎం కూడా మూతపడలేదని, మరింత క్రియాశీలకంగా పనిచేస్తున్నాయని పేర్కొన్నది. వివిధ బ్యాంకుల ఉన్నతాధికారులు కూడా ఇదే విషయాన్ని తేల్చిచెప్పారు.


గుజరాత్ ఎయిర్‌పోర్ట్‌పై దాడి: ప్రధానమంత్రి నరేంద్రమోదీ సొంత రాష్ట్రమైన గుజరాత్‌లోని ఎయిర్‌పోర్ట్‌ను ధ్వంసం చేశామంటూ పాక్ సైన్యం సోషల్ మీడియా ప్రచారం చేసుకుంటున్నది. 2021 జులై 7వ తేదీన ఒక ఆయిల్ ట్యాంకర్ పేలిపోయిన ఫొటోలను జతచేసి, ఇవే గుజరాత్ ఎయిర్‌పోర్ట్ ఫొటోలంటూ ఫేక్ న్యూస్ వైరల్ చేస్తున్నది. ఇరుదేశాల మధ్య టెన్షన్ వాతావరణం ఉన్నందున బీసీసీఐ ఐపీఎల్ మ్యాచ్‌ను రద్దు చేసుకుంది. కానీ ఈ వార్తను కూడా పాక్ మరోవిధంగా ప్రచారం చేసుకుంటున్నది. కలకత్తా వెదర్ రిపోర్టు ప్రకారం ఐపీఎల్ మ్యాచ్ రద్దు అయ్యిందని ప్రచారం చేసుకుంటున్నది.

జలంధర్‌లో డ్రోన్ అటాక్: ఎప్పుడో ఏదో ప్రాంతంలో పంటపొలాల్లో జరిగిన అగ్నిప్రమాదానికి సంబంధించిన ఫొటోలు, వీడియోలు పాక్ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. ఇది జలంధర్‌లో తాము చేసిన డ్రోన్ అటాక్ అంటూ పాక్ ప్రచారం చేస్తున్నది. ఈ ఫేక్ వార్తను కూడా పీఐబీ కొట్టిపారేసింది. ఆపరేషన్ సిందూర్-2 ప్రారంభమైన తర్వాతే పాకిస్థాన్ లింక్డ్ అకౌంట్స్‌లో ఇలా చాలా రకాలుగా తప్పుడు ప్రచారం జరుగుతున్నది. భారతదేశంలోని ఎయిర్‌పోర్టులు మూతపడ్డాయని మరో వార్త ప్రచారంలో ఉంది. దేశంలో ఎక్కడా ఎయిర్‌పోర్టులు మూతపడలేదు. సెక్యూరిటీ తనిఖీలను దృష్టిలో పెట్టుకుని, ప్రయాణికులు మూడు గంటల ముందుగా ఎయిర్‌పోర్ట్‌కు రావాలని మాత్రమే అధికారులు సూచించారు. ఇలా యుద్ధంలో పాకిస్థాన్ పలాయనం చిత్తగిస్తూ తమ దేశంలో మాత్రం ఫేక్ వీడియోలను వైరల్ చేసుకుంటున్నది. పాకిస్థాన్ ఫేక్ న్యూస్‌ను ప్రచారం చేసుకుంటున్నప్పటికీ సోషల్‌మీడియా యుగంలో ప్రపంచం నిజాలు తెలుసుకుంటున్నది. పాకిస్థాన్ నవ్వుల పాలవుతున్నది.

# సాంకేతిక విజయాల స్మృతి - సుస్థిర భవిష్యత్తు కోసం పునరంకితం



అది 1998వ సంవత్సరం మే నెల 11 వ తేదీ. ఒక విశాలమైన ఇంట్లో డైనింగ్ టేబుల్ చుట్టూ ఒక పెద్దమనిషితో పాటు మరో నలుగురు కూర్చుని ఉన్నారు. వారి మనసులో ఏదో తెలియని ఆత్రుత. టేబుల్ మీదున్న ఆహారం వారి ఆకలిని తీర్చలేదు. ఏదో ఒక వార్త కోసం వారు వేయి కళ్ళతో ఎదురు చూస్తున్నారు. సరిగ్గా అదే సమయంలో వారికి దూరంగా ఉన్న గదిలో ఫోన్ మోగింది. ఆ ఫోన్ ఎప్పుడు మోగుతుందా అని ఎదురు చూస్తున్న వ్యక్తి టెన్షన్‌తో ఫోన్ ఎత్తారు. అవతలి నుంచి వినిపించిన మాటలు వారిని ఒక్కసారిగా ఆనందంలో ముంచెత్తాయి. "సార్ ! మనం సాధించాం!" అని ఫోన్ చేసిన వ్యక్తి చెప్పగానే, "గాడ్ బ్లెస్ యూ" అంటూ ఫోన్ దగ్గర ఉన్న వ్యక్తి గట్టిగా అరిచారు. వెంటనే ఆ వ్యక్తి డైనింగ్ టేబుల్ దగ్గరకు వెళ్లి విషయం చెప్పారు. అంతే! వారి ఆకలి ఒక్కసారిగా తీరిపోయింది. ఆ ఆనందంలో ఎవరూ ఏమీ మాట్లాడలేకపోయారు. వారి కళ్ళల్లో ఆనంద భాష్పాలు మెరిశాయి. కాసేపటికి ఆ వాతావరణం సంతోషంతో నిండిపోయింది. ఇదంతా ఒక కథలా అనిపిస్తుంది కదూ? కానీ ఇది కథ కాదు ! ఇది వాస్తవం ! ప్రపంచంలో మన దేశాన్ని గగన శిఖరాలకు చేర్చిన నిజం. ఆ రోజు డైనింగ్ టేబుల్ దగ్గర కూర్చున్న పెద్దమనిషి అప్పటి ప్రధాన మంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయి. మిగిలిన నలుగురు క్యాబినెట్ మంత్రులు లాల్ కృష్ణ అద్వాణీ, జార్జ్ ఫెర్నాండెజ్, యశ్వంత్ సిన్హా, జస్వంత్ సింగ్. ఫోన్ దగ్గర వేచి చూస్తున్న వ్యక్తి బ్రజేశ్ మిశ్రా. అవతలి నుంచి ఫోన్ చేసిన వ్యక్తి డాక్టర్ ఏ.పి.జె. అబ్దుల్ కలాం. ఆ ఫోన్ కాల్ వచ్చింది పోఖ్రాన్ నుంచి. వారు విన్న శుభవార్త ఏమిటంటే భారతదేశం చేపట్టిన అణు పరీక్ష విజయవంతమైంది! పోఖ్రాన్-%××% పరీక్షలు 1998 మే 11న పోఖ్రాన్‌లో భారతదేశం నిర్వహించిన ఐదు అణు బాంబు పరీక్షల శ్రేణి. భారతదేశం నిర్వహించిన అణు పరీక్షల్లో ఇది రెండవది. ఈ పరీక్ష కోసం అప్పటి ప్రధాని వాజ్‌పేయికి, శాస్త్రవేత్త డాక్టర్ అబ్దుల్ కలాం క్షిపణి కార్యక్రమం, ఆర్. చిదంబరం అణు కార్యక్రమం గురించి వివరించారు. కేవలం కొద్ది సమయంలోనే సన్నాహాలు పూర్తి చేయాలని వాజ్‌పేయి




శాస్త్రవేత్తలను ఆదేశించారు. ఈ పరీక్షను విదేశీ గూఢచారులకు తెలియకుండా రహస్యంగా నిర్వహించడం ఒక సవాలుగా నిలిచింది. డాక్టర్ అబ్దుల్ కలాం, డాక్టర్ చిదంబరం ఈ పరీక్ష ప్రణాళికకు ముఖ్య సమన్వయకర్తలుగా ఉన్నారు. పరీక్షల గోప్యత కోసం శాస్త్రవేత్తలందరూ ఆర్మీ యూనిఫారాలు ధరించారు. 58వ ఇంజనీర్ రెజిమెంట్ అమెరికా గూఢచారి ఉపగ్రహాలకు తెలియకుండా ఈ పనిని పూర్తి చేసింది. 1998 మే 11న 'ఆపరేషన్ శక్తి' పేరుతో మొదటి పరీక్ష జరిగింది. ఆ తరువాత మే 13న మరో రెండు అణు పరీక్షలు నిర్వహించబడ్డాయి. ఈ విజయంతో భారతదేశం పూర్తి స్థాయి అణు దేశంగా అవతరించింది. మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి ఈ చారిత్రాత్మక పోఖ్రాన్ విజయాన్ని గుర్తుచేసుకోవడానికి మే 11వ తేదీని జాతీయ సాంకేతిక దినోత్సవంగా ప్రకటించారు. 1999 నుండి మనం ఈ గర్వకారణమైన దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం.

**సాంకేతికత ఒక కీలకమైన పాత్ర:**

ఈ రోజున మన దేశ శాస్త్రవేత్తలు, ఇంజనీర్లు, సాంకేతిక నిపుణులు సాధించిన విజయాలను స్మరించుకోవడానికి ఒక ప్రత్యేక సందర్భం. 1998లో రాజస్థాన్‌లోని పోఖ్రాన్‌లో నిర్వహించిన విజయవంతమైన అణు పరీక్షల జ్ఞాపకార్థంగా ఈ రోజును జరుపుకోవడం మొదలుపెట్టారు. ఈ చారిత్రాత్మక విజయం భారతదేశాన్ని ప్రపంచ దేశాల సరసన నిలిపింది. ఈ సంవత్సరం జాతీయ సాంకేతిక పరిజ్ఞాన దినోత్సవం ముఖ్య ఇతివృత్తం "ఆవిష్కరణ ద్వారా రేపటి సుస్థిరతకు సాధికారత". ఈ అంశం మన భవిష్యత్తును మరింత మెరుగుపరచడానికి సాంకేతిక పరిజ్ఞానం ప్రాముఖ్యతను నొక్కి చెబుతుంది. పర్యావరణ పరిరక్షణ, వనరుల సద్వినియోగం, కాలుష్య నియంత్రణ వంటి అంశాలలో సాంకేతికత ఒక కీలకమైన పాత్ర పోషిస్తుంది.

పర్యావరణ పరిరక్షణలో ఆవిష్కరణలు:

వాతావరణ మార్పులు ప్రపంచానికి ఒక పెద్ద సవాలుగా మారాయి. ఈ సమస్యను ఎదుర్కోవడానికి పునరుత్పాదక ఇంధన వనరుల (సౌర, పవన, జల విద్యుత్) అభివృద్ధిలో జరుగుతున్న ఆవిష్కరణలు ఎంతో ముఖ్యం. మరింత సమర్థవంతమైన ఇంధన నిల్వ సాంకేతికతలు, కర్బన ఉద్గారాలను తగ్గించే పద్ధతులు, వాయు కాలుష్యాన్ని నియంత్రించే కొత్త టెక్నాలజీలు మన పర్యావరణాన్ని కాపాడతాయి. ఉదాహరణకు ఎలక్ట్రిక్ వాహనాల అభివృద్ధి వాటి కోసం మెరుగైన బ్యాటరీల తయారీ రవాణా రంగంలో కాలుష్యాన్ని తగ్గిస్తుంది.

**వనరుల సద్వినియోగంలో ఆవిష్కరణలు:**

సహజ వనరులు పరిమితంగా ఉన్నాయి. వాటిని జాగ్రత్తగా ఉపయోగించడం మన బాధ్యత. నీటిని పొదుపు చేసే వ్యవసాయ పద్ధతులు, వ్యర్థ జలాల శుద్ధి, ఖనిజాలను తిరిగి వినియోగించే టెక్నాలజీలు వనరుల కొరతను అధిగమించడానికి సహాయపడతాయి. డ్రిప్ ఇరిగేషన్ వంటి ఆధునిక నీటిపారుదల వ్యవస్థలు నీటి వృథాను తగ్గిస్తాయి.

**వ్యర్థాల నిర్వహణలో ఆవిష్కరణలు:**

పెరిగిపోతున్న వ్యర్థాలు పర్యావరణానికి పెద్ద ముప్పుగా మారాయి. వ్యర్థాలను తిరిగి ఉపయోగించగలగడం (రీసైక్లింగ్), వాటిని శక్తిగా మార్చడం (వేస్ట్-టు-ఎనర్జీ ప్లాంట్లు), జీవ వ్యర్థాలను కంపోస్ట్‌గా మార్చడం వంటి నూతన సాంకేతికతలు వ్యర్థాల సమస్యకు సమర్థవంతమైన పరిష్కారాలను అందిస్తాయి.

వ్యవసాయ రంగంలో ఆవిష్కరణలు:

ఆహార భద్రతను నిర్ధారించడానికి వ్యవసాయ రంగంలో ఆధునిక సాంకేతికతల వినియోగం చాలా ముఖ్యం. డ్రోన్ల ద్వారా పంటలను పర్యవేక్షించడం, నేల ఆరోగ్యాన్ని అంచనా వేయడం, ఖచ్చితమైన వ్యవసాయ పద్ధతులను అనుసరించడం ద్వారా దిగుబడిని పెంచవచ్చు. వనరులను సమర్థవంతంగా ఉపయోగించవచ్చు. జన్యుపరంగా మెరుగుపరచిన పంటలు తక్కువ నీటితో తక్కువ రసాయన ఎరువులతో ఎక్కువ దిగుబడినిస్తాయి.

**సవాళ్ళు - పరిష్కారాలు:**

నేడు మనం అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నాం. వాతావరణ మార్పులు, పెరుగుతున్న జనాభా, క్షీణిస్తున్న సహజ వనరులు మన ముందున్న ప్రధాన సమస్యలు. ఈ పరిస్థితుల్లో, సాంకేతిక ఆవిష్కరణలు మనకు ఒక ఆశాకిరణంలా కనిపిస్తున్నాయి. పునరుత్పాదక ఇంధన వనరుల అభివృద్ధి, శక్తి సామర్థ్యాన్ని పెంచే సాంకేతికతల ఆవిష్కరణ, వ్యర్థాల నిర్వహణకు నూతన పద్ధతులు, వ్యవసాయ రంగంలో ఆధునిక టెక్నాలజీల వినియోగం - ఇవన్నీ ఒక సుస్థిరమైన భవిష్యత్తును నిర్మించడానికి మనకు సహాయపడతాయి. 2025వ సంవత్సరంలో భారతదేశం అనేక సాంకేతిక రంగాల్లో ముందంజలో ఉంది. కృత్రిమ మేధస్సు, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ , బ్లాక్‌చెయిన్ టెక్నాలజీ వంటి అత్యాధునిక సాంకేతికతలు వివిధ రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకువస్తున్నాయి. వైద్యం, విద్య, రవాణా, వ్యవసాయం వంటి రంగాలలో ఈ సాంకేతికతల వినియోగం పెరగడం వల్ల ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడుతున్నాయి. భారతదేశం ఒక యువ శక్తి కలిగిన దేశం. మన యువతరం యొక్క సృజనాత్మకతను, నూతన ఆలోచనలను ప్రోత్సహించడం చాలా ముఖ్యం. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు సైన్స్, టెక్నాలజీ పట్ల ఆసక్తిని కలిగించాలి. పరిశోధన అభివృద్ధి రంగంలో పెట్టుబడులు పెంచడం ద్వారా మరిన్ని ఆవిష్కరణలను ప్రోత్సహించవచ్చు.

**బాధ్యతను గుర్తు చేసే రోజు:**

జాతీయ సాంకేతిక పరిజ్ఞాన దినోత్సవం కేవలం వేడుక కాదు, ఇది మన బాధ్యతను గుర్తు చేసే రోజు. రాబోయే తరాల కోసం ఒక మెరుగైన, సుస్థిరమైన భవిష్యత్తును నిర్మించడానికి సాంకేతిక పరిజ్ఞానాన్ని ఎలా ఉపయోగించాలో ఆలోచించాల్సిన సమయం ఇది. ప్రభుత్వాలు, విద్యా సంస్థలు, పరిశ్రమలు మరియు ప్రజలందరూ కలిసికట్టుగా కృషి చేస్తే, సాంకేతిక పరిజ్ఞానం ద్వారా మనం ఒక ఉజ్వలమైన భవిష్యత్తును సాధించగలమని విశ్వసిద్దాం.

**మే 12 జాతీయ సాంకేతిక దినోత్సవం సందర్భంగా...**



**జనక మోహన రావు దుంగ**
**ఫోన్: 8247045230**


# కశ్మీర్ వివాదం పాక్‌కు యమపాశం



యాభై మూడేండ్ల క్రితం పాకిస్థాన్ చిత్తుచిత్తుగా ఓడిన 1971 యుద్ధానికి, రెండు దాయాది దేశాల మధ్య ప్రస్తుత ఘర్షణకు తేడాలు అన్నీ ఇన్నీ కావు. ఇప్పుడు పూర్తిస్థాయి యుద్ధంగా రూపుదిద్దుకుంటున్న 2025 వేసవి పోరు మాదిరిగా అప్పటి యుద్ధం పూర్తిగా కశ్మీర్ వివాదం నుంచి రాజుకోలేదు. అందుకే దాన్ని చాలా మంది బంగ్లాదేశ్ యుద్ధం అంటారు. కానీ ప్రస్తుతం పహల్గాం దాడికి ప్రతీకారంగా భారత్ మొదలుపెట్టిన దాడుల్లో పాకిస్థాన్ మూణ్ణాళ్లకే చతికిలబడే పరిస్థితి వచ్చింది. చేవలేక పోయినా దుర్మార్గపు ఎత్తుగడలకు పాల్పడి పాకిస్తాన్ ఈ దుస్థితిని తనంతట తానే ఆహ్వానించింది.

కేవలం మతం ఆధారంగా, ఇంకా చెప్పాలంటే భారత ఉపఖండంలో మతాన్ని జాతిగా వర్ణించి, వాదించి పుట్టిన దుందుడుకు దేశం పాకిస్థాన్. తన ఉనికికి పునాదిగా ప్రకటించుకున్న మతానికి కూడా గౌరవం ఇవ్వకుండా తూర్పు పాకిస్థాన్ (తూర్పు బెంగాల్) లోని బెంగాలీ ముస్లింలపై భాషా వివక్షతో 'పశ్చిమ పాకిస్తాన్ నాయకత్వం' క్రూరంగా వ్యవహరించింది. ఫలితం పాక్ ఎడమ భుజం తూర్పు పాకిస్థాన్ లేదా తూర్పు బెంగాల్ పాకిస్థాన్ శరీరం నుంచి తెగిపోయి బంగ్లాదేశ్‌గా అవతరించింది. రెండు అగ్రరాజ్యాల కనుసన్నల్లో నడిచిన ప్రచ్ఛన్న యుద్ధ ప్రపంచంలో రెండు భారత ఉపఖండ దేశాల మధ్య చివరగా జరిగిందే 1971 యుద్ధం. పుట్టినప్పటి నుంచీ ప్రచ్ఛన్న యుద్ధాన్ని తనకు అనుకూలంగా మార్చుకున్న విఫల రాజ్యం పాకిస్థాన్. ఎవరి మాటా వినని 'రోగ్ స్టేట్'గా ప్రసిద్ధికెక్కింది ఈ సైనిక దేశం. మొదటి నుంచీ తన జనాభా నిష్పత్తికి అసమాన రీతిలో ఎక్కువ సైన్యాన్ని పెంచి పోషిస్తూ వస్తున్న పాక్‌లో దాని వల్ల సైన్యం, రాజకీయ నాయకులు, మతతత్వ శక్తులకే తప్ప ప్రజలకు ఎలాంటి మేలు జరగలేదనే వాస్తవం ప్రపంచానికి తెలుసు. 1971 యుద్ధం నాటికే భారత్ అన్ని రంగాల్లో ఆధిపత్యం ప్రదర్శించడంతో ఆ ఏడాది వేసవిలో కేవలం 13 రోజులకే పాకిస్థాన్ సైన్యం భారత సేనలకు లొంగిపోయింది. అయితే అప్పటి నుంచీ కేవలం సైనిక బలగంతో, ఒక అగ్రదేశం, కొన్ని ఆసియా, పాశ్చాత్య దేశాల తోడ్పాటుతో ఎలాగైనా పూర్తిస్థాయి యుద్ధం చేయకుండానే అడ్డదారుల్లో ఇండియాను నిరంతరం గాయాలతో బలహీనం చేయాలని, 1947, 1965 యుద్ధాల్లో ఓటములకు ప్రతీకారం తీర్చుకోవాలని పాక్ అనుసరిస్తున్న వ్యూహాలు ఇప్పటికీ అమలవుతూనే ఉన్నాయి. కొన్ని ధూర్త శక్తులకు పాక్ భూభాగంలో శిక్షణ ఇచ్చి, కశ్మీర్‌లో ఉగ్రవాద చర్యలకు పాల్పడడానికి అక్కడి సైనికప్రజా ప్రభుత్వాలు దశాబ్దాలుగా చేస్తున్న ప్రయత్నాల ఫలితమే ప్రస్తుత యుద్ధం. తన భూభాగంలో శిక్షణ పొందిన ఉగ్రవాదులతో పహల్గాం ఊచకోతలో 26 మందిని పొట్టనపెట్టుకున్న పాకిస్తాన్ ఆపరేషన్ సిందూర్‌తో విజయవంతంగా బుద్ధిచెప్పిన భారత సైనిక దళాలతో తల పడడానికి ప్రయత్నించడం దుస్సాహసం. దాదాపు 54 సంవత్సరాల తర్వాత జరుగుతున్న తాజా పూర్తిస్థాయి యుద్ధంలో పాకిస్థాన్ ఎవరూ ఊహించని విధంగా అన్నిచోట్లా ఓటములను, ఎదురుదెబ్బలను ఎదుర్కొంటున్నది. ఈ ఐదున్నర దశాబ్దాల్లో రక్షణపరంగా ఇండి యా తన వైమానిక దళం సహా యావత్తు రక్షణ వ్యవస్థను, సైనిక పాటవాన్ని ఎన్నో రెట్లు పెంచుకుందని గత మూడు రోజులుగా సాగుతున్న పోరాటం రుజువు చేస్తున్నది. కొద్ది రోజుల్లోనే భారత సేనలకు తిరుగులేని విజయాలు సొంతమవ్వడంతో ఎక్కడ చూసినా 'భారత ఎయిర్ డిఫెన్స్ సిస్టం' గురించే చర్చ జరుగుతోంది. కొన్నేళ్ల క్రితం దేశవ్యాప్తంగా భారీ వరదలు, కోలుకోలేని ఆర్థిక సంక్షోభం ఫలితంగా పాక్ ప్రజలు కనీసం గోధుమ పిండి, పాలు కొనుగోలు చేయలేని స్థితికి చేరుకున్నారు. దశాబ్దాల రాజకీయ అస్థిరత అలాగే కొనసాగుతోంది. చాలాకాలంగా బద్ధ శత్రువులైన పాకిస్థాన్ ముస్లింలీగ్, పాకిస్తాన్ పీపుల్స్ పార్టీలతో 2024 మార్చిలో ఏర్పడిన సంకీర్ణ సర్కారు ఇస్లామాబాద్‌లో కొలువుతీరిన అత్యంత బలహీన ప్రభుత్వం. మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్‌ను పాక్ ఆర్మీ సాయంతో వేటాడడం ఒక పని అయితే, ఇండియాను పూర్తిస్థాయి యుద్ధంతో కాకుండా ఉగ్రవాద తండాలతో కశ్మీర్‌లో గాయపరచడం ప్రధాని షాబాజ్ షరీఫ్ సర్కారు అనుసరిస్తున్న ద్విముఖ వ్యూహం చివరికి ఇండియాతో యుద్ధంలో ఘోర పరాజయం పాలయ్యే దుస్థితికి తీసుకొచ్చింది. మతానికి ఉగ్రవాదం అనే విషాన్ని జోడించి కశ్మీర్ పేరుతో పన్నిన పాక్ పన్నాగానికి ఇక శాశ్వతంగా నూకలు చెల్లాయని మన కళ్ల ముందే రుజువవుతున్నది. ప్రస్తుత పాక్ ఆర్మీ చీఫ్ జనరల్ అసీమ్ మునీర్ కిందటి నెల 16న రాజధాని ఇస్లామాబాద్‌లో జరిగిన ప్రవాస పాకిస్తానీయుల సమావేశంలో రెచ్చిపోయి మాట్లాడినప్పుడే రెండు దేశాల మధ్య యుద్ధం తప్పదనే అనుమానం మొదలైంది. పాకిస్థాన్‌లో మతాన్ని బాహాటంగా, తన స్వార్థం కోసం వాడుకున్న నాటి సైనిక పాలకుడు జనరల్ జియా ఉల్‌హక్ మాదిరిగానే ఇండియా నుంచి వచ్చిన కరుడుకట్టిన పంజాబీ ముస్లిం కుటుంబం నుంచి ఎదిగిన అసీం మునీర్ ఆరడుగులు ముందుకేసి ఈ ఏడాది ఏప్రిల్ సమావేశంలో మతం పేరిట రెచ్చగొట్టే ప్రసంగం చేశారు. 'కశ్మీర్ పాకిస్థాన్‌కు ముఖ్యమైన రక్త నాళం (జుగులర్ వీన్). దాన్ని కాపాడుకుంటాం. కశ్మీరీలకు వారి పోరాటంలో అండగా నిలుస్తాం' అని మునీర్ ప్రకటించడం సంచలనం సృష్టించింది. అంతటితో ఆగకుండా, 'ఇస్లాంకు ప్రాణప్రద లక్ష్యమైన కల్మా ఆధారంగా మొదటి ఇస్లామిక్ రాజ్యాన్ని 1300 ఏండ్ల క్రితం మదీనాలో స్థాపిస్తే 1947లో అదే కల్మా ప్రాతిపదికగా పుట్టిన దేశం పాకిస్థాన్ ' అంటూ అసీం మునీర్ తోటి ముస్లింలను అడ్డగోలుగా రెచ్చగొట్టే ప్రయత్నం చేశాడు. ఒక పక్క దేశంలోని కీలక భూభాగాలైన బలూచిస్థాన్, ఖైబర్ పఖ్తూన్‌క్వా ప్రావిన్సుల్లో వేర్పాటువాదులు, జిహాదీలే రాజ్యమేలుతున్నారు. పాక్ సైన్యం పరోక్ష సాయంతో బలపడిన ముస్లిం ఉగ్రవాదులకు పూర్వం వాయువ్య సరిహద్దు రాష్ట్రంగా పిలిచే పఖ్తూన్‌క్వాలో ఈమధ్య తలొగ్గి వారితో అవమానకర రీతిలో శాంతి ఒప్పందాలు చేసుకుంది పాక్ సర్కారు. బలూచిస్థాన్‌లో తిరుగుబాటుదారుల ధాటికి సైనిక దళాలు కుదేలవుతున్నాయి. 'విఫలరాజ్యం' పూర్తిగా విఫలమై ముక్కచెక్కలయ్యే దశకు చేరుకుందా? అనే అనుమానం బలపడుతున్న సమయంలో జనరల్ అసీం మునీర్ రెచ్చగొట్టే ధోరణి ఫలితమే కశ్మీర్‌లో పహల్గాం ఊచకోత. 2019 నాటి పుల్వామా మారణకాండ తర్వాత భారత సేనలు పాక్ భూభాగంలోని ఉగ్రవాద శిక్షణ శిబిరాలను ధ్వంసం చేసినా పాకిస్తాన్ సైనికరాజకీయ పాలక ముఠాకు బుద్ధి రాలేదు. బాలాకోట్ దాడుల నుంచి ఏమాత్రం గుణపాఠం నేర్చుకోలేదు. ఈ ఆరేళ్లలో అన్ని విధాలా చిక్కిపోయిన పాకిస్తాన్‌కు తన పాలకుల బాధ్యతారాహిత్యం, మితిమీరిన పొగరు పెద్ద శాపాలయ్యాయి. ముందు ఇంటిని బాగుచేసుకోవాల్సిన పాలకులు దేశ అంతర్గత సంక్షోభాల నుంచి జనం దృష్టి మళ్లించడానికి పాత ఫార్ములానే ఎంచుకోవడం దాదాపు పాతిక కోట్ల పాకిస్థానీయుల దురదృష్టం. 1971 యుద్ధం తర్వాత నుంచి ఇప్పటి వరకూ ఇండియా అన్ని రంగాల్లో ఎనలేని విజయాలు సాధించింది. ప్రపంచంలో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించింది. నాలుగో స్థానానికి చాలా దగ్గర్లో ఉంది. ఏ రకంగా చూసినా భారత్‌తో పోటీపడడానికి ఎక్కడా అవకాశం పాక్‌కు లేదు. అందుకే మతతత్వం, ఉగ్రవాదంతో మిళితమైన కశ్మీర్ వివాదం అనే పాత ఆయుధమే పాక్ పాలకులకు దిక్కయింది.



## అగ్ని సూక్త మహిమ

భక్తి

ఎవని నుంచి జ్ఞానం పుట్టునో, అలాంటి అగ్ని కోసం సోమాన్ని ఇస్తాము. మమ్మల్ని బాధింపదలచిన వారిని అగ్ని దహించుగాక' అని పై శ్లోక భావం. ఒకసారి రాఘవేంద్ర స్వామి శిష్యులతో సంచారం చేస్తూ ఒక పట్టణంలో ఒక న్యాయవాది ఇంట్లో బసచేశారు. మర్నాడు ఆ గృహస్తుని ఇంట్లో కులదేవతా సమారాధనం జరుగుతున్నది. పెద్ద ఎత్తున అన్న సంతర్పణం చేస్తున్నారు. కుల పురోహితుడికి అట్టహాసం ఎక్కువ. రాఘవేంద్ర స్వామి స్నానం చేసి, పూజ ముగించుకొని పారాయణం చేస్తూ ఉన్నాడు. ఇంటికి భిక్షకోసం వచ్చిన వైదికులను చూసి పురోహితుడు డాంబికాన్ని ప్రదర్శిస్తూ%ొ% ఒక్కొక్కరికీ ఒక్కో పని పురమాయిస్తున్నాడు. వచ్చిన వారికి గంధం తీయడానికి ఎవరూ కనిపించలేదు. పురోహితుడి దృష్టి రాఘవేంద్ర స్వామిపై పడింది. అందరిలాంటి అతిథే అనుకున్న ఆయన రాఘవేంద్ర స్వామితో 'అవిగో సానరాయి, గంధపు చెక్క! వందమందికి సరిపడేంత గంధం తీసిపెట్టు' అని ఆజ్ఞాపించి వెళ్లిపోయాడు.

ముందురోజు నడక వల్ల బాగా అలసిపోయిన స్వామివారు మంత్రాలు పఠిస్తూనే గంధం తీయసాగారు! అంతమందికి గంధం తీయడం అంటే మాటలా! ఓపికగా గంధం తీసి, దానిని ఒక పాత్రలోకి చేర్చారు. ఇంతలో పురోహితుడు రానే వచ్చాడు. స్వామిని చూస్తూ 'ఇంతసేపా!' అని గద్దించాడు. గంధం పాత్రను పురోహితుడికి అందించాడు స్వామి. తీర్థ వినియోగం తర్వాత అందరికీ గంధం ఇచ్చారు. అంతా ఆనందంగా అలదుకున్నారు. అదేమోగానీ, గాలి సోకినంతనే వాళ్ల ఒళ్లంతా భగభగ మంటలెత్తాయి. అందరూ పురోహితుణ్ని దుయ్యబట్టారు. ఆయన స్వామివారిని నిలదీశారు. స్వామివారు మరికొంత గంధం తీసి వరుణ సూక్తంతో అభిమంత్రించి ఇచ్చారు. దానిని రాసుకోగానే అందరి తాపం శాంతించి చల్లబడ్డారు. ఆ గృహ యజమాని స్వామివారి మహిమను కొనియాడి కారణం అడిగాడు. అగ్నిసూక్తం పారాయణం చేస్తూ ఉంటే పురోహితుడు పరుష వాక్కులతో గంధం తీయమని పురమాయించడం వల్ల ఇలా జరిగిందని చెప్పారు స్వామి. అగ్నిదేవుని రక్షణలో ఉన్నవారి మనసు నొప్పించరాదని, అది అగ్నిదేవుడి ఆగ్రహానికి కారణం అవుతుందని ఈ దృష్టాంతం తెలియజేస్తున్నది.



# నవతార

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
9 | హైదరాబాద్ | ఆదివారం | 11 ၊ మే ၊ 2025

## ఈ మసాలా దినుసు వాడితే చాలు.. రక్తంలో చక్కెర స్థాయిలు కంట్రోల్లోకి

సమతుల్య ఆహారం తీసుకోవడం కీలకం. చక్కెర స్థాయిలు అదుపులో ఉండేందుకు ఇంటి నివారణల్లో ముఖ్యంగా దాల్చిన చెక్క నీటిని తీసుకోవడం వల్ల మంచి ఫలితం ఉంటుంది.దాల్చిన చెక్కలో అనేక ఔషధ గుణాలున్నాయి. ఈ సుగంధ ద్రవ్యం వంటకాల్లో మనం తరచుగా వాడేదే. ఇది శరీరంలో శక్తి, మానసిక స్థితిని మెరుగుపరుస్తుంది. రక్తంలో చక్కెర స్థాయిలను నిర్వహించడంలో శక్తివంతంగా మార్చడంలో సహకరిస్తుంది. దాల్చిన చెక్కలో ఇన్సులిన్ సెన్సిటివిటీని మెరుగుపరిచే సమ్మేళనాలున్నాయి. అవి శరీరంలో ఇన్సులిన్‌ను మరింత ప్రభావవంతంగా ఉపయోగించడంలో సహాయపడుతుంది. రక్తంలో చక్కెర స్థాయిలను తగ్గిస్తుంది. దాల్చిన చెక్క నీరు ఉదయాన్నే తీసుకుంటే గ్లూకోజ్ స్థాయిలను తగ్గిస్తుంది.

దాల్చిన చెక్కతో గ్లూకోజ్ స్థాయిలు..పురాతన ఈజిప్షియన్ల కాలం నుంచి సువాసన గల దాల్చిన చెక్కను శ్వాస ఇబ్బందికి, కడుపు నొప్పి ఉన్న సమయంలో దీనిని ఉపయోగించేవారు. మధుమేహం ఉన్నవారు జీవితాంతం మందులు వాడాల్సిందే. వీరికి దాల్చిన చెక్క మంచి ఉపయోగకరంగా ఉంటుంది. షుగర్ లెవల్స్ పెరగకుండా చేస్తుంది. దాల్చిన చెక్కలోని ఫ్లేవనాయిడ్స్ లాంటి అనేక రకాల పోషకాలున్నాయి. దాల్చిన చెక్కలోని యాంటీ ఆక్సిడెంట్, యాంటీ ట్యూమర్, యాంటీ ఇన్ఫ్లమేటరీ, యాంటీ క్యాన్సర్ గుణాలున్నాయి. ఇవి జీర్ణ క్రియను మెరుగుపరుస్తాయి.రోజుకు ఒక కప్పు దాల్చిన చెక్క నీరు త్రాగాలి. ఉదయాన్నే పరగడుపుతో లేదా భోజనానికి ముందు దీనిని తీసుకోవాలి. చక్కెర స్థాయిలు కంట్రోల్లో ఉండేందుకు సిలోన్ దాల్చిన చెక్కను ఎంచుకోవాలి. కాసియా చెక్క కన్నా సిలోన్ దాల్చిన చెక్క మంచిది. ఎందుకంటే ఇందులో తక్కువ స్థాయిలో కొమరిన్ ఉంటుంది.

# ఈ లోకంలో అమ్మను మించిన దైవం లేదు



మదర్స్ డేని ఎందుకు జరుపుకుంటారో తెలుసా..

అమ్మ ప్రేమను వివరించ లేము. త్యాగానికి చిరునామా అమ్మ. కనిపించే దైవం అమ్మ. అంతులేని ప్రేమానురాగాలకు ఆప్యాయతలకు తల్లి ఎవరికైనా ప్రత్యక్ష దైవం అని చెప్పొచ్చు. నవమాసాలు మోసి కష్ట పడి అమ్మ జన్మనివ్వడం ఒక ఎత్తయితే... రెక్కలు ముక్కలు చేసుకుని సరైన దారిలో పెట్టి ఎంతో కష్ట పడేది అమ్మ. ఇలా మీరు ఈ స్థాయిలో ఉండడానికి కారకురాలైన అమ్మని ఎంత ప్రేమగా చూసుకున్నా తక్కువే అవుతుంది.

ప్రతి ఒక్కరు కూడా కన్న తల్లిని గౌరవించాలి. ప్రతి రోజూ అమ్మని ప్రేమించాలి. అమ్మ చేసిన త్యాగాన్ని గుర్తించాలి. ప్రపంచంలోనే అతి పేద వాడు ధనం లేని వాడు కాదు అమ్మ ప్రేమ లేని వాడే ప్రపంచంలో అతి పేద వాడు. ఇక మదర్స్ డే గురించి చూస్తే... ప్రతి సంవత్సరం మే రెండవ ఆదివారం నాడు ప్రపంచ మాతృ దినోత్సవాన్ని జరుపుకుంటూ వస్తున్నాము. నిజానికి మదర్స్ డే వెనుక ఎంతో పెద్ద చరిత్ర ఉంది. గ్రీస్‌లో రియా అనే ఒక దేవతను మదర్ ఆఫ్ ద గాడ్స్‌గా భావించి ప్రతి ఏడాదికి ఒక సారి నివాళు లర్పించే వారు.

17వ శతాబ్దంలో అయితే ఇంగ్లాండ్‌లో తల్లులకు గౌరవంగా మదర్ సండే పేరిట ఉత్సవాలు జరిపే వారు. అదే 1872 లో అయితే జూలియ వర్డ్ హెూవే అనే ఒక మహిళ అమెరికాలో తొలిసారిగా ప్రపంచ శాంతి కోసం మదర్స్ డేని జరిపించారు. మదర్స్ ఫ్రెండ్షిప్ డేని జరిపేందుకు అన్న మేరీ జర్విస్ అనే మహిళ ఎంతో కృషి చేశారు. 1905 మే 9న ఆమె చనిపోగా ఆమె కుమార్తె మిస్ జర్విస్ మాతృ దినోత్సవం కోసం ఎంత గానో ప్రచారం చేయడం జరిగింది.

మదర్స్ డే ఎందుకు జరుపుకుంటామంటే..

అమ్మ ప్రేమను విలువ కట్టలేము. ఎంతో ఆప్యాయతను రోజు చూపిస్తూ ఉంటారు. చిన్న తనం నుండి వారికి ఇష్టమైనటు వంటి అభిరుచులను పక్కన పెట్టి ఎన్నో త్యాగాలు చేస్తూ పెంచుతారు. కానీ ఈ మధ్య కాలం లో తిరిగి అమ్మ తో సమయాన్ని గడపడానికి కూడా పిల్లలు ప్రయత్నించడం లేదు.

ఈ మధ్య కాలంలో చిన్నప్పటి నుండి ప్రేమగా పెంచి పెద్ద చేసిన అమ్మ ఇంటికి బరువు అయ్యిపోయింది. చాలా మంది తల్లులు పెద్ద వాళ్ళు అయిపోవడం వల్ల ఓల్డ్ ఏజ్ హెూమ్స్‌లో పెట్టడం... అమ్మని చూసుకోకపోవడం లాంటివి చేస్తున్నారు. మిమ్మల్ని కంటికి రెప్పలా చూసుకుని ఎంతో కష్టపడి ఎన్నో త్యాగాలు చేసిన అమ్మ మీకు బరువై పోవడం అనేది ఘోరం.

ఎక్కడో కాని కన్నతల్లిని చూసుకోవడం లేదు. ఎప్పుడూ కూడా కని పెంచిన అమ్మని మర్చిపోకూడదు. అమ్మ చేసినంతగా ఎవ్వరూ చేయరు. అమ్మ చూసినంతగా ఎవరూ చూడరు. నిజానికి మీరు అంత గొప్ప కాక పోయినా నా పిల్లవాడు గొప్ప, నా పిల్ల గొప్ప అని ఆమె చెబుతూ ఉంటుంది. మీరు చేసే ప్రతి చిన్న పనితో మురిసి పోతుంది ఆమె. అలానే మీరు ఏదైనా చిన్న విజయం పొందారు అంటే అదేదో ఆమె వరల్డ్ కప్ సాధించినట్టుగా ఫీల్ అవుతుంది.

ఇలా కల్మషం లేకుండా ఏమీ ఎరుగని అమ్మకి అంత పెద్ద శిక్ష వేయడం సరైన పని కాదు. కాబట్టి ప్రతి ఒక్కరూ కంటికి రెప్పలా అమ్మను చూసుకోవాలి. చిన్నప్పుడు అమ్మ మిమ్మల్ని ఎలా చూసుకునేది అలానే పెద్దయ్యాక ఆమెని మళ్ళీ మీరు అలా చూసుకోవాలి. అయితే ఈ సంవత్సరం మదర్స్ డే రోజు మరింత స్పెషల్ గా మార్చుకోవడానికి మీ అమ్మతో సమయం గడిపి చాలా మంచి గిఫ్ట్‌ను అందించండి.అయితే ఇక్కడో విషయం చెప్పాలి.. మదర్స్ డే వెనుక ఇంత కథ ఉందని చెప్పాం కానీ, అమ్మ ప్రేమకి ఒక్కరోజు సరిపోతుందా.. ఆమెని ప్రతిరోజు ఆనందంగా ఉంచితే అంతకన్నా మనం ఆమెకిచ్చే పెద్ద గిఫ్ట్ ఏం అవసరం లేదనే చెప్పాలి.

ఈ లోకంలోఅమ్మను మించిన దైవం లేదు. దేవుడు అన్ని చోట్ల ఉండలేక అమ్మను సృష్టించాడని చెబుతారు పెద్దలు. అమ్మ అంటే ఓ అనుభూతి, ఓ అనుబంధం, ఓ అనురాగం. అమ్మ గురించి ఎంత చెప్పినా తక్కువే అవుతుంది. ఎవ్వరికైనా అమ్మే తొలి గురువు. రెక్కలు ముక్కలు చేసుకుని మనల్ని పెంచి పెద్ద చేస్తుంది. బుడి బుడి అడుగుల నుంచే నడకను, ఆ తర్వాత బ వి త న ం నిర్దేశిస్తుంది. ఏ చిన్న తప్పుచేసినా కడుపులో దాచుకుని కనికరిస్తుంది. అందుకే అమ్మను గౌరవించడం ప్రతి ఒక్కరి ధర్మం. ప్రపంచంలో అతి పేదవాడు ధనం లేని వాడు కాదు అమ్మ లేనివాడు. అమ్మ ప్రేమ దక్కినవాడు అత్యంత కోటీశ్వరుడు. అంతులేని ప్రేమానుగారాలకు, ఆప్యాయతకు మారుపేరైన తల్లి ఎవరికైనా ప్రత్యక్ష దైవమే. అందుకే అమ్మ పట్ల మనకు ఉన్న ప్రేమను చాటుకోవడానికి ఇంతకన్నా మంచి తరుణం ఇంకోటి ఉండదు. మరోవైపు, ఏటా మే రెండో ఆదివారం ప్రపంచ మాతృదినోత్సవాన్ని జరుపుకుంటున్నారు. దీనికి సుదీర్ఘ చరిత్ర, ఓ నేపథ్యం ఉంది.

గ్రీస్‌లో 'రియా' అనే దేవతను 'మదర్ ఆఫ్ గాడ్స్'గా భావించి ఏడాదికోసారి నివాళి అర్పించేవారు. 17వ శతాబ్దంలో ఇంగ్లాండ్‌లో తల్లులకు గౌరవంగా 'మదరింగ్ సండే' పేరిట ఉత్సవాన్ని జరిపేవారు. 'జూలియవర్డ్ హెూవే' అనే మహిళ అమెరికాలో 1872లో తొలిసారిగా ప్రపంచ శాంతికోసం మదర్స్‌డే నిర్వహించాలని ప్రతిపాదించింది. అన్న మేరీ జర్విస్ అనే మహిళ 'మదర్స్ ఫ్రెండ్‌షిప్ డే' జరిపించేందుకు ఎంతో కృషిచేసింది.

ఆమె 1905 మే 9న మృతిచెందగా, ఆమె కుమార్తె మిస్ జెర్విస్ మాతృదినోత్సవం కోసం విస్తృతంగా ప్రచారం చేసింది. ఇలా 1911 నాటికి అమెరికాలోని అన్ని రాష్ట్రాల్లో మాతృదినోత్సవం జరుపడం మొదలైంది. ఫలితంగా 1914 నుంచి దీన్ని అధికారికంగా నిర్వహించాలని అమెరికా అధ్యక్షుడు ఉడ్రో విల్సన్ నిర్ణయించారు. కాలక్రమేణా ప్రపంచమంతా వ్యాపించింది. అప్పటినుంచి ఏటా మే రెండో ఆదివారం మాతృదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.



# మదర్స్ డే మేకప్



మదర్స్ డే నాడు మనోహరంగా కనిపించాలంటే 30 ఏళ్లు పైడిన తర్వాత ముఖంలో ప్రతిఫలించే గీతలు, మచ్చలను మేక్‌పతో దాచేయాలి. తోటి తల్లులందరిలో మెరుపులీనుతూ కనిపించడం కోసం... ఇవిగో ఈ ప్రాథమిక మేకప్ చిట్కాలు పాటించండి.

హైడ్రేషన్ కోసం: వేసుకునే మేకప్ ముఖం మీద సమంగా పరుచుకోవడం కోసం ముందుగా చర్మాన్ని సిద్ధం చేయాలి. అందుకోసం ఫేసియల్ సీరమ్‌ను ముఖం మీద అద్దుకోవాలి. ఈ సీరం జిడ్డుగా ఉండకుండా చర్మానికి తేమతో పాటు, సన్‌స్క్రీన్ రక్షణ కూడా అందించేలా ఉండాలి. ఈ సీరమ్ చర్మంలో చక్కగా ఇంకిపోయిన తర్వాతే మేకప్ మొదలు పెట్టాలి.

ద్రవరూప ఫౌండేషన్: ముఖం మీద ఉండే సన్నని గీతల్లో ఇరుక్కుపోయి ఎబ్బెట్టుగా కనిపించకుండా ఉండాలంటే తేలికపాటి ద్రవరూప ఫౌండేషన్ ఎంచుకోవాలి. ఈ రకమైన ఫౌండేషన్ చర్మం మీద పలుచగా పొరలా ఏర్పడి ఆ తర్వాత వేసుకోబోయే కాంపాక్ట్, బ్లష్‌లకు అనువుగా ఉంటుంది. అయితే ఫౌండేషన్‌ను నేరుగా అప్లై చేసుకోకుండా, మొదట ముఖమంతా అక్కడక్కడా చుక్కలుగా అద్దుకుని, ఆ తర్వాత స్పాంజ్‌తో ముఖమంతా పరుచుకునేలా చేయాలి

తడిపిన స్పాంజ్‌తో: ఫౌండేషన్, కన్‌సీలర్‌ల కోసం తడిపి పిండిన మేకప్ స్పాంజ్ వాడుకోవాలి. ఈ పద్ధతితో మేకప్ ఎక్కువ సమయం పాటు చెక్కుచెదరకుండా ఉంటుంది. మరింత సహజసిద్ధంగా కనిపిస్తుంది. అయితే స్పాంజి తేమగా ఉండాలే తప్ప నీరు కారుతూ ఉండకూడదు. అందుకోసం స్పాంజిబి గోరువెచ్చని నీటి ధార కింద ఉంచి, గట్టిగా పిండేయాలి.ద్రవరూప బ్లష్: బ్లష్‌తో అందం రెట్టింపవుతుంది. అయితే అందుకోసం సరైన రంగులను ఎంచుకోవాలి. ముదురు రంగు బ్లష్‌లు, మరీ మెత్తని పౌడర్ రూపంలో ఉండే బ్లష్‌లు ఎబ్బెట్టుగా కనిపిస్తూ, చర్మపు గీతల్లో ఇరుక్కుపోతాయి. కాబట్టి పౌడర్ బ్లష్‌లకు బదులుగా ద్రవరూప బ్లష్‌లు ఎంచుకోవాలి. వీటిని కూడా తడిపి పిండిన

# తల్లీ... సరిలేరు నీకెవ్వరు!

## నేడు ప్రపంచ మాతృ దినోత్సవం




సృష్టిలో తల్లిని మించిన యోధులు ఎవరూ లేరు. దేవుడి కంటే గొప్పది తల్లి అని, దేవుడు సైతం తల్లి ప్రేమకు దాసుడు అని పండితులు చెప్తారు. అది మనం ఖచ్చితంగా ఒప్పుకోవాల్సిన సత్యం. పుట్టిన ప్రతి ఒక్కరికి తల్లే మొదటి గురువు, మొదటి స్నేహం, మొదటి ప్రేమ. ప్రాణాన్ని సైతం లెక్క చేయకుండా, చావుని కళ్ల ముందే చూపించే పురిటి నొప్పులను భరించి జన్మను ఇచ్చే తల్లికి ఏం ఇచ్చినా రుణం తీర్చుకోలేము. ఆమె త్యాగాన్ని, ప్రేమను, భాధ్యతను గుర్తిస్తూ మాతృదినోత్సవాన్ని ప్రతి సంవత్సరం మే నెల రెండవ ఆదివారం ప్రపంచం అంతా జరుపుకుంటుంది. ఈ మాతృదినోత్సవం రోజున, ఒక గొప్ప తల్లి, త్యాగమూర్తి, విధితో ధైర్యంగా పోరాడుతున్న ఒక యోధురాలిని గుర్తించి తీరాలి. చేతులు ఎత్తి దండం పెట్టి కృతజ్ఞతలు చెప్పాలి. ఉండటానికి ఇల్లు లేదు. బ్రతకడానికి ఆధారం లేదు. ఇంటికి పెద్ద దిక్కు అయిన భర్త తోడు లేడు. భాధ్యత తీసుకోవాల్సిన వయసులో కొడుకు అనారోగ్యం పాలు అయ్యాడు. ఆమె స్తోమత కంటే అవసరమే పెద్దది. అయినా భయ పడకుండా, క్రుంగిపోకుండా మంచంలో ఉన్న కొడుకు పెద్ద వాడు అయినా సరే చంటి బిడ్డలా చూస్తూ నిరంతరం సేవలు చేస్తుంది. తల్లి ప్రేమకు పిల్లల వయసు కనపడదు. ఎంత వయసు ఉన్నా చిన్న పిల్లలు లాగే కనపడతారు అనే దానికి ఈ తల్లే నిదర్శనం. ఇంట్లో విశ్రాంతి తీసుకోవాల్సిన వృద్దాప్యంలో భాధ్యత తీసుకుని కూలి పని చేస్తూ చాలీ చాలని కులీ డబ్బుతో కొడుకుని పోషించుకుంటుంది. మిగిలిన అరకొర డబ్బుతోనే కొడుకుకి మందులు తీసుకుంటుంది. అశ్వారావుపేట, అల్లూరి సీతారామరాజు కాలనీకి చెందిన నిమ్మకాయల రాములమ్మ కొడుకు వెంకటరమణకి కొన్నాళ్ళ క్రితం తలకు బలమైన గాయం అయింది. దాని వల్ల కోమాలోకి వెళ్ళి కొన్ని రోజులకు కోలుకొన్నాడు. కొద్ది కాలం తర్వాత తలకు మరో బలమైన గాయం అయ్యింది. ఆపరేషన్ చేసి తలలో ఉన్న ఎముకని తీసి పొట్టలో పెట్టి కుట్లు వేశారు. దాన్ని తీసి మళ్ళీ తలలో పెడితే కానీ ఆరోగ్యం కొంచం బాగు అవదు. ఆర్థిక ఇబ్బందుల వల్ల బ్రతకడానికే కష్టంగా ఉన్న వాళ్ళు ఆపరేషన్ కి డబ్బు లేక అలాగే ఉండి పోయారు. దాని వల్ల వెంకటరమణ మంచానికే పరిమితం అవవలసి వచ్చింది. ఈ కష్ట సమయంలో అతనికి తండ్రి లేదు. తల్లే ప్రతి రోజు అతనికి సేవలు చేస్తుంది. తన జీవితాన్ని అతని కోసం అంకితం చేసుకున్న రాములమ్మను ఖచ్చితంగా అభినందించాలి. రాములమ్మను చూస్తే మనం పుస్తకాల్లో చదివే త్యాగమూర్తులను నిజ జీవితంలో చూసిన అనుభూతి కలుగుతుంది. రాములమ్మ సరిలేరు నికెవ్వరు. ఇలాంటి తల్లులే భావితరాలకు ఆదర్శం. పిల్లలకు ప్రేరణ కలగడానికి ఇంతకంటే మంచి కథలు ఏవి అవసరం



పడవు. ఈ మాతృదినోత్సవం రోజున తల్లులకు చిన్నపాటి కానుకలు ఇవ్వడం, ఆమె కోసం ప్రత్యేకంగా సమయం కేటాయించడం, ఇంకా ఏవో చేస్తుంటాం. నిజానికి, తల్లి ప్రేమకు వెల కట్టలేము. అంతటి అపూర్వమైన బంధానికి గుర్తింపుగా మాతృదినోత్సవం లాంటి ఒక రోజు ఉండటం తల్లికి ఇచ్చే నిజమైన గౌరవం. మాతృదినోత్సవం రోజు మాత్రమే తల్లిని గుర్తు చేసుకునే వారు ఒక్కసారి ఆలోచన చేయడం అవసరం. పిల్లల కోసం జీవితాన్ని త్యాగం చేసిన తల్లిని గుండెల్లో పెట్టుకుని, తన వృధ్యాప్యంలో తల్లి తండ్రిలా చూసుకోవాలి. అలా చూస్కోవడం ప్రతి ఒక్కరి భాధ్యత. అలా చూడటం వల్ల అయినా తల్లి రుణం కాస్త తీరుతుందేమో. ఆ మహాతల్లి త్యాగానికి, ప్రేమకు మనం ఇచ్చే బాహుమతులు సరిపోవు. ద్వాపర యుగంలో శ్రీ కృష్ణుడికి తులా భారం వేసినట్టు, కలియుగంలోనే కాదు ఏ యుగంలో తులా భారం వేసినా తల్లి ప్రేమకు సరి తూగేది ఏదీ లేదు. అందుకే తల్లి సేవను, త్యాగాన్ని, ప్రేమను గుర్తించాలి. అలాంటి తల్లులెందరో ఈ సమాజంలో పిల్లల కోసం పోరాడుతున్నారు. వారి కథలు వెలుగులోకి రావాలి. గుర్తింపు పొందాలి. తల్లికి దక్కాల్సిన గౌరవం దక్కి తీరాలి. ఆ గౌరవమే దక్కి ఉంటే ఈ రోజు ఇన్ని వృద్ద ఆశ్రమాలు ఉండేవీ కావు.

రామ్ సంకుల - రిసెర్చ్ అనలిస్ట్
అశ్వారావుపేట, సెల్: 9603939033

# మొటిమలు, ముడతల్ని దూరం చేసే చియాసీడ్స్



చియాసీడ్స్.. బరువు తగ్గించడంలో ఇవి కీ రోల్ పోషిస్తాయి. అంతేకాదు, వీటిని వాడడం వల్ల స్కిన్ డీటాక్స్ అవుతాయి. ఈ చియా సీడ్స్‌లో ఎసెన్షియల్ న్యూట్రియెంట్స్, యాంటీ ఆక్సిడెంట్స్, హైడ్రేటింగ్ ప్రాపర్టీస్ గుణాలు ఉన్నాయి. ఇవి చర్మంలోని టాక్సిన్స్‌ని దూరం చేసి స్కిన్ గ్లో అయ్యేలా చేస్తాయి. వీటిని వాడడం వల్ల స్కిన్ ఎలా డీటాక్స్ అయి స్కిన్ హెల్దీగా ఎలా మారుతుందో తెలుసుకోండి.

**ఫ్రీ రాడికల్స్‌తో పోరాడేందుకు**

చియా సీడ్స్‌లో ఎక్కువగా యాంటీ ఆక్సిడెంట్స్ గుణాలు ఉంటాయి. ఇవి స్కిన్‌ని డీటాక్సీఫై చేస్తాయి. ఈ చిన్న గింజల్లో పాలీఫెనాల్స్, ఫ్లేవనాయిడ్స్‌లు ఉంటాయి. ఇవి ఫ్రీ రాడికల్స్ నుంచి చర్మాన్ని కాపాడతాయి. ఇవి స్కిన్ సెల్స్‌ని డ్యామేజ్ కాకుండా, ముందుగానే వచ్చే వృద్ధాప్య లక్షణాలను తగ్గిస్తుంది. పొల్యూషన్, యూవీ కిరణాలు, సరిలేని డైట్ కారణంగా వచ్చే సమస్యల్ని చియా సీడ్స్ దూరం స్కిన్ తాజాగా కనిపించేలా చేస్తుంది. రెగ్యులర్‌గా చియా సీడ్స్‌ని తీసుకుంటే ఆక్సిడేటివ్ స్ట్రెస్ తగ్గి బాడీ నేచురల్‌గా డీటాక్స్ అయ్యేలా చేస్తుంది. దీంతో హెల్దీ, రేడియెంట్ స్కిన్ మీ సొంతమవుతుంది.

**ఇన్‌ఫ్లమేషన్ తగ్గేందుకు**

చియా సీడ్స్‌లో ప్లాంట్ బేస్డ్ ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్ ఉంటాయి. ఇందులో ఆల్ఫా లినోలెనిక్ యాసిడ్ ఉంటుంది. ఇందులోని ఫ్యాటీ యాసిడ్స్, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు ఎరుపుదనం, ఇరిటేషన్, యాక్నే సమస్యల్ని తగ్గిస్తాయి. ఇన్‌ఫ్లమేషన్ కారణంగా స్కిన్ ప్రాబ్లమ్స్, ఎగ్జిమా, సోరియాసిస్, యాక్నే సమస్యలకి కారణమవుతుంది. అయితే, చియాసీడ్స్‌ని డైట్‌లో యాడ్ చేస్తే స్కిన్ సాఫ్ట్ అండ్ స్మూత్‌గా మారుతుంది. చియా సీడ్స్‌లో జింక్ ఉంటుంది. ఇది ఆయిల్ ప్రొడక్షన్‌ని రెగ్యులేట్ చేస్తుంది. దీని వల్ల ఎక్స్‌ట్రా సెబమ్‌ని కంట్రోల్ చేస్తుంది. దీంతో యాక్నే, బ్రేకౌట్స్, స్కార్స్‌ని తగ్గిస్తుంది. ఈ గింజల్లో విటమిన్ ఈ ఎక్కువగా ఉంటుంది. దీని వల్ల స్కిన్‌ని కాపాడుకోవచ్చు. స్కిన్ డ్యామేజ్ కాకుండా ఉంటుంది. దీనిని తీసుకోవడం వల్ల నేచురల్ క్లెన్సర్‌లా పనిచేస్తుంది.

**హైడ్రేట్‌గా ఉండేందుకు**

స్కిన్ హైడ్రేట్‌గా ఉంటే టాక్సిన్స్ ఈజీగా బయటికి వెళ్లిపోతాయి. దీని వల్ల స్కిన్ క్లియర్‌గా మారుతుంది. చియా సీడ్స్‌లో నీటిని అబ్జార్బ్ చేసే గుణం ఉంటుంది. వీటిని నీటిలో వేసి నానబెట్టినప్పుడు అవి జెల్‌లా మారతాయి. వీటిని తీసుకున్నప్పుడు స్కిన్ హైడ్రేషన్‌గా మారుతుంది. స్కిన్ కూడా ప్లంపీగా మారుతుంది. సాఫ్ట్ అండ్ డీటాక్స్ అవుతుంది. దీంతో పాటు చియా సీడ్స్ ఇన్ఫ్యూజ్డ్ స్కిన్ కేర్ ప్రోడక్ట్స్ మాయిశ్చర్‌ని లాక్ చేస్తుంది. దీని వల్ల డ్రైనెస్ తగ్గుతుంది. దీని వల్ల డీహైడ్రేషన్ తగ్గుతుంది. చియా సీడ్స్‌ని తీసుకోవడం వల్ల గట్ హెల్త్ మెరుగ్గా మారుతుంది. ఇందులో డైటరీ ఫైబర్ ఉంటుంది. దీని వల్ల జీర్ణ శక్తి మెరుగ్గా మారుతుంది. దీని వల్ల టాక్సిన్స్ పెరగకుండా ఉంటాయి. జీర్ణసమస్యలు కారణం స్కిన్ ప్రాబ్లమ్స్, యాక్నే, బ్రేకౌట్స్ ప్రాబ్లమ్స్ వస్తాయి. చియా సీడ్స్‌ని తీసుకోవడం వల్ల వ్యర్థాలు, ట్యాక్సిన్స్ బాడీ నుంచి బయటికి పంపుతాయి. దీని వల్ల స్కిన్ క్లియర్‌గా అందంగా మారుతుంది.

**చియా సీడ్స్ ఫేస్‌మాస్క్**

**చియా సీడ్స్ స్కిన్‌కి ఫేస్‌మాస్క్‌లా కూడా వాడొచ్చు. ?**

**కావాల్సిన పదార్థాలు**

**2 టేబుల్ స్పూన్స్ చియా సీడ్స్**

**1 టేబుల్ స్పూన్ తేనె**

**అరకప్పు పెరుగు**

**1 టీస్పూన్ నిమ్మరసం**

**తయారీ విధానం**

చియా సీడ్స్‌ని నీటిలో వేసి 10 నిమిషాల పాటు ఉంచి జెల్లీలా అయ్యేవరకూ ఉంచండి. ఇందులోనే తేనె, పెరుగు, నిమ్మరసం వేసి కలపాలి. దీనిని ముఖానికి రాసి 15 నిమిషాల పాటు ఉంచి తర్వాత క్లీన్ చేయాలి. దీనిని గోరువెచ్చని నీటితో క్లీన్ చేయాలి. దీంతో డెడ్ స్కిన్ సెల్స్ పోతాయి, పోర్స్ క్లీన్ అవుతాయి. స్కిన్ హైడ్రేట్ అవుతాయి. స్కిన్ తాజాగా మారుతుంది. డీటాక్సీఫై అవుతుంది.

**డైట్‌లో ఎలా యాడ్ చేయాలి**

వీటిని డైట్‌లో యాడ్ చేయడం వల్ల స్కిన్ డీటాక్సీఫై అవుతుంది. వీటిని మీ డైట్‌లో యాడ్ చేయడం వల్ల చాలా లాభాలు ఉంటాయి. అదెలా అంటే స్మూతీస్: ఓ టేబుల్ స్పూన్ చియా సీడ్స్‌ని ఫ్రూట్, గ్రీన్ స్మూతీలో యాడ్ చేయొచ్చు. చియా పుడ్డింగ్‌ఈ గింజల్ని బాదం పాలలో రాత్రంతా నానబెట్టాలి. తర్వాత వీటిపై బెర్రీస్, నట్స్ వేసుకుని ఉదయాన్నే తినాలి. వాటర్‌లో ఈ గింజల్ని నీటిలో నానబెట్టి ఆ నీటిలో కొద్దిగా నిమ్మరసం కలిపి తాగొచ్చు. ఈ చియా సీడ్స్‌ని సలాడ్స్, సూప్స్‌లో వేసుకుని తినొచ్చు. వీటిని బేకింగ్‌లో కూడా వాడొచ్చు. మఫిన్స్, గ్రనోలా బార్స్, పాన్ కేక్స్‌లో యాడ్ చేస్తే ఫైబర్, హైడ్రేషన్ అందుతుంది.




## ఈక్విటీ ఫండ్లలోకి తగ్గిన పెట్టుబడులు

**న్యూఢిల్లీ-నవభూమి:** ఈక్విటీ మ్యూచువల్ ఫండ్లలోకి పెట్టుబడులు భారీగా తగ్గాయి. గత నెలలో ఈక్విటీ మ్యూచువల్ ఫండ్లలోకి పెట్టుబడులు ఏడాది ప్రాతిపదికన 3.24 శాతం తగ్గి రూ.24,269 కోట్లకు పరిమితమైనట్లు అసోసియేషన్ ఆఫ్ మ్యూచువల్ ఫండ్స్ ఇన్ ఇండియా(ఆంఫీ) విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. భారత్-పాకిస్థాన్ దేశాల మధ్య ఉద్రిక్తత పరిస్థితులు నెలకొనడంతో మార్కెట్లు తీవ్ర ఒడిదొడుకులకు లోనయ్యాయని, ఫలితంగా మదుపరులు ఈక్విటీ ఎంఎఫ్‌ల్లోకి పెట్టుబడులను తగ్గించుకుంటున్నారు.




వరుసగా నాలుగో నెలలో కూడా పెట్టుబడులు తగ్గుముఖం పట్టడం విశేషం. మరోవైపు, డెబిట్ ఫండ్స్ రూ.2.02 లక్షల కోట్ల నుంచి రూ.2.19 లక్షల కోట్లకు చేరుకున్నాయి. మార్చి చివరినాటికి రూ.65.74 లక్షల కోట్లుగా ఉన్న మ్యూచువల్ ఫండ్ ఇండస్ట్రీ ఆ మరుసటి నెలకి రూ.70 లక్షల కోట్ల మైలురాయిని అధిగమించింది. మ్యూచువల్ ఫండ్ ఇండస్ట్రీ నికర ఏయూఎం విలువ రూ.69,99,837.94 కోట్లుగా నమోదైంది. మార్చి నెల చివరినాటికి ఇది రూ.65,74,287.20 కోట్లుగా ఉన్నది. ఫండ్లలో పెట్టుబడులు పెట్టిన వారు 23,62,95,024గా ఉన్నారు.

## 2 రోజులు.. రూ.7 లక్షల కోట్లు.. భారీగా నష్టపోయిన దేశీయ స్టాక్ మార్కెట్లు



**న్యూఢిల్లీ-నవభూమి:** దేశీయ స్టాక్ మార్కెట్లపై భారత్-పాకిస్థాన్ ఉద్రిక్తతల ప్రభావం స్పష్టంగా కనిపిస్తున్నది. రెండు రోజుల్లో మదుపరుల సంపద రూ.7 లక్షల కోట్లకుపైగా ఆవిరైపోయింది మరి. గురువారం బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 411.97 పాయింట్లు, నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ 140.60 పాయింట్లు పడిపోయిన విషయం తెలిసిందే. ఈ క్రమం లో శుక్రవారం సెన్సెక్స్ 880.34 పాయింట్లు లేదా 1.10 శాతం క్షీణించి 79,454.47 వద్ద ముగిసింది. నిఫ్టీ కూడా 265.80 పాయింట్లు లేదా 1.10 శాతం కోల్పోయి 24,008 వద్ద నిలిచింది. ఫలితంగా గురు, శుక్రవారాల్లో సెన్సెక్స్ 1,292.31 పాయింట్లు, నిఫ్టీ 306.40 పాయింట్లు పతనమైనట్లు తేలింది. దీంతో బీఎస్ఈ నమోదిత సంస్థల మార్కెట్ విలువ రూ.7,09,783.32 కోట్లు తగ్గి రూ.4,16,40,850.46 కోట్లకు (4.86 ట్రిలియన్ డాలర్లు) పరిమితమైంది. గురువారం రూ.5,00,037.74 కోట్లు, శుక్రవారం రూ.2,09,745.58 కోట్లు దిగజారింది.

**మదుపరుల్లో భయం**

అంతర్జాతీయ స్టాక్ మార్కెట్లు నిలకడగా ఉన్నప్పటికీ.. భారతీయ సూచీలు తీవ్ర ఒడిదొడుకులకు లోనవుతున్నాయని, ఇందుకు కారణంగా భారత్-పాక్ సంఘర్షణలేనని మెహెతా ఈక్విటీస్ లిమిటెడ్ రిసెర్చ్ విభాగం సీనియర్ వీపీ ప్రశాంత్ తాప్సే అన్నారు. ప్రస్తుత ఉద్రిక్తకర వాతావరణం మదుపరుల్లో భయాందోళనల్ని రేకెత్తిస్తున్నట్లు చెప్పారు. భౌగోళిక-రాజకీయ ఉద్రిక్తతలు తారస్థాయికి చేరడం.. మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీసిందని బజాజ్ బ్రోకింగ్ రిసెర్చ్ విశ్లేషించింది. భారత్-పాక్ మధ్య ఉద్రిక్తతలు తీవ్రతరం కావడంతో మార్కెట్లు ఒత్తిడిలో ఉన్నాయని రెలిగేర్ బ్రోకింగ్ లిమిటెడ్ రిసెర్చ్ సీనియర్ వీపీ అజిత్ మిశ్రా అభిప్రాయపడ్డారు.

**నీరసించిన రియల్టీ, బ్యాంకింగ్ షేర్లు**

రియల్టీ రంగ షేర్లు గరిష్ఠంగా 2.08 శాతం నష్టపోయాయి. యుటిలిటీస్ (1.50 శాతం), ఫైనాన్షియల్ సర్వీసెస్ (1.40 శాతం), విద్యుత్తు (1.11 శాతం), బ్యాంకింగ్ (1.04 శాతం), ఎఫ్ఎంసీజీ (0.65 శాతం), సర్వీసెస్ (0.63 శాతం) షేర్లూ నిరాశపర్చాయి. సెన్సెక్స్‌లో ఐసీఐసీఐ బ్యాంక్, పవర్ గ్రిడ్, అల్ట్రాటెక్ సిమెంట్, బజాజ్ ఫైనాన్స్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, రిలయన్స్ ఇండస్ట్రీస్, బజాజ్ ఫిన్‌సర్వ్, అదానీ పోర్ట్స్, ఐటీసీ, మహీంద్రా అండ్ మహీంద్రా షేర్లు మదుపరులను ఆకట్టుకోలేకపోయాయి. బీఎస్ఈ స్మాల్‌క్యాప్ సూచీ 0.30 శాతం, మిడ్‌క్యాప్ సూచీ 0.10 శాతం మేర నష్టపోయాయి.

**డిఫెన్స్ స్టాక్స్‌కు డిమాండ్**

భారత్-పాక్ ఉద్రిక్తతల నడుమ దేశీయ స్టాక్ మార్కెట్లలో రక్షణ రంగ, దాని అనుబంధ రంగాల సంస్థల షేర్లకు మదుపరుల నుంచి పెద్ద ఎత్తున ఆదరణ లభిస్తున్నది. రాబోయే రోజుల్లో భద్రతాపరమైన కోణంలో ఎక్కువగా ఖర్చుచేసే వీలుండటంతో అంతా డిఫెన్స్ స్టాక్స్‌ను కొనేందుకు ఆసక్తి చూపుతున్నారు. డ్రోన్ తయారీ కంపెనీల షేర్లకూ డిమాండ్ కనిపిస్తున్నది. శుక్రవారం ట్రేడింగ్‌లో బీఎస్ఈలో ఐడియాఫోర్జ్ టెక్నాలజీ లిమిటెడ్ షేర్ విలువ అత్యధికంగా 20 శాతం పుంజుకోవడం గమనార్హం. ప్రస్తుతం భారత్-పాక్ సంఘర్షణల్లో డ్రోన్ల ప్రయోగం, వాటి పాత్రను చూస్తూనే ఉన్నాం. 'ఇన్వెస్టర్ల నుంచి డిఫెన్స్ స్టాక్స్‌కు బాగా డిమాండ్ వ్యక్తమవుతున్నది. భారత్-పాక్ ఉద్రిక్తతల నేపథ్యమే కారణం' అని మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్, వెల్త్ మేనేజ్‌మెంట్ రిసెర్చ్ హెడ్ సిద్ధార్థ ఖేమ్కా అన్నారు. భారత్ డైనమిక్స్, హిందుస్థాన్ ఏరోనాటిక్స్ షేర్లకూ మార్కెట్‌లో ఒక్కసారిగా ఆదరణ పెరిగిందని రెలిగేర్ బ్రోకింగ్ లిమిటెడ్ రిసెర్చ్ సీనియర్ వీపీ అజిత్ మిశ్రా తెలిపారు.

పెరగనున్న బెంజ్ కార్ల ధరలు జర్మనీకి చెందిన లగ్జరీ కార్ల తయారీ సంస్థ మెర్సిడెజ్ బెంజ్ వచ్చే నాలుగు నెలల్లో అన్ని రకాల మాడళ్ల ధరలను 3 శాతం వరకు సవరించబోతున్నట్లు వెల్లడించింది. ఈ ఏడాది సెప్టెంబర్ నాటికి రెండు దఫాలుగా తమ కార్ల ధరలు రూ.90 వేల నుంచి రూ.12.2 లక్షల వరకు పెంచుతున్నట్లు శుక్రవారం వెల్లడించింది.


## పెరగనున్న బెంజ్ కార్ల ధరలు




**న్యూఢిల్లీ-నవభూమి:** జర్మనీకి చెందిన లగ్జరీ కార్ల తయారీ సంస్థ మెర్సిడెజ్ బెంజ్ వచ్చే నాలుగు నెలల్లో అన్ని రకాల మాడళ్ల ధరలను 3 శాతం వరకు సవరించబోతున్నట్లు వెల్లడించింది. ఈ ఏడాది సెప్టెంబర్ నాటికి రెండు దఫాలుగా తమ కార్ల ధరలు రూ.90 వేల నుంచి రూ.12.2 లక్షల వరకు పెంచుతున్నట్లు శుక్రవారం వెల్లడించింది. ఫారెక్స్ మార్కెట్లో కరెన్సీలు తీవ్ర ఒడిదొడుకులకు లోనుకావడం వల్లనే ధరలు పెంచాల్సి వస్తున్నదని పేర్కొంది. సంస్థ తీసుకున్న తాజా నిర్ణయంలో సీ-క్లాస్ మాడల్ రూ.90 వేల వరకు, బెంజ్ మేబ్యాక్ ఎస్ 680 మాడల్ రూ.12.2 లక్షల వరకు ప్రియంకానున్నట్లు కంపెనీ ఎండీ, సీఈవో సంతోష్ ఐయర్ తెలిపారు.

జూన్ 1న తమ వాహన ధరలను 1-2 శాతం వరకు పెంచుతున్న సంస్థ.. సెప్టెంబర్ 1 నుంచి 1.5 శాతం వరకు సవరిస్తున్నది. గడిచిన నాలుగు నెలల్లో రూపాయి కరెన్సీ భారీగా పడిపోయిందని, ముఖ్యంగా యూరోతో పోలిస్తే 10 శాతం తగ్గడం వల్ల సంస్థపై పడుతున్న అదనపు భారాన్ని తగ్గించుకోవడంలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. మరోవైపు, ఇప్పటికే ఆడీ ఇండియా, బీఎండబ్ల్యూ సంస్థలు కూడా తమ వాహన ధరలను 3 శాతం వరకు పెంచుతున్నట్లు ప్రకటించాయి.


## 'ముందుంది మొసళ్ల పండగ'.. ట్రంప్ వల్లే ఇదంతా.. ఫెడ్ ఛైర్మన్ షాకింగ్ కామెంట్స్!



**న్యూఢిల్లీ-నవభూమి:**అమెరికా ఆర్థిక వ్యవస్థకు ముందుంది ముళ్ల బాట! అమెరికా ఫెడరల్ రిజర్వ్ ఛైర్మన్ జెరోమ్ పావెల్ చేసిన ఈ వ్యాఖ్యలు ఇన్వెస్టర్లను కలవరపెడుతున్నాయి. మే 7న జరిగిన ఫెడ్ పాలసీ నిర్ణయంలో ఊహించని మార్పులు లేనప్పటికీ, పావెల్ ఇన్వెస్టర్లకు స్పష్టమైన హెచ్చరికలు జారీ చేశారు. ప్రపంచంలోని అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ అయిన అమెరికాలో వృద్ధి-ద్రవ్యోల్బణం డైనమిక్స్ అస్పష్టంగా కనిపిస్తున్నాయని, ఇంకా ఘోరమైన పరిస్థితులు ఎదురుకావచ్చని ఆయన అన్నారు. ఫెడరల్ ఓపెన్ మార్కెట్ కమిటీ కీలక బెంచ్‌మార్క్ వడ్డీ రేట్లను 4.25-4.50 శాతం వద్ద స్థిరంగా ఉంచాలని నిర్ణయించింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దూకుడు సుంకాల విధానం నుంచి పెరుగుతున్న ప్రమాదాలను గుర్తించింది. వరుసగా నాలుగోసారి వడ్డీ రేట్లను స్థిరంగా ఉంచిన ఫెడ్ ఛైర్మన్.. ట్రంప్ సుంకాల నేపథ్యంలో నెలకొన్న అనిశ్చితి కారణంగా రేట్ల తగ్గింపు ఇప్పట్లో ఉండకపోవచ్చని సూచించారు. పావెల్ ఏం చెప్పారో ఇప్పుడు చూద్దాం.అమెరికా ఆర్థిక వ్యవస్థ రాబోయే రోజుల్లో తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయే ప్రమాదం ఉందని జెరోమ్ పావెల్ హెచ్చరించారు. %ఖీూవీజ% సమావేశం అనంతరం ఆయన చేసిన వ్యాఖ్యలు ఇన్వెస్టర్లలో కలకలం రేపుతున్నాయి. అమెరికా ఆర్థిక వ్యవస్థపై నెలకొన్న అనిశ్చితి, ద్రవ్యోల్బణం పెరుగుదల, ట్రంప్ సుంకాల ప్రభావం వంటి అంశాలు రాబోయే రోజుల్లో తీవ్ర పరిణామాలకు దారితీయొచ్చని పావెల్ హెచ్చరించారు.

వరుసగా నాలుగోసారి వడ్డీ రేట్లను స్థిరంగా ఉంచిన ఫెడ్, ఆర్థిక వ్యవస్థలో నెలకొన్న అనిశ్చితిని తీవ్రంగా పరిగణిస్తోంది. రాబోయే నెలల్లో అమెరికా ఆర్థిక వ్యవస్థ మరింత దిగజారే అవకాశం ఉందని పావెల్ అన్నారు. 2025 మొదటి త్రైమాసికంలోనే అమెరికా 0.3 శాతం క్షీణించడం ఆందోళన కలిగిస్తోంది. ద్రవ్యోల్బణం అదుపులోకి రాకపోవడం ఫెడ్‌కు పెద్ద సవాలుగా మారింది. 2022 మధ్యలో ఉన్న స్థాయి నుంచి ద్రవ్యోల్బణం కొంత తగ్గినప్పటికీ, అది ఇంకా ఫెడ్ లక్ష్యం కంటే ఎక్కువగా ఉంది. దీనివల్ల వడ్డీ రేట్లు తగ్గించడంలో మరింత ఆలస్యం జరిగే అవకాశం ఉంది. ఉద్యోగాలు బాగానే ఉన్నప్పటికీ, ద్రవ్యోల్బణం పెరుగుతుండడం ఫెడ్‌ను ఇబ్బందుల్లోకి నెట్టేస్తోంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన సుంకాలు కూడా ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం ఉంది. ఈ సుంకాలు వాణిజ్య యుద్ధానికి దారితీసి, ఆర్థిక వృద్ధిని దెబ్బతీసే అవకాశం ఉంది. ఈ ప్రభావాలను తగ్గించడానికి ఫెడ్ వడ్డీ రేట్లను తగ్గించే అవకాశం లేదు. ఇక్కడ చాలా కాలంగా ట్రంప్, పావెల్ ఒకరినొకరు బహిరంగంగానే విమర్శలు గుప్పించుకుంటున్నారు. వడ్డీ రేట్లను జీరో స్థాయికి చేర్చాలని ట్రంప్ ఒత్తిడి చేస్తుండగా.. ఫెడ్ బాస్ మాత్రం అందుకు ససేమిరా అంటున్నారు. ద్రవ్యోల్బణం అదుపులో లేదని కారణం చెబుతూ వస్తున్నారు. ఈ పరిస్థితుల నేపథ్యంలో, అమెరికా ఆర్థిక వ్యవస్థపై ప్రజలు, వ్యాపారాలు ఆందోళన చెందుతున్నాయి. ఇది ఖర్చులను తగ్గించడానికి, పెట్టుబడులను నిలిపివేయడానికి దారితీస్తోంది. రాబోయే రోజుల్లో అమెరికా ఆర్థిక వ్యవస్థ మరింత దిగజారే ప్రమాదం ఉందని పావెల్ హెచ్చరించడంతో, ఇన్వెస్టర్లు అప్రమత్తంగా ఉండాలని ఆర్థిక నిపుణులు సూచిస్తున్నారు. ఫెడ్ ముఖ్య ఉద్దేశ్యం.. ద్రవ్యోల్బణాన్ని నియంత్రించడం, ఉద్యోగాలను పెంచడం. ఈ లక్ష్యాలను సాధించడానికి ఫెడ్ కఠిన నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది. ఫెడ్ నిర్ణయాలు స్టాక్ మార్కెట్, వడ్డీ రేట్లు, ఆర్థిక వృద్ధిని ప్రభావితం చేస్తాయి. కాబట్టి, ఇన్వెస్టర్లు, సాధారణ ప్రజలు ఆర్థిక

## ఈ 5 'ఆర్థిక' సూత్రాలతో.. భవిష్యత్తు సుసంపన్నం



**న్యూఢిల్లీ-నవభూమి:** జీవితంలో ప్రతి ఒక్కరూ నేర్చుకోవాల్సిన కొన్ని ముఖ్యమైన ఆర్థిక పాఠాలు ఉన్నాయి. వీటిని చిన్న వయస్సులోనే తెలుసుకుంటే, ఆర్థికంగా స్థిరమైన, సుసంపన్నమైన భవిష్యత్తును సొంతం చేసుకోవచ్చు. చాలా మంది ఈ విషయాలను ఆలస్యంగా తెలుసుకోవడం వల్ల ఆర్థికంగా అనేక ఇబ్బందులు ఎదుర్కొంటారు. మీరూ అలాంటి పరిస్థితి రాకుండా ఉండాలంటే, ఈ 5 సూత్రాలను మీ జీవితంలో భాగం చేసుకోండి!

**1. ప్రారంభంలోనే పెట్టుబడి పెట్టండి..**

చాలా మంది ప్రారంభంలో చేసే చిన్న పొదుపులు కాలక్రమేణా ఎంత పెద్ద మొత్తానికి చేరుకుంటాయో తక్కువగా అంచనా వేస్తారు. మీరు మ్యూచువల్ ఫండ్‌లు లేదా ప్రావిడెంట్ ఫండ్‌లలో చిన్న మొత్తంలో క్రమం తప్పకుండా పెట్టుబడి పెట్టినా, చక్రవడ్డీ శక్తితో అది గణనీయమైన సంపదగా మారుతుంది. మీరు ఎంత త్వరగా ప్రారంభిస్తే, మీ డబ్బు పెరగడానికి అంత ఎక్కువ సమయం లభిస్తుంది. ఆలస్యం చేస్తే ఈ అద్భుతమైన అవకాశాన్ని కోల్పోతారు.

**2. తెలివిగా రుణాలు తీసుకోండి, క్రెడిట్ బిల్డ్ చేసుకోండి..**

భారతదేశంలో, గృహ రుణాలు, వాహన రుణాలు లేదా క్రెడిట్ కార్డులు పొందడానికి మీ క్రెడిట్ చరిత్ర కీలక పాత్ర పోషిస్తుంది. బలమైన క్రెడిట్ ప్రొఫైల్‌ను నిర్మించడం అంటే బాధ్యతాయుతంగా రుణాలు తీసుకోవడం - సమయానికి చెల్లించడం, అధికంగా రుణాలు తీసుకోకపోవడం, ఈఎంఐలు, వడ్డీని అర్థం చేసుకోవడం. మంచి క్రెడిట్ స్కోరు భవిష్యత్తులో మీ ఆర్థిక అవసరాలకు ఎంతో ముఖ్యం.


**3. ఆస్తులు బాధ్యతలు: సంపదను పెంచేది ఏమిటో తెలుసుకోండి..**

తొందరగా విలువ కోల్పోయే వస్తువులను కొనడం - తాజా గాడ్జెట్‌లు లేదా మీ బడ్జెట్‌కు మించిన కారు వంటివి - మీ ఆర్థిక పరిస్థితిని దెబ్బతీస్తాయి. బదులుగా, స్టాక్స్, రియల్ ఎస్టేట్ లేదా బాగా రూపొందించిన సిప్ పోర్ట్‌ఫోలియో వంటి విలువ పెరిగే లేదా ఆదాయాన్ని ఉత్పత్తి చేసే ఆస్తులపై దృష్టి పెట్టండి. మీ డబ్బు ఎక్కడ పెట్టుబడి పెడుతున్నారో తెలుసుకోవడం ఆర్థిక విజయాన్ని నిర్ధారిస్తుంది.

**4. జీతం దాటి ఆలోచించండి..**

జీతం వచ్చే ఉద్యోగాలు స్థిరంగా ఉన్నప్పటికీ, దీర్ఘకాలిక సంపద తరచుగా ఇతర వ్యాపారాలు, పెట్టుబడులు లేదా వ్యాపారాలలో భాగస్వామ్యం ద్వారా వస్తుంది. నైపుణ్యాలను అభివృద్ధి చేయడం, మార్కెట్‌లోని అవకాశాల్ని గుర్తించడం లేదా ఫ్రీలాన్సింగ్ చేయడం వంటివి అదనపు ఆదాయ వనరులను, ఆర్థిక స్వేచ్ఛను అందిస్తాయి. కేవలం జీతంపై ఆధారపడకుండా ఇతర ఆదాయ మార్గాలను అన్వేషించడం మీ ఆర్థిక భవిష్యత్తును మరింత సురక్షితం చేస్తుంది.

## ఊహించని స్థాయిలో ఉద్యోగాలు ఊస్టింగ్..




**:న్యూఢిల్లీ-నవభూమి:** టెక్ పరిశ్రమలో ఉద్యోగాల కోత 2025లోనూ ఆగడం లేదు. గత ఏడాదిన్నరగా కొనసాగుతున్న ఈ లేఆఫ్‌ల పర్వం ఈ ఏడాది కూడా వేలాది మంది టెకీల జీవితాలను అతలాకుతలం చేస్తోంది. %ఖుఎశీటటం.టఎఱ% ట్రాకర్ విడుదల చేసిన డేటా ప్రకారం, 2024లో ఏకంగా 549 టెక్ కంపెనీలు 1,50,000 మందికి పైగా ఉద్యోగులను తొలగించాయి. 2025లోనూ లేఆఫ్స్ ఆగట్లేదు. 2025 ప్రారంభం నుంచి ఇప్పటివరకు టెక్ రంగంలో 22,000 కంటే ఎక్కువ మంది ఉద్యోగాలు కోల్పోయారు. ముఖ్యంగా ఫిబ్రవరి నెలలో ఈ సంఖ్య ఒక్కసారిగా పెరిగి 16,084కి చేరింది. టెక్‌క్రంచ్ నివేదించిన ఈ నిరంతర ధోరణి, టెక్ రంగంలో పునర్వ్యవస్థీకరణ, ఆటోమేషన్ అండ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగం ప్రభావాన్ని స్పష్టం చేస్తోంది.

**ఉద్యోగాల కోతలు..**

మే నెల ప్రారంభం నుంచే పలు పెద్ద కంపెనీలు ఉద్యోగులను తొలగిస్తున్నాయి. ఖర్చులను తగ్గించడం, లాభదాయకతను పెంచడం లక్ష్యంగా చేపట్టిన విస్తృత పునర్ వ్యవస్థీకరణలో భాగంగా మ్యాచ్ కంపెనీ తన సిబ్బందిలో 13 శాతం మందిని తొలగిస్తోంది. సైబర్ సెక్యూరిటీ దిగ్గజం క్రౌడ్‌స్ట్రైక్ కూడా అధిక రాబడి లక్ష్యాలను చేరుకోవడానికి మరింత కార్యకలాపాల సామర్థ్యాన్ని పెంచుకోవాలనే ఉద్దేశ్యంతో తన ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ఉద్యోగుల్లో 5 శాతం (సుమారు 500 మంది) ఉద్యోగులను తొలగిస్తోంది.

క్లీన్ ఎనర్జీ రంగంలో ఒక పెద్ద ఎదురుదెబ్బ తగిలింది. జెఫ్ బెజోస్ వంటి ప్రముఖ పెట్టుబడిదారుల మద్దతు ఉన్న వాంకోవర్‌కు చెందిన జనరల్ ఫ్యూజన్ తన సిబ్బందిలో 25 శాతం మందిని తొలగించింది. ఇదిలా ఉండగా, ఇజ్రాయెల్‌కు చెందిన సైబర్ సెక్యూరిటీ సంస్థ డీప్ ఇన్‌స్టింక్ట్ తన సిబ్బందిలో 10 శాతం మందిని తొలగించింది. యూకేకు చెందిన క్లైమేట్ టెక్ స్టార్టప్ బీమ్ తన కార్యకలాపాలను పూర్తిగా మూసివేయడంతో దాదాపు 200 మంది ఉద్యోగులు ఉద్యోగాలు కోల్పోయారు. నివేదికల ప్రకారం, ఏప్రిల్ నెల కూడా టెక్ ఉద్యోగులకు కష్టంగానే గడిచింది. ఈ నెలలో 23,400 కంటే ఎక్కువ మంది ఉద్యోగాలు కోల్పోయారు. నెట్‌యాప్ సంస్థాగత పునర్వ్యవస్థీకరణలో భాగంగా 700 మందిని తొలగించగా, ఎలక్ట్రానిక్ ఆర్ట్స్ దాదాపు 400 మంది సిబ్బందిని తొలగించింది. భారతీయ స్టార్టప్‌లు కూడా ఈ ప్రభావం నుంచి తప్పించుకోలేకపోయాయి. కార్స్24, జోపర్ వరుసగా 200, 100 మంది ఉద్యోగులను తొలగించాయి. టెక్ దిగ్గజాలు మెటా, చిప్ తయారీ దిగ్గజం ఇంటెల్ వేలాది మంది ఉద్యోగుల్ని తొలగించే ప్రణాళికల్ని ప్రకటించింది. మరోవైపు, కార్ రెంటల్ స్టార్టప్ ట్యూరో తన విఫలం కావడంతో 150 మందిని తొలగించింది. మైక్రోసాఫ్ట్ కూడా వేల మందిని తొలగించింది. ఈ వరుస ఉద్యోగాల కోతలు టెక్ పరిశ్రమలో నెలకొన్న అనిశ్చితిని, కంపెనీలు తమ వ్యయాలను తగ్గించుకోవడానికిబీ కొత్త సాంకేతికతలకు అనుగుణంగా మారడానికి చేస్తున్న ప్రయత్నాలను తెలియజేస్తున్నాయి.

## క్రెడిట్ కార్డు వాడుతున్నారా? ఈ తప్పులు చేయొద్దు




**న్యూఢిల్లీ-నవభూమి:**క్రెడిట్ కార్డులు వాడటం ఎంత సౌకర్యంగా ఉంటుందో, వాటి నిర్వహణలో చిన్నపాటి అజాగ్రత్త వహించినా క్రెడిట్ స్కోరు పడిపోయే ప్రమాదం ఉంది. ఈ రోజుల్లో రుణాలు పొందాలన్నా, ఇతర ఆర్థిక లావాదేవీలు జరగాలన్నా క్రెడిట్ స్కోరు ఎంతో కీలకం. కాబట్టి, మీ క్రెడిట్ కార్డు వినియోగం మీ స్కోర్‌ను తగ్గించకుండా ఉండాలంటే, కొన్ని సాధారణ తప్పులను ఖచ్చితంగా నివారించాలి.

1. చెల్లింపులు ఆలస్యం చేయడం: క్రెడిట్ కార్డు బిల్లులను ఎల్లప్పుడూ నిర్ణీత గడువులోగా చెల్లించాలి. ఒక్కసారి పేమెంట్ లేట్ అయినా బ్యాంకులు ఆలస్య రుసుములు, అధిక వడ్డీ విధిస్తాయి. అంతేకాకుండా, ఈ విషయాన్ని క్రెడిట్ బ్యూరోలకు నివేదిస్తాయి, ఫలితంగా మీ క్రెడిట్ స్కోరు గణనీయంగా తగ్గుతుంది. దీనికి పరిష్కారంగా, మీ బ్యాంకు ఖాతా నుంచి నేరుగా గడువు తేదీకి ఒక రోజు ముందు బిల్లు చెల్లించే ఏర్పాటు చేసుకోవడం ఉత్తమం.


**2. కనీస మొత్తాన్ని మాత్రమే చెల్లించడం:** క్రెడిట్ కార్డు బిల్లులో కేవలం కనీస మొత్తాన్ని మాత్రమే చెల్లిస్తూ వెళ్లడం మంచి అలవాటు కాదు. ఇలా చేస్తే, మిగిలిన బకాయిపై వడ్డీ పెరుగుతూనే ఉంటుంది, చివరికి మీ అప్పు తీరని స్థాయికి చేరుకుంటుంది. ఇది కూడా మీ క్రెడిట్ స్కోర్‌ను ప్రతికూలంగా ప్రభావితం చేస్తుంది. ప్రతి నెలా మీ పూర్తి బకాయిని చెల్లించడానికి ప్రయత్నించండి. అలా చేయగలనుకున్నప్పుడే క్రెడిట్ కార్డును ఉపయోగించడం మంచిది.

**3. క్రెడిట్ లిమిట్ పూర్తిగా ఉపయోగించడం:** మీ క్రెడిట్ కార్డుకు ఉన్న పరిమితిని పూర్తిగా లేదా ఎక్కువ శాతం ఉపయోగించడం మీ క్రెడిట్ స్కోర్‌కు ప్రమాదకరం. మీ మొత్తం క్రెడిట్ పరిమితిలో 30 శాతానికి మించి ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపయోగించకూడదు. ఉదాహరణకు, మీ కార్డు పరిమితి రూ. లక్ష ఉంటే, మీరు రూ. 30 వేలకు మించి కొనుగోలు చేయకూడదు. అధిక వినియోగం మీరు ఆర్థికంగా ఒత్తిడిలో ఉన్నారని సూచిస్తుంది, ఇది మీ స్కోర్‌ను తగ్గిస్తుంది.

**4. పాత క్రెడిట్ కార్డులను రద్దు చేయడం:** మీరు చాలా కాలంగా ఉపయోగిస్తున్న క్రెడిట్ కార్డులను రద్దు చేయడం మంచిది కాదు. ఇలా చేయడం వల్ల మీ సుదీర్ఘమైన క్రెడిట్ హిస్టరీ తొలగిపోతుంది, ఇది మీ స్కోర్‌పై ప్రతికూల ప్రభావం చూపుతుంది. ఒకవేళ మీరు కార్డులను రద్దు చేయాలనుకుంటే, కొత్తగా తీసుకున్న కార్డులను రద్దు చేయడం ఉత్తమం. పాత కార్డులను ఇనాక్టివ్‌లో ఉంచినా ఫర్వాలేదు.

**5. స్టేట్‌మెంట్‌ను తనిఖీ చేయకపోవడం:** ప్రతి నెలా మీ క్రెడిట్ కార్డు కొనుగోళ్లకు సంబంధించిన స్టేట్‌మెంట్‌ను తప్పకుండా తనిఖీ చేయండి. అందులో ఏమైనా అనధికారిక లావాదేవీలు లేదా తప్పులు ఉంటే వెంటనే బ్యాంకును సంప్రదించండి. అలాగే, మీ క్రెడిట్ రిపోర్టులో కూడా మీ క్రెడిట్ కార్డు చెల్లింపులకు సంబంధించిన వివరాలను క్రమం తప్పకుండా పరిశీలించాలి. ఏమైనా లోపాలు కనిపిస్తే, వెంటనే క్రెడిట్ బ్యూరోలకు తెలియజేయాలి. ఈ జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా మీ క్రెడిట్ స్కోర్‌ను పదిలంగా ఉంచుకోవచ్చు. భవిష్యత్తులో రుణాలు లేదా ఇతర ఆర్థిక అవసరాల కోసం సులభంగా అర్హత సాధించవచ్చు.

## ఇండియాతో ఉద్రిక్తత..దారుణంగా పాకిస్తాన్ పరిస్థితి, కేజీ ఉల్లి రూ.300



**న్యూఢిల్లీ-నవభూమి:**:భారత్, పాకిస్తాన్ దేశాల మధ్య ఉద్రిక్త వాతావరణం క్రమంగా పెరుగుతోంది. ఈ క్రమంలో ఇరు దేశాలు కూడా దాడులకు ప్రతి దాడులు చేస్తున్నాయి. ఈ క్రమంలో భారత ఆర్థిక పరిస్థితి బలంగా ఉండగా, పాకిస్తాన్ ఆర్థిక పరిస్థితి మాత్రం దారుణంగా పడిపోయింది. ఎంతలా అంటే ప్రస్తుతం పాకిస్తాన్‌లో ఇంధన కొరత భారీగా పెరిగింది. దీంతో ఇస్లామాబాద్‌లో 48 గంటల పాటు పెట్రోల్ బంకులకు బంద్ ప్రకటించారు. పెట్రోల్ ధరలు లీటర్‌కు 279.80 రూపాయలు ఉండగా, డీజిల్ 262 రూపాయలకు చేరుకుంది, అయినప్పటికీ కూడా లభించడం లేదు.మరోవైపు రోజువారీ అవసరమైన వస్తువుల ధరలు కూడా పైపైకి చేరుకున్నాయి. ఈ నేపథ్యంలో ఉల్లిపాయలు కిలోకు 330 రూపాయలకు చేరుకోగా, నిమ్మకాయలు 900 రూపాయలకు చేరుకున్నాయి. ఈ క్రమంలోనే కిలో చికెన్ ధర రూ.600కు చేరింది. డజన్ కోడి గుడ్ల రేటు మన దగ్గర రూ.70 ఉండగా, అక్కడ మాత్రం రూ.300కు చేరుకుంది. దీంతోపాటు పప్పులు, ఇతర ఉత్పత్తుల ధరలు కూడా పెద్ద ఎత్తున పెరిగిపోయాయి. ఈ ధరల పెరుగుదల అక్కడి ప్రజల జీవన వ్యయాన్ని భారీగా పెంచేసింది.సింధు జలాల ఒప్పందం బ్రేక్ తర్వాత పాకిస్తాన్ వ్యవసాయం, జలవిద్యుత్ ఉత్పత్తి భారీగా పడిపోయింది. ఈ క్రమంలో వ్యవసాయ ఉత్పత్తి తగ్గి, ఆహార కొరత, ధరల పెరుగుదల తప్పనిసరిగా మారింది. ఈ చర్య వల్ల పాకిస్తాన్‌లో నీటి కొరత, వ్యవసాయ సమస్యలు పెరిగిపోయి ఆర్థిక వ్యవస్థ బలహీనత మరింత తీవ్రమైంది. ఇరు దేశాల మధ్య ఉన్న అట్టారీ - వాఘా సరిహద్దు ద్వారా 2023-24లో %వి%470 మిలియన్ల వస్తువుల వాణిజ్యాన్ని నిర్వహించారు. కానీ ఇప్పుడు దీనిని భారత్ ఆపేసింది. ఈ నిషేధం వల్ల ఔషధాలు, పండ్లు, కూరగాయలు, ఇతర అవసరమైన వస్తువుల కొరత మరింత పెరిగింది. ఇది కూడా ధరలను మరింత పెంచేలా చేసింది.

ఆహార ధరల పెరుగుదల, ఔషధ కొరత వల్ల ఆసుపత్రులు శస్త్రచికిత్సలను వాయిదా వేస్తున్నాయి. ఈ ఆర్థిక కష్టాలు అనేక మంది పాకిస్తానీలు అక్రమ ప్రయాణాల ద్వారా దేశాన్ని విడిచిపెట్టేలా చేస్తున్నాయి. వస్తువుల కొరత, నిరుద్యోగం, ద్రవ్యోల్బణం ముప్పు ఈ అస్తవ్యస్థ దేశాన్ని మరింత గందరగోళంలోకి నెట్టుతున్నాయి. ఈ క్రమంలో భారత్‌తో సంబంధాలు ఇలాగే కొనసాగితే మాత్రం ఆర్థిక నష్టాలు మరింత పెరిగి దేశం నుంచి అనేక మంది వలస వెళ్లే ఛాన్స్ ఉందని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు.

## పసిడి ప్రియులకు గుడ్‌న్యూస్.. తగ్గిన బంగారం ధరలు




**న్యూఢిల్లీ-నవభూమి:**భారత్, పాకిస్తాన్‌ల మధ్య యుద్ధం జరుగుతోంది. పోటాపోటీగా రెండు దేశాలు బాంబుల వర్షం కురిపించుకుంటున్నాయి. యుద్ధ ప్రభావం ఇప్పటికైతే సరిహద్దు ప్రాంతాలకు మాత్రమే పరిమితం అయింది. లోపల ఉన్న ప్రజలు కొంచెం టెన్షన్‌లో ఉన్నా.. వివాహాది ఇతర కార్యక్రమాలు జరుగుతూనే ఉన్నాయి. పెళ్లిళ్లలకు ఇతర ఫంక్షన్‌లకు బంగారం కొనాలనుకునే వారికి ఇది గుడ్‌న్యూస్ అని చెప్పొచ్చు. గత కొద్ది రోజుల నుంచి పెరుగుతూ పోయిన బంగారం ఇప్పుడు తగ్గింది. పసిడి ప్రియులకు ఊరటనిస్తోంది.

**ఈ రోజు బంగారం ధరలు ఇలా..**

నిన్న 10 గ్రాముల స్వచ్ఛమైన 24 క్యారెట్ల బంగారం ధర 98350 దగ్గర ట్రేడ్ అయింది. 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర 90150 దగ్గర ట్రేడ్ అయింది. ఇక, 10 గ్రాముల 18 క్యారెట్ల ధర 73760 దగ్గర ట్రేడ్ అయింది. ఇక, ఈ రోజు 18,22,24 క్యారెట్ల బంగారంపై 10 రూపాయలు తగ్గింది. 10 గ్రాముల స్వచ్ఛమైన 24 క్యారెట్ల బంగారం ధర ఈ రోజు 98340 దగ్గర ట్రేడ్ అవుతోంది. 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర 90140 దగ్గర ట్రేడ్ అవుతోంది. ఇక, 10 గ్రాముల 18 క్యారెట్ల ధర 73750 దగ్గర ట్రేడ్ అవుతోంది.

**వెండి ధరలు ఇలా..**

బంగారంతో సంబంధం లేకుండా వెండి ధరలు ప్రతీ రోజూ తగ్గుతూనే ఉన్నాయి. రోజుకు ఎంత లేదన్నా కేజీపై 10 రూపాయలు తగ్గుతోంది. నిన్న 100 గ్రాముల వెండి ధర 11100 రూపాయల దగ్గర ట్రేడ్ అయింది. కేజీ వెండి ధర 1,11,000 దగ్గర ట్రేడ్ అయింది. ఈ రోజు 100 గ్రాములపై 10 రూపాయలు, కేజీపై 100 రూపాయలు తగ్గింది. ఈ రోజు 100 గ్రాముల వెండి ధర 11,090 దగ్గర ట్రేడ్ అవుతోంది. కేజీ బంగారం ధర 1,10,900 దగ్గర ట్రేడ్ అవుతోంది.



## రూ.300 కోట్లతో లక్నోలో బ్రహ్మోస్ ఉత్పత్తి యూనిట్.. నేడు ప్రారంభం



**న్యూఢిల్లీ-నవభూమి:** భారత్, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో బ్రహ్మోస్ ఉత్పత్తి యూనిట్, ఇతర రక్షణ ప్రాజెక్టులు ఆదివారం ప్రారంభం కానున్నాయి. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ ఢిల్లీ నుంచి వర్చువల్‌గా వీటిని ప్రారంభిస్తారు. ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నోలోని డిఫెన్స్ ఇండస్ట్రియల్ కారిడార్‌లో రూ.300 కోట్ల వ్యయంతో సూపర్‌సోనిక్ క్రూయిజ్ క్షిపణి బ్రహ్మోస్ ఉత్పత్తి యూనిట్‌ను నిర్మించారు. రక్షణ మంత్రి రాజ్‌నాథ్, యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ మే 11న ఢిల్లీ నుంచి వర్చువల్‌గా దీనిని ప్రారంభిస్తారు. అలాగే ఏరోస్పేస్, రక్షణ రంగాలకు పదార్థాలను ఉత్పత్తి చేసే టైటానియం, సూపర్ అల్లాయ్స్ మెటీరియల్ ప్లాంట్ (స్ట్రాటజిక్ మెటీరియల్స్ టెక్నాలజీ కాంప్లెక్స్) నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. ఈ కాంప్లెక్స్‌లో డిఫెన్స్ టెస్టింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సిస్టమ్ (డీటీఐఎస్)ను కూడా అభివృద్ధి చేస్తారు.కాగా, 2021 డిసెంబర్‌లో బ్రహ్మోస్ ఏరోస్పేస్ ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వం 80 ఎకరాల భూమిని ఉచితంగా ఇవ్వడమేగాక నిర్మాణ పురోగతిని నిశితంగా పరిశీలించిందని ఉత్తరప్రదేశ్ ఎక్స్‌ప్రెస్‌వేస్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ అథారిటీ సీఈవో శ్రీహరి ప్రతాప్ షాహి తెలిపారు. కేవలం 3.5 సంవత్సరాలలోపు ఈ ప్రాజెక్ట్ పూర్తైందని చెప్పారు. లక్నో నోడ్ ఇతర రక్షణ పరికరాలను కూడా ఉత్పత్తి చేస్తుందని, నగరంతోపాటు రాష్ట్రానికి రక్షణ రంగంలో కొత్త గుర్తింపును ఇస్తుందని అన్నారు. మరోవైపు తమిళనాడు తర్వాత దేశంలో డిఫెన్స్ ఇండస్ట్రియల్ కారిడార్‌ను ఏర్పాటు చేసిన రెండవ రాష్ట్రం ఉత్తరప్రదేశ్.

## భారతదేశపు మొట్టమొదటి హైడ్రోజన్ ట్రక్కు ప్రారంభం



**రాయ్‌పూర్-నవభూమి:** అదానీ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ శనివారం భారతదేశపు మొట్టమొదటి హైడ్రోజన్ ఇంధన సెల్ ట్రక్కును ప్రారంభించింది. దీని ద్వారా కాలుష్య రహిత రవాణాను ప్రోత్సహించవచ్చు. ఈ హైడ్రోజన్-శక్తితో నడిచే ట్రక్కులు కంపెనీ లాజిస్టిక్స్ కార్యకలాపాల్లో ఉపయోగించే డీజిల్ వాహనాలను క్రమంగా భర్తీ చేయనున్నాయి. స్మార్ట్ టెక్నాలజీ, మూడు హైడ్రోజన్ ట్యాంకులతో కూడిన ప్రతి ట్రక్కు 200 కిలోమీటర్ల పరిధిలో 40 టన్నుల వరకు సరుకును తీసుకెళ్లగలదు. ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయి రాయ్‌పూర్‌లో మొదటి ట్రక్కును జెండా ఊపి ప్రారంభించారు. గారే పెల్మా బ్లాక్ నుండి రాష్ట్ర విద్యుత్ ప్లాంట్లకు బొగ్గును రవాణా చేయడానికి ఇది ఉపయోగించబడుతుంది.భారతదేశంలో మొట్టమొదటి హైడ్రోజన్-శక్తితో నడిచే ట్రక్కును ఛత్తీస్‌గఢ్‌లో ప్రారంభించడం రాష్ట్ర స్థిరత్వానికి నిబద్ధతను ప్రతిబింబిస్తుందని సీఎం అన్నారు. ఇటువంటి కార్యక్రమాలు మన కార్బన్ పాదముద్రను గణనీయంగా తగ్గిస్తాయని, పరిశ్రమకు కొత్త ప్రమాణాన్ని నిర్దేశిస్తాయని తెలిపారు. దేశ విద్యుత్ డిమాండ్లను తీర్చడంలో ఛత్తీస్‌గఢ్ ముందంజలో ఉంటుందని కాకుండా స్థిరమైన పద్ధతులను అవలంబించడంలో కూడా ముందుందని ఆయన వెల్లడించారు.ప్రభుత్వ యాజమాన్యంలోని ఛత్తీస్‌గఢ్ స్టేట్ పవర్ జనరేషన్ కంపెనీ లిమిటెడ్, గారే పెల్మా బ్లాక్‌కు గని డెవలపర్, ఆపరేటర్‌గా అదానీ ఎంటర్‌ప్రైజెస్‌ను పోటీ బిడ్డింగ్ ప్రక్రియ ద్వారా నియమించింది. ఈ ప్రాజెక్ట్ అదానీ నేచురల్ రిసోర్సెస్ ఆదేశిదంగా అదానీ ఎంటర్‌ప్రైజెస్‌లో భాగమైన అదానీ న్యూ ఇండస్ట్రీస్ లిమిటెడ్ మధ్య ఉమ్మడి ప్రయత్నం. హైడ్రోజన్-శక్తితో నడిచే ట్రక్కు కోసం ఈ చొరవ అదానీ గ్రూప్ డీకార్బనైజేషన్, బాధ్యతాయుతమైన మైనింగ్ పట్ల నిబద్ధతకు ఒక ముఖ్యమైన అడుగు అని అదానీ ఎంటర్‌ప్రైజెస్ సీఈఓ డాక్టర్ వినయ్ ప్రకాశ్ అన్నారు. స్థిరమైన మైనింగ్ పద్ధతుల్లో కొత్త ప్రమాణాలకు మార్గదర్శకత్వం వహిస్తూనే అందరికీ సరసమైన, నమ్మదగిన విద్యుత్‌ను నిర్ధారించడం తమ లక్ష్యం అని ఆయన పేర్కొన్నారు.

## టీవీ ప్రసారాల్లో సైరన్లు వాడొద్దు.. కేంద్రం ఆదేశాలు



**న్యూఢిల్లీ-నవభూమి:** ఆపరేషన్ సిందూర్ తర్వాత భారత్ పాకిస్తాన్ మధ్య తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో సరిహద్దు గ్రామాల ప్రజలను అప్రమత్తం చేసేందుకు భారత సైన్యం సైరన్లు మోగిస్తున్న సంగతి తెలిసిందే. అయితే పౌరులను అప్రమత్తం చేసేందుకు వినియోగించే సైరన్‌లను వార్తా ప్రసారాల్లో ఉపయోగించొద్దని మీడియా చానెల్స్‌కు కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. కేవలం మాక్ డ్రిల్‌ల సమయంలో మాత్రమే ప్రజలకు అవగాహన కల్పించడం కోసం సైరన్లు మోగించాలని ఆదేశించింది.టీవీ ప్రసారాల్లో తరచుగా సైరన్లు మోగించడం వల్ల ప్రజల్లో గందరగోళం నెలకొంటుందని కేంద్రం పేర్కొంది. దీంతో వాస్తవంగా అత్యవసర సమయాల్లో సైరన్లు మోగించినప్పుడు ప్రజలు వీటిని తేలికగా తీసుకునే ప్రమాదం ఉందని తెలిపింది. ఇందుకు సంబంధించిన ఆదేశాలను కేంద్ర హోం శాఖ ఆధ్వర్యంలోని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ఫైర్ సర్వీస్, సివిల్ డిఫెన్స్ అండ్ హోమ్ గార్డ్స్ విభాగాలు ఆదేశాలు జారీ చేశాయి.

## భారత ట్రావెల్ సంస్థలు కీలక నిర్ణయం.. టర్కీ, అజర్‌బైజాన్‌కు టూర్ ప్యాకేజీలు నిలిపివేత



**న్యూఢిల్లీ-నవభూమి:** సరిహద్దుల్లో పాకిస్థాన్ దాడులకు 'ఆపరేషన్ సిందూర్' పేరుతో భారత్ ధీటుగా సమాధానం ఇస్తున్నది. అయితే పాకిస్థాన్‌కు మద్దతిచ్చిన టర్కీ, అజర్‌బైజాన్‌పై దేశంలో వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. ఈ నేపథ్యంలో భారత ట్రావెల్ సంస్థలు కీలక నిర్ణయం తీసుకున్నాయి. పాకిస్థాన్‌పై భారత్ చర్యలను వ్యతిరేకించిన ఈ రెండు దేశాలకు టూర్ ప్యాకేజీలను నిలిపివేస్తున్నట్లు ప్రకటించాయి. టర్కీ, అజర్‌బైజాన్‌కు బుకింగ్‌లను పూర్తిగా నిలిపివేస్తున్నట్లు ఈజ్‌మైట్రిప్, కాక్స్ అండ్ కింగ్స్, ట్రావోమింట్ ప్రకటించాయి. జాతీయ సెంటిమెంట్‌తోపాటు భద్రత, దౌత్యపరమైన ఇబ్బందుల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నాయి.కాగా, ఇటీవలి పరిణామాల దృష్ట్యా అజర్‌బైజాన్, ఉజ్బెకిస్థాన్, టర్కీకి అన్ని కొత్త టూర్ ఆఫర్‌లను నిలిపివేయాలని నిర్ణయించినట్లు కాక్స్ అండ్ కింగ్స్ డైరెక్టర్ కరణ్ అగర్వాల్ తెలిపారు. దేశ ప్రజల మనోభావాలు తమకు చాలా ముఖ్యమని చెప్పారు. ఈ అనిశ్చిత కాలంలో ప్రయాణికుల భద్రత తమకు చాలా ముఖ్యమని ఈజ్‌మైట్రిప్ వ్యవస్థాపకుడు, ఛైర్మన్ నిశాంత్ పిట్టి అన్నారు. టర్కీ, అజర్‌బైజాన్‌ను బహిష్కరించాలన్న భారతీయుల పిలుపు మేరకు ఆ రెండు దేశాలకు టూర్ ప్యాకేజీలను నిలిపివేసినట్లు ట్రావోమింట్ సీఈఓ అలోక్ కె సింగ్ వెల్లడించారు.

## ఇకపై ఏ ఉగ్రచర్య జరిగినా మాపై యుద్ధంగానే పరిగణిస్తాం.. భారత్ స్ట్రాంగ్ వార్నింగ్

**న్యూఢిల్లీ-నవభూమి:** భారత్-పాకిస్థాన్ దేశాల మధ్య తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో భారత్ ఉగ్రవాదులకు, ఉగ్రవాదులకు మద్దతు పలుకుతున్న వారికి స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చిందని కేంద్ర ప్రభుత్వంలోని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఇక నుంచి దేశంలో ఎలాంటి ఉగ్రవాద దాడి జరిగినా దానిని భారత్‌పై యుద్ధంగానే పరిగణిస్తామని, అందుకు ధీటుగా బదులిస్తామని స్పష్టం చేసిందని వెల్లడించాయి.గత నెల 22న జరిగిన పహల్గాం ఉగ్రదాడి యావత్ భారతదేశాన్ని ఉలిక్కిపడేలా చేసింది. ఆ దాడిలో ఉగ్రవాదులు ఏకంగా 26 మంది పర్యాటకులను కాల్చిచంపడాన్ని ప్రపంచ దేశాలు ఖండించాయి. ఈ దాడికి పాల్పడింది పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాదులేనని తేలడంతో భారత్ రగిలిపోయింది. పాకిస్థాన్‌లోని ఉగ్రస్థావరాలపై సర్జికల్స్ స్ట్రైక్స్ చేస్తోంది. అందుకు ప్రతిగా పాకిస్థాన్ సరిహద్దుల్లో కాల్పులు జరుపుతూ కవ్వింపులకు పాల్పడుతోంది.

# ఆపరేషన్ సిందూర్‌లో హతమైన ఉగ్రవాదుల వివరాలు



**శ్రీనగర్--నవభూమి:** పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతీకారంగా మే 7 తెల్లవారుజామున 1.05 నుంచి 1.30 గంటల మధ్య భారత సైన్యం.. పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రవాద స్థావరాలపై మెరుపు దాడులు చేసింది. ఆపరేషన్ సిందూర్ పేరుతో లష్కరే తొయిబా, జైషే మహమ్మద్, హిజ్బుల్ ముజాయిద్దీన్ ఉగ్రవాద శిబిర్లిలపై విరుచుకుపడింది. దీంతో జైషే మహమ్మద్ ఉగ్రవాద సంస్త వ్యవస్థాపకుడు మౌలానా మసూద్ అజార్ సోదరి, బావమరుదులు, మేనల్లుడు సహా పది మంది కుటుంబసభ్యులు, మరో నలుగురు ముఖ్య అనుచరులు హతమయ్యారు. తాజాగా, ఆపరేషన్ సిందూర్‌లో హతమైన లష్కరే, జైషే కీలక నేతల వివరాలు వెలుగులోకి వచ్చాయి.

ఐదుగురు పాక్ ఉగ్రవాదుల్లో జైషే మహమ్మద్ ఉగ్రవాద సంస్త చీఫ్ మసూద్ అజార్ బావమరుదులు ఇద్దరు.(పెద్ద బావమరింది హాఫీజ్ మహ్మద్ జమీల్, ఇంకో బావరమరిది మహ్మద్ యూసఫ్ అజార్), ముదాస్సర్ ఖదాయిస్ ఖాస్‌తో (లష్కరే తొయిబా) ఖలీద్, మహ్మద్ హసన్ ఖాన్ ఉన్నట్టు నిఘా వర్గాలకు సమాచారం అందింది. వీరికి పాక్ సైన్యం అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించింది. అంతేకాదు, ముదస్సర్ ఖదాయిస్ అంత్యక్రియలకు పాక్ ఆర్మీ చీఫ్ జనరల్ అసిం మునీర్, పాకిస్థాన్‌లోని పంజాబ్ ముఖ్యమంత్రి, మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్ కుమార్తె మరియమ్ హాజరుకావడం గమనార్హం.

ఇందుకు సంబంధించిన ఫోటోలు వైరల్ కావడంతో పాక్ సైన్యం, ఉగ్రవాదుల మధ్య ఉన్న బంధాన్ని మరోసారి భారత్ ప్రపంచం ముందు ఉంచింది. ఈ ఫోటోలను భారత్ అంతర్జాతీయ వేదికలపై ఉగ్రవాదానికి పాకిస్థాన్ మద్దతు ఇస్తుందనే నిర్ధారణగా చూపిస్తోంది.

**ముదస్సర్ ఖద్యాన్ ఖాస్**

ఖాస్, అలియాస్ అబూ జుండాల్, లష్కరే తొయిబాకు చెందిన ఇతడు పాకిస్థాన్‌లోని మురీద్కే ప్రాంతంలో ఉన్న మార్కజ్ తోయిబా శిబిరానికి నాయకత్వం వహించేవాడు. ఇది భారత సరిహద్దుకు కేవలం 25 కిలోమీటర్ల దూరంలో ఉంది.

2008 ముంబయి దాడుల్లో ప్రాణాలతో పట్టుబడిన ఉగ్రవాది అజ్మల్ కసబ్ కూడా ఈ శిబిరంలో శిక్షణ పొందినట్లు ఒప్పుకున్నాడు. మరో ఉగ్రవాది డేవిడ్ హెడ్లీ కూడా ఇక్కడే శిక్షణ పొందినట్టు సమాచారం.ఖాస్ అంత్యక్రియల్లో పాక్ సైన్యం గౌరవ వందనం సమర్పించింది. సైన్యాధిపతి జనరల్ ఆసిం మునీర్, పంజాబ్ ముఖ్యమంత్రి మేరియమ్ నవాజ్ తరఫున పుష్పగుచ్ఛాలు సమర్పించారు. అంత్యక్రియల్లో పాక్ సైన్యంలో లెఫ్టినెంట్ జనరల్ హోదాలో ఉన్న అధికారి, పంజాబ్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ జనరల్ హాజరయ్యారు.

**హాఫీజ్ మహ్మద్ జమీల్**

జమీల్ జైషే మహమ్మద్‌కు చెందిన ఉగ్రవాది. జైషే వ్యవస్థాపకుడు మౌలానా మసూద్ అజహర్ బావమరిది. బహావల్‌పూర్‌లోని మార్కజ్ సుబ్హాన్ అల్లా శిబిరానికి నాయకత్వం వహించేవాడు. ఈ శిబిరంలో ఉగ్రవాదులకు ధార్మిక మత్తు కలిగిస్తూ, నిధులు సేకరించేవాడు. మే 7 దాడిలో అజహర్ కుటుంబానికి చెందిన పదిమంది, ఇతడి నలుగురు సన్నిహితులు హతమయ్యారని వర్గాల సమాచారం.

**మహ్మద్ యూసఫ్ అజహర్**

అలియాస్ ఉస్తాద్ జీ, మహ్మద్ సలీమ్.ఇతను కూడా మసూద్ అజహర్ బావమరిది. జైషే సంస్థకు ఆయుధ శిక్షణ బాధ్యతల్ని నిర్వహిస్తుండేవాడు. జమ్మూ కశ్మీర్ ప్రాంతంలో అనేక ఉగ్రదాడులకు ఇతడి హస్తం ఉంది.. 1999లో %IC%-814 విమాన హైజాక్ ఘటనలో ఇతడి పాత్ర ఉంది. ఈ సంఘటన కారణంగా భారత్ మసూద్ అజహర్‌ను విడుదల చేయాల్సి వచ్చింది.

**అబూ అఖాషా**

అలియాస్ ఖలీద్ లష్కరే తొయిబాకు చెందిన టాప్ ఉగ్రవాడి ఇతడు అఫ్ఘనిస్థాన్ నుంచి ఆయుధాలు అక్రమంగా భారత దేశంలోకి రప్పించే కార్యకలాపాల్లో కీలక పాత్ర పోషించేవాడు. ఇతడి అంత్యక్రియలు ఫైసలాబాద్‌లో జరిగాయి. వాటికి పాక్ సైనిక ఉన్నతాధికారులు, డిప్యూటీ కమిషనర్ హాజరయ్యారని వర్గాలు తెలిపాయి.

**మహ్మద్ హసన్ ఖాన్**

జైషే సంస్థకు చెందిన ఇతడు కమాండర్ ముఫ్తీ అస్గర్ ఖాన్ కశ్మీరి కుమారుడు. ఇతడు జమ్మూ కశ్మీర్‌లో ఉగ్రదాడుల సమన్వయంలో కీలకంగా వ్యవహరించేవాడు.

ఈ ఐదుగురు మే 7న భారత్ జరిపిన ఆపరేషన్ సిందూర్ మొదటి దశలోనే హతమయ్యారని వర్గాలు తెలిపాయి. ఏప్రిల్ 22న పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడిలో 26 మంది పౌరులు హతమయ్యారు. ఈ దాడులకు ప్రతీకారంగా భారత్ ఈ ఆపరేషన్ ప్రారంభించింది

# పీవోకే భారత్‌లో విలీనం కావాల్సిందే !



**న్యూఢిల్లీ-నవభూమి:** పాక్ ఆక్రమిత కాశ్మీర్ షార్ట్ కట్ లో పీఓకే. అసలు కాశ్మీర్ అన్నది 1947 నాటికి ఒక స్వతంత్ర రాజ్యం. దానిని భయపెట్టి బెదిరించి తమలో కలుపుకోవాలని కొత్తగా ఒక దేశంగా ఆనాడు ఏర్పాటు అయిన పాక్ చేయాల్సింది అంతా చేసింది. అయితే కాశ్మీర్ ని ఏలుతున్న రాజు భారత్ తోనే ఉంటేనే తమకు మనుగడ క్షేమం అనుకుని భారత్ వైపు మొగ్గు చూపాడు. అలా భారత్ లో కాశ్మీర్ చేరడం జరిగింది. అయితే ఇది గిట్టని పాకిస్థాన్ కాశ్మీర్ మీద యుద్ధం చేసి తమలో కలిపేసుకోవాలని చూసింది.ఆ సమయంలో భారత్ తన సైన్యాన్ని కాశ్మీర్ కి పంపించి పాక్ తో యుద్ధం చేసింది. అలా పాక్ ని తరిమికొట్టింది. అయితే అందులో మూడవ వంతు భూభాగాన్ని పాక్ ఆక్రమించుకుని కూర్చుంది. భారత్ లో విలీనం అయిన కాశ్మీర్ వద్ద రెండు వంతులు భూభాగం ఉంది.ఇది జరిగి దాదాపు ఎనభై ఏళ్ళు గడుస్తున్నా పాక్ ఆక్రమిత కాశ్మీర్ ని మాత్రం భారత్ తిరిగి తెచ్చుకో లేకపోతోంది. ఆ లోటు అలాగే ఉంది.


ఈ మధ్యలో 1965లో పాక్ తో భారత్ జరిగిపిన యుద్ధంతో భారత్ గెలిచింది. అయినా ఆక్రమిత కాశ్మీర్ ని తెచ్చుకోలేదు. 1971లో అయింతే పాక్ భూభాగం మీదనే వెళ్ళి లాహోర్ దాకా భారత్ సైనికులు కదం తొక్కి పాక్ కి శృంగభంగం చేశారు. అయినా ఈసారి కూడా పాక్ ఆక్రమిత కాశ్మీర్ ని వెనక్కి తెచ్చి కలుపుకోలేదు. 1999లో కార్గిల్ యుద్ధం లో భారత్ విజేతగా నిలిచినా పీఓకే అన్న ఇష్యూ రాకుండానే ముగిసింది.ఇక ఇపుడు చూస్తే అన్ని విధాలుగా భారత్ కి అనుకూలత ఉంది. ప్రపంచంలోని కొన్ని అగ్ర రాజ్యాలు భారత్ పాక్ యుద్ధం మీద సన్నాయి నొక్కులు నొక్కవచ్చు. మరికొన్ని దేశాలు ముఖం మీద నవ్వు తెర వెనక విషం చిమ్మవచ్చు. ఎవరు ఏమి చేసినా ఇది భారత్ సార్వభౌమాధికారానికి సంబంధించిన సమస్య. అందువల్ల భారత్ ఈ యుద్ధంలో సాధించాల్సింది ఏంటి అంటే పీఓకేని వెనక్కి తెచ్చుకుని భారత్ లో కలుపుకోవడం అని అంతా అంటున్నారు.ఇది ఏకంగా 146 కోట్ల మంది భారతీయుల కోరిక. ఇది భారత్ ప్రతిష్టను పెంచే అంశం. ఇది ఉగ్రవాదానికి శాశ్వతంగా ముకుతాడు వేసే విషయం కూడా. తనది కాని ఆస్తిని ఎవరికో రాసి ఇచ్చినట్లుగా పాక్ ఆక్రమిత కాశ్మీర్ లో చైనాకు కొంత భూభాగం ఇచ్చింది. అలా చైనా తన దేశం నుంచి పీవోకే దాకా రోడ్లు వేసింది. పీవోకేను స్వాధీనం చేసుకుని చైనా వైపు ఉండే రోడ్లను మూసివేసి మిగిలిన దానిని మొత్తం భారత్ వాడుకోవాలి. అక్కడ కొండ ప్రాంతం ఎక్కువ కాబట్టి జనాభా తక్కువగానే ఉన్నారు. ఇక గత ఏడున్నర దశాబ్దాలుగా వారి మేలు కోసం పాక్ ఏమీ చేసింది లేదు. వారు కనుక భారత్ తో ఉంటామని అంటే కలుపుకోవాలి. లేదా వారు పాక్ లోకి వెళ్తామంటే వారి ఆప్షన్ కే వదిలిపెట్టాలి.అలా సంపూర్ణ కాశ్మీర్ ని సాధించడమే కాకుండా వ్యూహాత్మకంగా భారత్ కి ఎంతో కలసి వచ్చే పీవోకేని స్వాధీనంలో ఉంచుకుని అక్కడ భారత జవాన్లతో కీలక ప్లేస్ లలో పోస్టులు ఏర్పాటు చేయడం ద్వారా ఉగ్రవాదుల పీడను శాశ్వతంగా వదిలించుకోవచ్చు అన్నది మాజీ సైనిక అధికారులు చెబుతున్న మాట. ఇదే మొత్తం దేశం మాటగా ఉంది.ఆ మధ్యన దేశ రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ కూడా పీవోకే స్వాధీనం చేసుకుంటామని చెప్పారు. సో అది ఇపుడు నిజం కాబోతోంది అని అంతా ఆశాభావంతో ఉన్నారు. పాక్ పహల్గాం దాడిని ఉగ్రవాదులతో చేయించిన దానికి ఇది సరైన గుణపాఠంగా కూడా ఉంటుందని అంటున్నారు. పీఓకే స్వాధీనంతో పాక్ కోరలు విరిచినట్లు అవుతుంది అని అంటున్నారు.పీవోకే ఎటూ భారత్ భూభాగం కాబట్టి అంతర్జాతీయ సమాజం కూడా భారత్ ని ఏ విధంగానూ తప్పు పట్టే అవకాశం ఉండదని అంటున్నారు. సో ఆ విధంగా భారత్ విజయకేతనం ఎగురవేయాలని అంతా గట్టిగా కోరుకుంటున్నారు. ఆ రోజు తొందరలోనే వస్తుందని ధీమాగా కూడా భారతీయులు అంతా ఉన్నారు.

# డ్రోన్‌లను విజయవంతంగా నిర్వీరం



**న్యూఢిల్లీ-నవభూమి:** గత రెండు రోజులుగా భారత్ - పాక్ మధ్య ఉద్రిక్తతలు తీవ్రరూపం దాల్చుతున్న సంగతి తెలిసిందే. ఆపరేషన్ సిందూర్ కి ప్రతీకారంగా అంటూ భారత్ పై వందల సంఖ్యలో డ్రోన్లు, క్షిపణులు, యుద్ధ విమానలతో పాకిస్థాన్ సైన్యం విరుచుకుపడుతుంది. అయితే... ఆ ప్రయత్నాలు అన్నింటినీ భారత గగనతల రక్షణ వ్యవస్థ విజయవంతంగా నాశనం చేస్తోంది. ఇలా పాక్ ప్రయత్నాలను తిప్పికొడుతూనే.. పాక్ కు చేయాల్సిన డ్యామేజ్ చేసుకుంటూ వస్తోంది. ఇందులో భాగంగా... తాజాగా పాక్ లోని మూడు ప్రధాన వైమానిక స్థావరాలపై భారత్ దాడులు చేసింది. పాక్ సైన్యం హెడ్ క్వార్టర్స్ ఉన్న రావల్పిండి చక్లాలలోని నూర్ ఖాన్.. చక్వాల్ లోని మురీద్, జాంగ్ జిల్లా షోర్కోట్ లో ఉన్న రఫీ వైమానిక స్థావరాల్లో పేలుళ్లు జరిగాయి! ఇలా పాక్ దుస్సాహసాన్ని తిప్పికొడుతోంది. ఆ డ్రోన్ లను విజయవంతంగా నిర్వీరం చేసింది. మరోవైపు పఠాంకోట్, జైసల్మేర్, ఉధంపూర్, అఖ్నూర్, నగ్రోటా ప్రాంతాలపైకి వచ్చిన 50 పాక్ డ్రోన్లను నిర్వీర్యం చేసింది. ఈ సమయంలో ఇండియన్ ఆర్మీ ఓ ఆసక్తికర వీడియో పోస్ట్ చేసింది. పాక్ ఉగ్రవాద శిబిరాలను ఎలా ధ్వంసం చేసింది చూపించింది. అవును... గత రెండు రోజులుగా జమ్మూకశ్మీర్, రాజస్థాన్, పంజాబ్ ప్రాంతాల్లో పాకిస్థాన్ చేసిన డ్రోన్లు, క్షిపణులు, ఫైటర్ జట్లను భారత ఆర్మీ సమర్థంగా ఎదుర్కొంది. గురువారం అయితే సుమారు 400 డ్రోన్లను ఎదుర్కొన్నట్లు రక్షణ శాఖ తెలిపింది. ఆ దాడులకు ప్రతిస్పందనగా ఉగ్రవాద లాంచ్ ప్యాడ్ లపై ఎటాక్ చేసి ధ్వంసం చేసింది. హైదరాబాద్ కూ భాగ్యం ఈ సందర్భంగా... భారత సరిహద్దుకు దగ్గరగా ఉన్న ఉగ్రవాద లాంచ్ ప్యాడ్ ల నుంచి గతంలో భారత పౌరులు, భద్రతా దళాలపై దాడులకు ప్రణాళికలు రూపొందించారు.. ఇక్కడ నుంచి దాడులు కూడా చేశారు.. ఇప్పుడు ఈ లాంచ్ ప్యాడ్ ను ధ్వంసం చేయడంతో పాటు వారి మౌలిక సదుపాయాలు, సామర్థ్యాలకు భారీ దెబ్బ తగిలింది అని ఆర్మీ వీడియో షేర్ చేస్తూ పోస్టులో తెలిపింది.

## 'సౌత్ కాండిడేట్లు వద్దు'..సొంత గడ్డపై వివక్ష.. ముంబై సంస్థ దుర్బుద్ధికి నిదర్శనం!


We are Hiring 2 MSSQL DBAs at Vikhroli with the following specifics:

- Experience Required: Minimum 2 to 3 years
- Location: Vikhroli East WFO
- Immediate joiners preferred

- Required Male candidates

- Round 1 Virtual Interview & Round 2 Face to Face at Vikhroli Office

- No south candidates

Key expertise needed includes:
- Log shipping
- AlwaysOn theory
- Database size monitoring
- Blocking and mirroring
- Disaster recovery strategies


**న్యూఢిల్లీ-నవభూమి:** దేశం కోసం సైనికులు సరిహద్దుల్లో ప్రాణాలొడ్డి పోరాడుతుంటే.. సొంత గడ్డపై ప్రాంతీయ విద్వేషాలు మొదలయ్యాయి. ముంబైకి చెందిన ఒక సంస్థ ఉద్యోగ ప్రకటనలో చేసిన పని తీవ్ర దుమారం రేపుతోంది. 'సౌత్ కాండిడేట్లు వద్దు' అంటూ బహిరంగంగా చెప్పడానికి ఆ సంస్థకు ఎంత ధైర్యం? కేవలం పురుష టెక్కీల కోసమే ఈ ఉద్యోగం అంటూ చేసిన ప్రకటన ఇప్పుడు దేశవ్యాప్తంగా ఆగ్రహానికి కారణమైంది. ఇంతకీ ఆ సంస్థ ఏం చేసిందో వివరంగా తెలుసుకుందాం. ముంబైకి చెందిన ఒక సంస్థ విక్రోలి ప్రాంతంలోని టెక్నికల్ ఉద్యోగం కోసం ప్రకటన రిలీజ్ చేసింది. అందులో దరఖాస్తుదారులు రెండు మూడు సంవత్సరాల అనుభవం కలిగి ఉండాలని, వెంటనే విధుల్లో చేరడానికి సిద్ధంగా ఉండాలని, తప్పనిసరిగా ఆఫీసులో పనిచేయాలని పేర్కొంది. సెలక్షన్ ప్రాసెస్ లో వర్చువల్ ఇంటర్వ్యూ తర్వాత పర్సనల్ ఇంటర్వ్యూ కూడా ఉంటుందని కూడా తెలిపింది. డేటాబేస్ నిర్వహణ, బ్యాకప్ రికవరీ, విపత్తు నిర్వహణ వ్యూహాలు వంటి నిర్దిష్ట నైపుణ్యాలు కలిగిన అభ్యర్థులను ఆ సంస్థ కోరుతోంది. అయితే, అందరినీ ఆగ్రహానికి గురిచేసిన విషయం ఏమిటంటే.. ప్రాంతం ఆధారంగా చూపిన వివక్ష.. మన భారతీయ సైన్యం సరిహద్దుల్లో శత్రువులతో పోరాడుతుంటే, సొంత దేశంలోనే ఉత్తర, దక్షిణ ప్రాంతాల పేరుతో వివక్ష చూపడం అత్యంత బాధాకరం. ఈ ఉద్యోగ ప్రకటన స్క్రీన్ షాట్లు, ఒక అభ్యర్థి తీవ్రమైన స్పందన వెంటనే ఆన్‌లైన్‌లో వైరల్ అయ్యాయి. దక్షిణ భారతీయులు ఇతరులను మరింత ఆదరిస్తారని, అవమానం ఎదురైనా మర్యాదగా ఉంటారని ఆ అభ్యర్థి సంస్థ ప్రాంతీయ దురభిమానాన్ని తీవ్రంగా విమర్శించాడు. ఈ పరిస్థితి ఆఫీసుల్లో వివక్ష, నియామకాల్లో ప్రాంతీయ దురభిమానం గురించిన చర్చను మళ్లీ తెర మీదకు తెచ్చింది.

## 'ఆపరేషన్ సిందూర్' నేపథ్యంలో.. ఇండోర్ స్టేడియానికి బాంబు బెదిరింపు



**భోపాల్-నవభూమి:** సరిహద్దుల్లో పాకిస్థాన్ దాడులను 'ఆపరేషన్ సిందూర్' పేరుతో భారత్ తిప్పికొడుతు న్నది. ఈ నేపథ్యంలో మధ్యప్రదేశ్‌లోని క్రికెట్ స్టేడియానికి బాంబు బెదిరింపు వచ్చింది. ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో ఇండోర్‌లోని హోల్కర్ స్టేడియాన్ని పేల్చివేస్తామంటూ మధ్యప్రదేశ్ క్రికెట్ అసోసియేషన్ (ఎంపీసీఏ) కార్యదర్శికి ఈమెయిల్ అందింది. దీంతో ఆ సంస్థ వెంటనే అప్రమత్తమైంది. పోలీసులకు సమాచారం ఇచ్చింది.కాగా, పోలీసులు వెంటనే స్పందించారు. పోలీస్ బృందాలు, బాంబు స్క్వాడ్‌లు హోల్కర్ స్టేడియానికి చేరుకున్నారు. స్టేడియం ప్రాంగణాన్ని ఐదు గంటలపాటు క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఎలాంటి అనుమానాస్పద వస్తువు లభించలేదని పోలీస్ అధికారి తెలిపారు. దీంతో బెదిరింపు ఈమెయిల్‌గా భావిస్తున్నట్లు చెప్పారు. సైబర్ స్క్వాడ్‌తో కలిసి నకిలీ ఈ మెయిల్ మూలాన్ని తెలుసుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు వివరించారు. నిందితులను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

## శ్రీనగర్ ఓల్డ్ ఎయిర్‌ఫీల్డ్‌లో పాకిస్థాన్ డ్రోన్ కూల్చివేత



**న్యూఢిల్లీ-నవభూమి:** భారత్ హెచ్చరికలు చేస్తున్నా పట్టించుకోకుండా సరిహద్దుల్లో పాకిస్థాన్ కవ్వింపులకు పాల్పడుతూనే ఉంది. సరిహద్దు ప్రాంతాల్లోని పౌరులపై కూడా పాక్ సైనికులు కాల్పులకు తెగబడుతున్నారు. తాజాగా శ్రీనగర్ పై పాక్ డ్రోన్ దాడి కి ప్రయత్నించింది. ఆ దాడిని ఇండియన్ ఆర్మీ సమర్థంగా తిప్పికొట్టింది. శ్రీనగర్ పాత ఎయిర్‌ఫీల్డ్‌లో భారత ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థ పాక్ డ్రోన్‌ను కూల్చేసింది.

డ్రోన్‌ను కూల్చివేయడానికి ముందు కూడా శ్రీనగర్‌లో పేలుళ్ల శబ్దం వినిపించినట్లు అక్కడి ఆర్మీ అధికారులు తెలిపారు. శ్రీనగర్ విమానాశ్రయం సమీపంలో ఉదయం 11.45 గంటల ప్రాంతంలో రెండు భారీ పేలుళ్ల శబ్దాలు వినిపించాయని చెప్పారు. పేలుళ్ల కారణంగా ప్రజలు భయాందోళనకు గురయ్యారని, విద్యుత్ సరఫరా నిలిచిపోయిందని అన్నారు. అయితే పేలుళ్ల శబ్దం వినపడగానే పలు ప్రాంతాల్లో సైరన్లు మోగించి ప్రజలను అప్రమత్తం చేశామని తెలిపారు. అంతకుముందు అవంతిపురం సమీపంలో ఐదుసార్లు భారీ పేలుడు శబ్దాలు వినిపించినట్లు అధికారులు చెప్పారు. శ్రీనగర్‌లోని దాల్ సరస్సులో క్షిపణి లాంటి వస్తువు పడినట్లు గుర్తించామన్నారు. శనివారం తెల్లవారుజామున శ్రీనగర్ విమానాశ్రయంపై, ఎయిర్ బేస్‌పై డ్రోన్లతో దాడి చేయగా.. సైన్యం వాటిని తిప్పికొట్టింది. సరిహద్దు ప్రాంతాల్లో పాక్ వరుస దాడులకు పాల్పడుతుండడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.ప్రజలు బహిరంగ ప్రదేశాల్లో, బాల్కనీల్లో ఉండకుండా ఇళ్లల్లోనే ఉండాలని హెచ్చరించారు. పంజాబ్‌లోని బఠిండాలో అధికారులు రెడ్ అలర్ట్ విధించారు. శ్రీనగర్ ఎయిర్‌పోర్ట్ సమీపంలో పేలుళ్లు సంభవిస్తుండడంతో దానితో సహా ఉత్తర, పశ్చిమ భారత్‌లోని 32 విమానాశ్రయాలను ఈ నెల 15 వరకు మూసివేస్తూ కేంద్రం ఆదేశాలు జారీచేసింది.

## వైర్‌లెస్ ఎమర్జెన్సీ అలర్ట్.. నెట్‌వర్క్ లేకున్నా ఫోన్‌కు సందేశం

**న్యూఢిల్లీ-నవభూమి:** భారత్ పాకిస్థాన్ దేశాల మధ్య ఉద్రిక్తతలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. పహల్గాం ఉగ్రదాడి కి ప్రతీకారంగా పాకిస్థాన్‌లోని, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రవాద స్థావరాలపై ఆపరేషన్ సిందూర్ పేరుతో భారత్ సర్జికల్ స్ట్రైక్స్ చేస్తోంది. ఈ క్రమంలో పాకిస్థాన్ మాత్రం సాధారణ పౌరులు, ఇండియన్ ఆర్మీ ని లక్ష్యంగా చేసుకుని దాడులకు పాల్పడుతోంది.దాంతో సరిహద్దు ప్రాంతాల ప్రజలను హెచ్చరిస్తూ అధికారులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. అందులో భాగంగా యుద్ధానికి సంబంధించి నేరుగా ఫోన్లకే హెచ్చరిక సందేశాలూ వచ్చేలా ఏర్పాట్లు చేశారు. నెట్‌వర్క్ సమస్య ఉన్నా కూడా మెసేజ్‌లు వచ్చే వెసులుబాటు కల్పించారు. ప్రజలు తమ ఫోన్‌లకు వచ్చే సందేశాలను పాటిస్తూ సురక్షితమైన ప్రాంతాలకు చేరుకోవచ్చు.సునామీలు, భూకంపాలు లాంటి ప్రకృతి విపత్తులు వచ్చినప్పుడు, యుద్ధాలు, ఉగ్రవాద దాడులు జరిగినప్పుడు ప్రజలను అప్రమత్తం చేసేందుకు భారత ప్రభుత్వం వైర్‌లెస్ ఎమర్జెన్సీ అలర్ట్ వ్యవస్థ ను రూపొందించింది. ఆకస్మిక పరిస్థితుల్లో ప్రజలకు అలర్ట్ మెసేజ్ ద్వారా సమాచారం చేరవేయడమే లక్ష్యంగా దీన్ని రూపొందించింది.

## సంక్షోభ సమయంలో మీకు సిగ్గనిపించట్లేదా.. బీజేపీపై ప్రకాశ్ రాజ్ విమర్శలు



ఒకవైపు శత్రుదేశం పాకిస్థాన్‌తో భారత్ వీరోచితంగా పోరాడుతుంటే మరోవైపు బీజేపీ సోషల్ మీడియా వేదికగా తన నీచబుద్ధి చూపిస్తుందని నటుడు ప్రకాశ్ రాజ్ విమర్శలు గుప్పించాడు. భారత్ పాక్ ఉద్రిక్తతల నేపథ్యంలో భారత్ శాంతి చర్చలంటూ సమయం గడపదంటూ ఒక వీడియోను పోస్ట్ చేసింది బీజేపీకి చెందిన అధికారిక సోషల్ మీడియా. అయితే ఈ వీడియోపై ప్రకాశ్ రాజ్ స్పందిస్తూ..'ఇలాంటి సంక్షోభ సమయంలో సైన్యం యుద్ధం చేస్తుంది.. సరిహద్దుల్లో పౌరులు రక్తమోడుతున్నారు.

దేశం ఐక్యంగా పోరాడుతుంది. కానీ కొందరూ మతోన్మాద మూర్ఖులు మాత్రం అత్యంత నీచమైన రాజకీయాలు చేస్తున్నారు. భారతీయ మతోన్మాద పార్టీ దిగజారుడు రాజకీయాలు చేస్తుంది. ఇలా చేస్తుంటే మీకు సిగ్గనిపించట్లేదా". అని ప్రకాశ్ రాజ్ ఎక్స్ వేదికగా ప్రశ్నించాడు.

నవచిత్ర



## 'సింగిల్స్'తో హాట్ లేడీ ఇక ట్రాక్‌లోకి వచ్చేసినట్టేనా?



డబుష్మాష్ వీడియోలతో నెట్టింట పాపులర్ అయిన ఢిల్లీ భామ కేతికశర్మ. సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్‌గా మంచి క్రేజ్‌ని సొంతం చేసుకున్న కేతిక వెర్సటైల్ డైరెక్టర్ పూరి దృష్టిని ఆకర్షించి తొలి అవకాశాన్ని దక్కించుకుంది. పూరి తనయుడు ఆకాష్ పూరి హీరోగా నటించిన రొమాంటిక్ మూవీతో టాలీవుడ్‌లో హీరోయిన్‌గా కెరీర్ ప్రారంభించింది. కానీ తొలి మూవీతో హాట్ బేబీగా గుర్తింపుని తెచ్చుకుందే కానీ హిట్‌ని మాత్రం దక్కించుకోలేకపోయింది. హాటీగా పూర్తి ఎఫర్ట్ పెట్టినా కథ, కథనాలు ఆకట్టుకోలేకపోవడంతో కేతికకు తొలి అడుగులోనే పరాభవం ఎదురైంది. ఆ తరువాత నాగశౌర్యతో చేసిన లక్ష్య, వైష్ణవ్ తేజ్‌తో చేసిన రంగ రంగ వైభవంగ కూడా అదే కోలలో చేరి కేతికని తవ్రంగా నిరాశకు గురి చేసింది. పవర్‌స్టార్‌తో కలిసి సాయిధరమ్ తేజ్ చేసిన బ్రోకూడా కేతిక కెరీర్‌ని ట్రాక్‌లో పెట్టలేకపోయింది. అయితే ఇటీవల నితిన్ నటించిన రాబిన్ హుడ్‌లో అదిదా సర్‌ప్రైజ్‌అంటూ ఐటమ్ నంబర్‌లో హీటెక్కించింది. శేఖర్ మాస్టర్ వివాదాస్పద స్టెప్పులతో వార్తల్లో నిలిచింది. సినిమా హిట్ కాకపోయినా కేతికని మాత్రం వార్తల్లో నిలిపేలా చేసింది. అయితే కేతిక ఐటమ్ నంబర్లకే పరిమితమా? హీరోయిన్‌గా సక్సెస్‌ని దక్కించుకోలేదా? అనే కామెంట్‌లు వినిపించాయి. ఎంతగా ప్రయత్నించినా తనకు కమర్షియల్ విజయం లభించకపోవడంతో కేతిక కూడా కొంత నిరుత్సాహానికి గురైంది. అయితే తాజాగా శ్రీవిష్ణుతో కలిసి చేసిన సింగిల్ రీసెంట్‌గా విడుదలై మంచి విజయాన్ని సొంతం చేసుకుంది. హీట్ సమ్మర్‌లో కూల్‌హిట్‌గా నిలిచి శ్రీవిష్ణుతో పాటు కేతికకు, లవ్ టుడే ఫేమ్ ఇవానకు మంచి విజయాన్ని అందించింది. చాలా రోజుల తరువాత కేతిక శర్మకు సింగిల్‌తో సక్సెస్ లభించింది. దీంతో హాట్ లేడీగా పేరు తెచ్చుకున్న కేతిక ఇక ట్రాక్‌లోకి వచ్చేసినట్టేనా? అనే కామెంట్‌లు వినిపిస్తున్నాయి.

ఫస్ట్ డే ఫస్ట్ షో నుంచే పాజిటివ్ టాక్‌ని సొంతం చేసుకున్న సింగిల్ వసూళ్ల పరంగానూ మంచి ఫిగర్లని నమోదు చేస్తుండటంతో ఇక కేతిక కెరీర్ టర్న్ అయినట్టేనని ఇండస్ట్రీ వర్గాలు అంటున్నాయి. ఈ మూవీ తరువాత కేతిక తమిళ డైరెక్టర్ రాజేష్ ఎం.సెల్వ డైరెక్షన్‌లో ఓ మూవీ చేస్తోంది. ఇది కూడా హిట్ అనిపించుకుంటే తెలుగులో కేతికకు ఇక తిరుగుండదన్నమాటే.

## సవాల్ విసిరే పాత్రలకే సై!



బాలీవుడ్‌లో అనన్యా పాండే కెరీర్ మూడు పువ్వులు..ఆరు కాయలుగా సాగిపోతుంది. జయాపజయాలను బ్యాలెన్స్ చేస్తూ ముందుకెళ్తుంది. టాలీవుడ్ లో కలిసి రాలేదు కానీ, బాలీవుడ్ లో మాత్రం మంచి కెరీర్ ని బిల్డ్ చేసుకుంటుంది. ఇటీవలే 'కేసరి చాప్టర్ 2'తో మరో సక్సెస్ ఖాతాలో వేసుకుంది. ఇందులో అమ్మడి పాత్రకు మంచి పేరొచ్చింది. నటనకు ఆస్కారం ఉన్న రోల్ కావడంతోనే ఇది సాధ్యమైంది. ఈ నేపథ్యంలో ఈ సినిమా అనన్యా పాండేలో చాలా మార్పులు తీసుకొచ్చినట్లు ఆమె మాటల్లో కనిపిస్తుంది. కథల విషయంలో ఎలా వ్యవహరించాలి? అన్నది ఈ సినిమా ఓ అవగాహన ఇచ్చిందని తెలిపింది. 'బ్యాడ్ న్యూ'జ్, 'కాల్ మీ బె' లాంటి చిత్రాల్లో ఇప్పటి వరకూ తాను చేసినవి కేవలం కామెడీ పాత్రలని... గ్లామరస్ పాత్రల్లో నటిస్తే కేవలం అనుభూతి మాత్రమే వస్తుందంది. కానీ 'కేసరి' లాంటి సినిమాలో సవాల్ విసిరే పాత్ర చేస్తే అసలైన నటి బయటకు వచ్చిందని అభిప్రాయపడింది. ఇక పై ఎలాంటి పాత్ర తీసుకున్నా? అది సవాల్ గా ఉండాలి తప్ప సునాయాసంగా ఉండకూడదంది. శక్తి వంతమైన పాత్రలు పోషించినప్పుడే ఏ నటిలోనైనా అసలైన నటి బయటకు వస్తుందని తెలిసింది. కెరీర్ కొత్తలో ఇలాంటివి తెలియక తప్పులు జరగడం సహజమైనా? ఇప్పుడున్న పోటీలో అలాంటి తప్పులు ఆరం భంలో కూడా చేయకూడదని అభిప్రాయపడింది. అలా చేస్తే అవకాశాలు రావడం కష్టమంది. మొత్తానికి అనన్యలో చాలా మార్పులు కనిపిస్తున్నాయి. కెరీర్ ఆరంభంలో ఎంతో దూకుడుగా వ్యవరించిన అమ్మడు ఇప్పుడా దూకుడు కూడా తగ్గించింది. ప్రొఫెషనల్ కెరీర్ లోనే కాదు...పర్సనల్ కెరీర్ లోనే అనన్య లో చాలా మార్పులొచ్చాయని ఆమె ని దగ్గర నుంచి చూసే స్నేహితులు అభిప్రాయపడుతున్నారు. మార్పు మంచిదే కదా. 'లైగర్' సినిమాతో అనన్యా పాండే టాలీవుడ్ లో

## మరోసారి హీటెక్కించే లుక్కుతో మంచు లక్ష్మి




లక్ష్మీ మంచు లేటెస్ట్ ఫోటోషూట్ సోషల్ మీడియాలో మళ్ళీ వైరల్ అవుతోంది. బ్లాక్ స్కర్ట్, గ్లిట్టర్ బ్లౌజ్, ఫ్లోరల్ జాకెట్‌తో కూర్చుని ఇచ్చిన ఈ స్టయిల్ పిక్స్ చూసి అభిమానులు ఫిదా అయ్యారు. ఆమె లుక్‌లో కేవలం గ్లామర్ మాత్రమే కాదు, కాన్ఫిడెన్స్ కూడా కనిపిస్తోంది. ఈ లుక్‌ను ఆమె ఇలాంటి లుక్ లో ఉండడం నాకు చాలా ఇష్టం అంటూ ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేయడం విశేషం. లక్ష్మీ మంచు టాలీవుడ్‌లో మాత్రమే కాకుండా హాలీవుడ్‌లో కూడా అడుగుపెట్టిన నటి. 'అనగనగా ఒక ధీరుడు', 'గుండెల్లో గోదారి' వంటి చిత్రాల్లో తన ప్రతిభను చూపించింది. వెబ్ సిరీస్‌లు, టెలివిజన్ షోల్లో కూడా ఆమె తన టాలెంట్‌తో గుర్తింపు తెచ్చుకుంది. నిర్మాతగానూ ఆమెకి ప్రత్యేక స్థానం ఉంది. ఈ ఫోటోల్లో ఆమె వేసిన ఫ్లోరల్ జాకెట్‌తో కూడిన అవుట్‌ఫిట్, ఘనత పొందిన డిజైనర్ గజల్ గుప్తా కౌచర్ నుంచి వచ్చినది. జ్యువెలరీ డీపా గూర్నాని డిజైన్ చేయగా, నిఖితా నిరంజన్ స్టైలింగ్ చేశారు. ఈ ఫోటోలు లక్ష్మీ గ్లామర్ పరిధిని, ఫ్యాషన్ ఎక్స్‌పెరిమెంట్స్‌పై ఉన్న ఆసక్తిని చూపిస్తున్నాయి. అందం అంటే కేవలం రూపం మాత్రమే కాదు, అటిట్యూడ్ కూడా అని లక్ష్మీ మరోసారి చూపించారు. తన అందం, గ్లామర్‌తో పాటు ఎదిగిన కేరియర్‌తో లక్ష్మీ టాలీవుడ్‌లో ప్రత్యేకమైన స్థానం సంపాదించుకుంది. ఫ్యాషన్‌లో కొత్త ట్రైల్స్ చేయడంలో ఆమె ఎప్పుడూ ముందుండేలా ఉంటుంది. అభిమానులు ఈ లేటెస్ట్ ఫోటోలకు మంచి రెస్పాన్స్ ఇస్తున్నారు. లక్ష్మీ మంచు ఇలా కొత్త లుక్స్‌లో కనిపిస్తే మరోసారి ఫ్యాన్స్‌కి ఫ్యాషన్ ఇన్‌స్పిరేషన్‌గా నిలుస్తుంది. ఈ ఫ్లోరల్ లుక్‌కి సోషల్ మీడియాలో ఇప్పటికే లక్షల లైకులు, కామెంట్స్ వస్తున్నాయి.

## వార్‌పై వెంకీ హీరోయిన్ పోస్ట్..నెట్టింట ఏకేస్తున్నారుగా!



భారత్ - పాకిస్థాన్‌ల మధ్య రోజు రోజుకూ ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో సోషల్ మీడియా వేదికగా పలువురు పెడుతున్న పోస్ట్‌లు వివాదానికి దారి తీస్తున్నాయి. దాయాది దేశం దుర్భుద్ధితో ఇండియాపై దాడి చేస్తున్నా ఆ విషయాన్ని పరిగణలోకి తీసుకోకుండా కొంత మంది యుద్ధం వద్దు. పాక్‌తో యుద్ధం అసలే వద్దు, ఉగ్రవాదాన్ని ఏరివేయడానికే సైన్యం శిక్షణ తీసుకుంది కానీ వారితో యుద్ధం చేయడానికి కాదు అంటూ పలువురు సోషల్ మీడియా వేదికగా పోస్ట్‌లు పెడుతూ అడ్డంగా బుక్కవుతున్నారు. తాజాగా విక్టరీ వెంకటేష్ తో 'సంక్రాంతికి వస్తున్నాం' అంటూ బ్లాక్ బస్టర్ హిట్‌ని సొంతం చేసుకున్న హీరోయిన్ ఐశ్వర్యా రాజేష్ ఇదే తరహాలో సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టి అడ్డంగా బుక్కయింది. పాకిస్థాన్ దొంగబుద్ధికి ధీటుగా భారత సైన్యం జవాబు చెబుతూ భీకరంగా పోరాటంచేస్తున్న వేళ యావత్ భారతం అంతా వారి వెంట నడుస్తుంటే హీరోయిన్ ఐశ్వర్యా రాజేష్ మాత్రం అందుకు భిన్నంగా వ్యవహరించి పాక్‌తో యుద్ధం వద్దు అని పోస్ట్ చేసి నెటిజన్‌ల ఆగ్రహానికి గురవుతోంది. ఐశ్వర్యా రాజేష్ తన ఇన్‌స్టాగ్రామ్ పేజ్‌లో 'యుద్ధానికి నో చెప్పండి. ప్రజాస్వామ్య దేశ సిటిజన్‌గా నేను భారత్, పాక్ దేశాలకు యుద్ధం బదులుగా శాంతిని ఎంచుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాను. అర్థం చేసుకునే దిశగా చర్యలు తీసుకుందాం. అనవసరమైన ప్రాణనష్టాన్ని నివారించండి. సైనికులు, నైపుణ్యం కలిగిన వ్యక్తులు, అమాయక ప్రజలు ఈ యుద్ధఃలో చనిపోకూడదు. ఈ సందేశం అందరికీ చేరనివ్వండి' అంటూ పోస్ట్ చేసింది. ఐశ్వర్యా రాజేష్ పోస్ట్ పెట్టిన ఉద్దేశ్యం శాంతిని కోరుకోవడమే అయినా తను స్పందించిన తీరు మాత్రం నెటిజన్‌లకు, సాటి భారతీయులకు నచ్చడం లేదు. దీంతో ఐశ్వర్యా రాజేష్‌పై తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తూ నెట్టింట ఆమెని ట్రోల్ చేస్తున్నారు. తాజాగా పాక్‌తో భారత్ యుద్ధం చేస్తుండటానికి ప్రధాన కారణం సీమాంతర ఉగ్రవాదం. దాన్ని పెంచి పోషిస్తూ ఇటీవల పెహల్గావ్‌లో భారతీయులను వారి భార్యల ముందే ఉగ్రమూకలు కాల్చి చంపడం వల్లే ఈ దుర్ఘటనకు ధీటుగా సమాధానం చెప్పాలనే భారత్ పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లో ఉగ్ర లాంచ్ ప్యాడ్‌లపై దాడులకు దిగింది. ఈ సంఘటనని కనీసం కోట్ చేయని ఐశ్వర్యా రాజేష్ శాంతి అని, పాక్‌తో యుద్ధం వద్దు అంటూ పోస్ట్ పెట్టడం ఏంటని పలువురు మండిపడుతున్నారు. మరో రికార్డ్ బ్లాస్ట్ అంతే కాకుండా శాంతి ప్రవచనాలు వల్లించే ముందు పాక్ మన దేశాన్ని ఆక్రమించిన విషయాన్ని, మనపై ఉగ్రమూకలతో దాడులు చేయిస్తున్న క్రమాన్ని కూడా ఐశ్వర్య ఎండగడితే బాగుండేదిని, అలాంటి విషయాల్ని పక్కన పెట్టి యుద్ధం వద్దు శాంతే ముద్దు అంటూ సూక్తులు చెప్పడం ఎంత వరకు కరెక్ట్ అని ఆమె అభిమానులు కూడా ఫైర్ అవుతున్నారు.

## 200 కోట్ల బడ్జెట్ తో దేవరకొండ సినిమా!



విజయ్ దేవరకొండ కథానాయకుడిగా రాహుల్ సంకృత్యన్ దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ ఓ చిత్రం నిర్మిస్తున్న సంగతి తెలిసిందే. 'కింగ్ డమ్' రిలీజ్ అనంతరం విజయ్ ఈ సినిమానే పట్టాలెక్కిం చనున్నాడు. బ్రిటీష్ కాలం నేపథ్యంలో సాగే స్టోరీ ఇది. 1854-1878 మధ్య జరిగిన చారిత్రాత్మక సంఘట నలు ఆధారంగా రూపొందిస్తున్నారు. భారీ కాన్వాస్ పై పిరియాడిక్ చిత్రంగా రూపొందనుంది. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు వేగంగా జరుగుతున్నాయి. కొన్నాళు ్లగా రాహుల్ ఇదే పనిలో ఉన్నాడు. ఇప్పటికే విజయ్ ద్యాన ముద్రలో ఉన్న పోస్టర్ ను కూడా రిలీజ్ చేసారు. పోస్టర్ తోనే ఓ రేంజ్ లో హైప్ క్రియేట్ అయింది. పాన్ ఇండియా స్థాయిలో ఇప్పటి వరకూ ఎవరూ తెరకెక్కించని పాయింట్ ని తీసుకుని తెరకెక్కిస్తున్నారు? అన్నది అర్దమైంది. బలమైన కథ, క థనాలతో రూపొందుతున్న చిత్రంగా అప్పుడే ప్రచారం పీక్స్ కి చేరింది. మరి ఈ పాన్ ఇండియా సినిమా బడ్జెట్ ఎంత అన్నది ఇంతవరకూ ఎక్కడా బయటకు రాలేదు. కథని బట్టి బట్టి బడ్జెట్ కూడా భారీగా ఉంటుందని ఓ అంచనా తెరపైకి వస్తుంది. ఈ నేపథ్యంలో ఈ సినిమా కోసం మైత్రీ మూవీ మేకర్స్ 200 కోట్ల బడ్జెట్ కేటాయించినట్లు నిర్మాణ వర్గాల నుంచి తెలిసింది. సినిమాలో సెట్స్ కోసమే 70 కోట్లకు పైగా ఖర్చు అవుతుందిట. ఇది కేవలం ఓ అంచనా మాత్రమే. 1800 నాటి కాలం నాటి కథ అంటే అంతా సెట్స్ లోనే షూటింగ్ చేయాలి. ఆ నాటి కాలాన్ని సెట్స్ రూపం లో తీసుకురావాలి. అదీ ఎంతో వాస్తవికంగా ఉండాలి. సాధారణ సినిమా సెట్స్ కోసమే కోటి రూపాలు ఈజీగా ఖర్చు అవుతుంది. ఈ నేపథ్యంలో బ్రిటీష్ కాలం నాటి సెట్స్ వేయడం అంటే భారీ ఖర్చు తప్పదు. ఇప్పటికే కొన్ని రకాల సెట్లు సిద్దం చేస్తున్నారు. ఇవన్నీ తొలి దశ షూటింగ్ కి సంబంధించిన సెట్స్ అని సమాచారం.

## ఆసియా కప్ స్థానంలో ఐపీఎల్.. బీసీసీఐ వ్యూహం ఫలించేనా..!



**న్యూఢిల్లీ-నవభూమి:** సరిహద్దుల్లో ఉద్రిక్తతల నేపథ్యంలో ఐపీఎల్ 18వ సీజన్‌ను వారం పాటు వాయిదా పడింది. వారం తర్వాత పరిస్థితి ఏంటీ? అనేది ఇప్పుడు అభిమానులతో పాటు ఫ్రాంచైజీ యజమానులకు అంతుచిక్కడం లేదు. అయితే.. బీసీసీఐ మాత్రం త్వరలోనే మిగతా 16 మ్యాచ్‌లకు కొత్త షెడ్యూల్ ప్రకటించేందుకు సిద్ధమవుతోంది. త్వరితగతిన టోర్నీని నిర్వహించడంపై దృష్టి సారించిన భారత బోర్డు.. కొన్ని కీలక నిర్ణయాలు తీసుకొనే అవకాశముంది. వాటిలో ఆసియా కప్‌ఆతిథ్యాన్ని వదులుకోవడం ఒకటి. ఇక రెండోది బంగ్లాదేశ్‌తో పర్యటనను రద్దు చేసుకోవడం. వీటిలో ఏదో ఒకటి సాధ్యమైనా ఆగస్టు లేదా సెప్టెంబర్‌లో 18వ సీజన్ తదుపరి మ్యాచ్‌లు ఆడించేందుకు వీలుంటుంది. ఇంతకూ.. బీసీసీఐ వ్యూహం ఫలించేనా? అనేది అందరినీ ఆలోచింపజేస్తుంది.

**ఆగస్టు లేదా సెప్టెంబర్‌లో**

'దేశంలో నెలకొన్న పరిస్థితులు.. ఆటగాళ్ల భద్రత దృష్ట్యా ఐపీఎల్‌ను వారం పాటు వాయిదా వేశాం. ప్రస్తుతానికైతే లీగ్ నిర్వహణపై తుది నిర్ణయానికి రాలేదు. అయితే.. ఈ మూడు రోజుల్లో ఏం జరుగుతుంది? అనేది ఆసక్తిగా గమనిస్తున్నాం. పరిస్థితులు చక్కబడ్డాక కొత్త షెడ్యూల్ ప్రకటిస్తాం' అని బీసీసీఐ వర్గాలు తెలిపాయని క్రిక్‌బజ్ వెల్లడించింది. ఈ నేపథ్యంలో ఐపీఎల్ తదుపరి మ్యాచ్‌లను ఆగస్టు లేదా సెప్టెంబర్‌లో నిర్వహిస్తారనే వార్తలు వినిపిస్తున్నాయి. అది కూడా రెండు మూడు డబుల్ హెడర్‌లు ఆడించడం ద్వారా తక్కువ సమయంలోనే ఐపీఎల్‌ను పూర్తి చేయవచ్చని బీసీసీఐ భావిస్తోందట.

## అదిదా ట్విస్ట్..! టెస్టులకు విరాట్ కోహ్లి రిటైర్మెంట్..?



**న్యూఢిల్లీ-నవభూమి:** టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ టెస్టులకు రిటైర్‌మెంట్ ప్రకటించాడు. విరాట్ కోహ్లీ సైతం రిటైర్మెంట్ ప్రకటించబోదు తున్నాడని.. ఈ మేరకు బీసీసీఐకి సమాచారం అందించినట్లుగా తెలుస్తున్నది. అయితే, బోర్డు ఉన్నతాధికారులు తన నిర్ణయంపై పునరాలోచించుకోవాలని విరాట్‌కు సూచించినట్లు సమాచారం. త్వరలో ఇంగ్లాండ్ పర్యటన నేపథ్యంలో విరాట్‌ను తన నిర్ణయాన్ని పునః పరిశీలించాలని బీసీసీఐ కోరినట్లు ఇండియన్ ఎక్స్‌ప్రెస్ పేర్కొంది. రోహిత్ శర్మ ఇటీవల టెస్ట్ క్రికెట్ నుంచి రోహిత్ శర్మ రిటైర్మెంట్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో విరాట్ సైతం నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. వచ్చే నెలలో ఇంగ్లాండ్‌లో జరగనున్న ఐదు టెస్ట్‌ల సిరీస్‌కు జట్టును ఎంపిక చేసేందుకు సెలెక్టర్లు త్వరలోనే సమావేశం కానున్నారు. ఇండియన్ ఎక్స్‌ప్రెస్ కథనం ప్రకారం.. ఆస్ట్రేలియా వేదికగా జరిగిన బోర్డర్ గవాస్కర్ సిరీస్ నుంచి కోహ్లీ తన టెస్టుల భవిష్యత్‌ను పరిశీలిస్తున్నాడు. ఆ సిరీస్‌లో తొలి మ్యాచ్‌లో సెంచరీ చేసిన విరాట్.. ఆ తర్వాత పెద్దగా పరుగులు చేయలేకపోయాడు. పెర్త్‌లో జరిగిన మొదటి టెస్ట్ మ్యాచ్‌లో రెండో ఇన్నింగ్స్‌లో సెంచరీ చేశాడు. ఆ తర్వాత కోహ్లీ మిగిలిన నాలుగు టెస్ట్ మ్యాచుల్లో ఏడు ఇన్నింగ్స్‌లలో 90 పరుగులు మాత్రమే చేయగలిగాడు.ల

నవక్రీడ

## భారత్‌లో 2027 ప్రపంచ టెస్ట్ చాంపియన్‌షిప్ ఫైనల్..!



**న్యూఢిల్లీ-నవభూమి:** భారత క్రికెట్ నియంత్రణ మండలి 2025-2027 సైకిల్ ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్‌ను భారత్‌లోనే పరిశీలిస్తున్నది. డబ్ల్యూటీసీ తొలి ఎడిషన్ ఫైనల్ 2021లో సౌతాంప్టన్‌లో, రెండో ఎడిషన్ ఫైనల్ 2023లో ఓవల్‌లో జరిగింది. 2025 ప్రపంచ టెస్ట్ చాంపియన్ షిప్ ఫైనల్ ఈ ఏడాది వచ్చే నెల లార్డ్స్‌లో జరుగనున్నది. గత నెలలో జింబాబ్వేలో జరిగిన ఐసీసీ చీఫ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్స్ కమిటీలో చర్చలు జరిగాయి. ఈ చర్చల్లో ఐపీఎల్ చైర్మన్ అరుణ్ దుమాల్ బీసీసీఐ తరపున పాల్గొన్నారు. భారతదేశం రాబోయే డబ్ల్యూటీసీ ఫైనల్‌కు చేరుకుంటే.. అభిమానులకు గొప్ప అవకాశం అవుతుందని, కానీ భారత్ ఫైనల్ ఆడకపోయినా చాలా మంది ఇతర రెండు అగ్ర జట్ల మధ్య జరిగే మ్యాచ్‌పై ఆసక్తి చూపుతారని భావిస్తున్నారు. భారత్ ఇప్పటి వరకు రెండుసార్లు డబ్ల్యూటీసీ ఫైనల్‌కు చేరింది. 2021లో న్యూజిలాండ్ చేతిలో, 2023లో ఆస్ట్రేలియా చేతిలో ఓటమిపాలైంది. భారత జట్టు ఈ ఎడిషన్‌లో 2025 సైకిల్ ఫైనల్‌కు అర్హత సాధించలేకపోయింది. ఇదిలా ఉండగా.. స్వదేశంలో న్యూజిలాండ్, ఆస్ట్రేలియాలో బోర్డర్ గవాస్కర్ సిరీస్‌లో ఓటమి తర్వాత ప్రపంచ చాంపియన్ షిప్ ఫైనల్ రేసు నుంచి టీమిండియా నిష్క్రమించింది. ఇదిలా ఉండగా.. ఇటీవల భారత జట్టు కెప్టెన్ రోహిత్ శర్మ టెస్ట్‌ల నుంచి రిటైర్ అయ్యాడు.

Printed,Published & Owned by SHAIK SHAHANAZ, Printed at SUPER PRINTERS Web offset Printers 2-3-655/C/118,Azad Nagar,Amberpet Circle 23,HYDERABAD -500113(T.S.), and Published D.No: 10-2-287/1/,Ground Floor,Santhinagar,A.C Guards,Masabtank,HYDERABAD - 500028,State TELANGANA (India). Editor: **SHAIK SHAHANAZ**, Phone: 9246213493,Email : navabhoomidaily@gmail.com,navabhoomi1@gmail.com **RNI No: TEL TEL: 82083**